11 . 2. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

బుధవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 247 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



## వేములవాడ శివరాత్రి ఉత్సవాలకు సిఎంకు ఆహ్వానం

**హైదరాబాద్,ఫిబ్రవరి10 వెలుతురు:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి మహా శివరాత్రి జాతర మహోత్సవానికి ఆహ్వానించారు. మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఆలయ ఈవో రమాదేవి, ఆలయ అర్చకులు. కలసి ఆహ్వాన పత్రిక అందచేశారు. అలాగే

# తెలంగాణపై కేంద్రం ఆర్థిక వివక్ష

- తెలంగాణకు నిధుల్లో కోత.. ఇది ఫెడరలిజంపై దాడే...
- సొమ్ములు మావి.. గొప్పలు మీవా.?
- ప్రతిసారి మేమిచ్చాం, మేము తెచ్చాం అని అంటున్నారు, అది తెలంగాణ ప్రజల సొమ్ము.
- తెలంగాణ కేంద్రానికి ఇచ్చేది 1,33,208 కోట్లు...
- కేంద్రం తిరిగి తెలంగాణకు ఇచ్చింది కేంద్ర పథకాలతో కలిపి కేవలం 51 వేల కోట్లు మాత్రమే.
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 10:**
దేశానికి అధికంగా ఆదాయం సమకూర్చుతున్న దక్షిణాది రాష్ట్రాలు నేటి కేంద్ర ఆర్థిక విధానాల వల్ల అన్యాయానికి గురవుతున్నాయని, ఇది కేవలం ఆర్థిక వివక్షే కాదుడ రాజకీయ ఉద్దేశంతో కూడిన వివక్ష అని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. "వికసిత్ భారత్" అనే నినాదం ఇస్తూ దేశ అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకుం టున్న కేంద్ర ప్రభుత్వం, దక్షిణాది రాష్ట్రాల పట్ల ముఖ్యంగా తెలంగాణ విషయంలో స్పష్టమైన వివక్ష, నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తోందని అన్నారు.

### *దేశ ఆదాయానికి దక్షిణాది వెన్నెముక...*

201819 నుంచి 202223 వరకు ఐదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం వసూలు చేసిన మొత్తం పన్నులు రూ. 90. 80 లక్షల కోట్లు అయితే, ఇందులో దక్షిణాది రాష్ట్రాల నుండే పావుభాగానికి పైగా రూ. 22. 86 లక్షల కోట్లు వచ్చాయన్నారు. అయినప్పటికీ, ఈ స్థాయిలో ఆదాయం ఇచ్చిన దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం తిరిగి ఇచ్చిన నిధులు

## ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ జరుగుతోంది.. బాధ్యులపై ఉక్కుపాదం తప్పదు!

- ఎక్కడెక్కడ పరికరాలు పెట్టారో ఆరా తీస్తున్నాం
- మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు
- పుర పోరులో కాంగ్రెస్ ప్రభంజనం..
- 80 శాతం పైగా స్థానాలు కైవసం చేసుకోవడం ఖాయం


**ఖమ్మం వెలుతురు ఫిబ్రవరి 10:**
రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలోనే కాకుండా ప్రస్తుతం కూడా రాష్ట్రంలో ఫోన్



ట్యాపింగ్ కొనసాగుతోందని, దీనిపై ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా ఉందని వెల్లడించారు. మంగళవారం ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ట్యాపింగ్ కోసం ఎక్కడెక్కడ ఎక్విప్‌మెంట్ (పరికరాలు) అమర్చారో ప్రభుత్వం ఇప్పటికే ఆరా తీస్తోందని, విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## చంద్రయాన్-4 కోసం ల్యాండింగ్ సైట్ గుర్తింపు

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 10:**
చంద్రయాన్–4 మిషన్ కోసం చంద్రుడి దక్షిణ ధృవంలో ల్యాండింగ్ సైట్(దిగే ప్రాంతం)ను ఇస్రో గుర్తించింది. ఈ ప్రాజెక్ట్‌ను భారత్ అత్యంత క్లిష్టమైనదిగా భావిస్తున్నది. 'చంద్రయాన్–4 కోసం మేం 2028ని లక్ష్యంగా చేసుకున్నాం' అని ఇస్రో చైర్మన్ నారాయణన్ తెలిపారు. అయిదు ప్రాంతాలను



పరిశీలించిన మీదట మాన్స్ మౌటన్(ఎంఎం) అనే ప్రాంతాన్ని ల్యాండింగ్ కోసం ఖరారు చేసినట్టు ఇస్రో అధికారులు తెలిపారు.

## స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాస తీర్మానం

- నోటీసులో సాంకేతిక లోపం.. సవరించి అందచేత



## పిఎంజిఎస్‌వై నిధుల మంజూరుకు

కేంద్రానికి ప్రతిపాదనలు పంపండి

- సిఎస్ కె. రామకృష్ణా రావు



**హైదరాబాద్,ఫిబ్రవరి10 వెలుతురు:**
ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన నాలుగవ దశలో భాగంగా రాష్ట్రంలో రోడ్

## మహదేవప్ప మృతికి రేవంత్‌దే బాధ్యత

ఎన్నికల సంఘం విచారణ జరపాలి

మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

## బిజెపి నేత మహదేవప్ప మరణానికి అధికార కాంగ్రెస్ పెద్దల దౌర్జన్యమే కారణం...

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 10:**
మక్తల్ పట్టణంలో బిజెపి నేత మహదేవప్ప మరణానికి అధికార కాంగ్రెస్ పెద్దల దౌర్జన్యం, వేధింపులే కారణం. మహదేవప్ప మరణంపై సమగ్ర విచారణ జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలనీబిజెపి శాసన సభా పక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రోజున పత్రిక ప్రకటన విడుదల చేశారు. మక్తల్ మున్సిపాలిటీకి జరుగుతున్న ఎన్నికల్లో ఆరవ వార్డు నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎస్.టి. వర్గానికి చెందిన ఎరుకల మహదేవప్ప ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరం. సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా మహబూబ్ నగర్ లో మంత్రి వాకిటి శ్రీహరి సొంత అసెంబ్లీ



## ఆదర్శ శిఖరమా అభిమాన సంద్రమా.... సాహో.... సంజయ్

### కార్యకర్తలపై మీకున్న ప్రేమ అదరహో...

- మున్సిపల్ ఎన్నికల్లో అన్నీ తానై బీజేపీ కార్యకర్తలను గెలిపించేందుకు శ్రమిస్తున్న వైనం...
- తెలంగాణ రాజకీయాల్లో 'టాక్ ఆఫ్ ది గ్రేట్ పొలిటికల్ వారియర్' గా మారిన బండి సంజయ్
- తనను గెలిపించిన కార్యకర్తల రుణం తీర్చుకునేందుకు సర్వశక్తులు ఒడ్డిన సంజయుడు



కరీంనగర్ వెలుతురు ఫిబ్రవరి 10:
తెలంగాణ రాజకీయాలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తనదైన ముద్ర వేస్తూ సమకాలీన రాజకీయ నేతలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. రాజకీయాలంటే కార్యకర్తలను అవసరానికి వాడుకుని వదిలేయడమే ట్రెండ్ గా మారిన ఈరోజుల్లో బండి సంజయ్ అందుకు భిన్నంగా అడుగులు వేస్తూ కార్యకర్తలకు నిత్యం వెన్నంటి ఉంటున్నారు. తన గెలుపుకు కారణమైన కార్యకర్తలందరి రుణం తీర్చుకుంటున్నారు.
కార్యకర్త జీవితాంతం కార్యకర్తగానే ఉండాలా? అనే ప్రశ్నకు 'నేటి కార్యకర్తే రేపటి లీడర్' అనే నినాదానికి చిరునామాగా మారారు.
మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని కరీంనగర్ కార్పొరేషన్, వేములవాడ, సిరిసిల్ల, హుస్నాబాద్, హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీల్లో గెలుపోటములతో సంబంధం లేకుండా ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా లెక్క చేయకుండా నూటికి 80 శాతం మంది నిఖార్సైన, నిబద్ధత కలిగిన కార్యకర్తలకే కార్పొరేటర్, కౌన్సిలర్ టిక్కెట్లు ఇచ్చారు. ఎన్నికలంటే గెలుపే అన్ని పార్టీలకు ప్రతిపాదిక. అధికారం

# భారత వ్యవసాయం అమ్మకానికి మోదీ సంతకం, రైతుకు శిక్ష

## ట్రేడ్ డీల్ కాదు దేశ ఆహార భద్రతపై యుద్ధం

### డా. రేఖ బోయలపల్లి ఉపాధ్యక్షురాలు, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 10:**
భారతదేశం కేవలం వినియోగదారుల మార్కెట్ కాదు. కోట్లాది రైతుల చెమట, మట్టితో మమేకమైన జీవన సంస్కృతి. అలాంటి వ్యవసాయాన్ని అమెరికా కార్పొరేట్ల ప్రయోజనాలకు తాకట్టు పెట్టేలా భారత్అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం దేశ రైతాంగంపై జరిగిన ఆర్థిక యుద్ధమే. ఇది సాధారణ ట్రేడ్ డీల్ కాదని, భారత రైతు భవిష్యత్తును తాకట్టు పెట్టిన లొంగుబాటు పత్రమని తీవ్రంగా ఆందోళన వ్యక్తమవుతోంది.
అమెరికా నుంచి సోయాబీన్ ఆయిల్, డిస్టిలర్స్ గ్రెయిన్స్, పశు మేత ఉత్పత్తులకు భారత మార్కెట్‌ను విస్తృతంగా తెరవడం దేశీయ వ్యవసాయాన్ని నేరుగా దెబ్బతీసే చర్య. దీనివల్ల నూనెగింజల రైతులు తీవ్రంగా నష్టపోతారు, పాడి రైతులు దివాళా అంచుకు చేరతారు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వెన్ను విరుగుతుంది. భారీ సబ్సిడీలతో తయారైన చౌక విదేశీ ఉత్పత్తులతో మన రైతు పోటీ పడలేడు. ఇది స్వేచ్ఛా వాణిజ్యం కాదుస్వదేశీ రైతుపై విదేశీ దాడి. "పంట మనది లాభం పరాయిది" అనే దోపిడీ నమూనాను ప్రభుత్వం దేశంపై రుద్దుతోంది.
ఎంఎస్‌పీకి చట్టబద్ధ హామీ ఇస్తామని మాటిచ్చిన ప్రభుత్వం నేడు అంతర్జాతీయ డంపింగ్‌కు తలుపులు తెరిచింది. రైతు రక్షణను గాలికొదిలి, కార్పొరేట్ లాభాలను రాజ్యాంగ విలువలకన్నా పైగా నిలబెట్టింది. ఈ ఒప్పందం అమలైతే గిట్టుబాటు ధరలు కూలిపోతాయి, పాడి పరిశ్రమ కుదేలవుతుంది, గ్రామీణ ఉపాధి వ్యవస్థ ఛిన్నాభిన్నమవుతుంది. చివరకు దేశ ఆహార భద్రత విదేశీ కంపెనీల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది.
ఇంతటి ప్రభావం కలిగిన నిర్ణయాన్ని తీసుకునే ముందు రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రదించలేదు, పార్లమెంటులో చర్చ జరగలేదు, రైతు సంఘాల అభిప్రాయం తీసుకోలేదు. ఇదేనా ప్రజాస్వామ్యం? దేశ భవితను ప్రభావితం చేసే ఒప్పందాన్ని మూసగదుల్లో కుదుర్చడం రాజ్యాంగ ఆత్మకు విరుద్ధం. ఇది ఫెడరల్ వ్యవస్థపై ప్రత్యక్ష దాడి.
రైతు ఈ దేశానికి కేవలం ఓటు బ్యాంక్ కాదు. అతడే ఆహారం ఇచ్చే దేవుడు, ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక, గ్రామీణ భారతానికి ఊపిరి. కానీ ప్రస్తుత పాలనలో రైతు అప్పుల ఊబిలో చిక్కుకున్న బాధితుడిగా, దిగుమతుల దాడికి బలైన వ్యక్తిగా, మార్కెట్ మాఫియాకు బానిసగా మారుతున్నాడు. రైతు ఆత్మహత్యలు పెరుగుతున్నా కేంద్రానికి కార్పొరేట్ లాభాలే ప్రధానమవడం దురదృష్టకరం.
ప్రపంచ చరిత్ర స్పష్టంగా చెబుతోంది ఏ దేశమైనా తన వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించిన రోజు ఆహార స్వావలంబన కోల్పోయింది. ధరలు విదేశాల్లో నిర్ణయమయ్యాయి. రైతు భూమి కూలీగా మారాడు. ఇప్పుడు అదే ప్రమాదం భారత్ తలుపు తడుతోంది.
ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా సమ్మెకు రైతు సంఘాలు ఇచ్చిన పిలుపు ప్రభుత్వ వైఫల్యానికి ప్రజాతీర్పుగా మారబోతోంది. ఇది కార్పొరేట్ పాలనకు వ్యతిరేక నిరసన, రైతు ఆత్మగౌరవ పోరాటం. రైతు బిడ్డగా, మహిళా కాంగ్రెస్ తరఫున ఈ ఉద్యమానికి సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తున్నాను.
ప్రభుత్వం తక్షణం తీసుకోవాల్సిన చర్యలు:

1. భారత్అమెరికా వ్యవసాయ వ్యతిరేక ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలి.
2. ఎంఎస్‌పీకి చట్టబద్ధ హామీ కల్పించాలి.
3. దిగుమతులపై రక్షణాత్మక సుంకాలు విధించాలి.
4. పార్లమెంటులో సమగ్ర చర్చ జరపాలి.
5. రైతు సంఘాల భాగస్వామ్యంతో జాతీయ విధానం రూపొందించాలి.



దేశాన్ని పోషించే రైతును బలి చేసి ఏ ప్రభుత్వం నిలబడలేదు. ఈ ఒప్పందాన్ని రద్దు చేయకపోతే ప్రజా ఆగ్రహం సునామీలా మారుతుంది. భారత వ్యవసాయం అమ్మకానికి పెట్టే హక్కు ఏ పాలకుడికీ లేదు. రైతు కన్నీటిపై నిర్మించిన సింహాసనాలు ఎక్కువ కాలం నిలవవు.

# ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ జరుగుతోంది.. బాధ్యులపై ఉక్కుపాదం తప్పదు!

### ప్రజాస్వామ్య స్వేచ్ఛకు భంగం కలిగిస్తే వదిలిపెట్టం

"ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, జరుగుతోందని అనేక మంది గగ్గోలు పెడుతున్నారు.. ఇది అక్షరాలా నిజం. ఇప్పుడు కూడా కొందరు ఈ అక్రమాలకు పాల్పడుతున్నారు. దీనిపై ప్రభుత్వం ఎంక్వయిరీ చేస్తోంది. ఎవరు సూత్రధారులు? ఎక్కడెక్కడ పరికరాలు పెట్టారు? అనేది బయటకు తీస్తాం. చట్టం తన పని తాను చేసుకుపోతుంది" అని మంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగులను ఓట్లు అడగడంలో తప్పేముందని, తన పార్టీ తరపున తాను అడిగానని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

### మున్సిపల్ ఎన్నికల్లో 80 శాతం పైగా సీట్లు కాంగ్రెస్ వే

నేడు (బుధవారం) జరగనున్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధించబోతోందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. "గడిచిన రెండేళ్లలో మేం చెప్పిన ప్రతి మాటను నిలబెట్టుకుని ప్రజలకు చేరువయ్యాం. అందుకే ఈ పుర ఎన్నికల్లో 80 శాతానికి పైగా స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోబోతోంది. ఇది జీర్ణించుకోలేకే ప్రతిపక్ష నాయకులు ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ విసిరిన సవాళ్లను ప్రజలు తిప్పికొట్టారు.. అదే ఫలితం రేపు పునరావృతం కాబోతుంది" అని అన్నారు.

### అభివృద్ధికి పెద్ద పీట...

గత ప్రభుత్వ తీరుపై పొంగులేటి తీవ్ర స్థాయిలో నిప్పులు చెరిగారు. "కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి ధనిక తెలంగాణను రూ. 8.19 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారు. నెలకు రూ. 6,300 కోట్లు కేవలం అప్పులకే కడుతూ కూడా సంక్షేమాన్ని ఆపలేదు. గత దొరల పాలనలో పేదలను విస్మరించారు. 62 వేల డబుల్ బెడ్ రూంలను మొండిగోడలుగా మిగిల్చారు. కానీ మేం 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. 'వరి వేస్తే ఉరి' అన్న కాలం పోయి, ఇప్పుడు వడ్లకు బోనస్ ఇస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం" అని వివరించారు. మాజీ మంత్రుల అసభ్య పదజాలానికి ప్రజలు ఓటు ద్వారానే తగిన గుణపాఠం చెబుతారని ఆయన పేర్కొన్నారు.

# బిజెపి నేత మహదేవప్ప మరణానికి అధికార కాంగ్రెస్ పెద్దల దౌర్జన్యమే కారణం...

సెగ్మెంట్ అయిన మక్తల్ లో బిజెపి బలంగా ఉంది. గత మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇక్కడ బిజెపి ఎక్కువ వార్డుల్లో గెలిచింది. ప్రస్తుతం జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లోనూ గెలుపు బిజెపిదే అని కాంగ్రెస్ చేయించుకున్న ప్రీ పోల్ సర్వేలు, ఇంటెలిజెన్స్ రిపోర్టుల్లోనూ తేలిందని సమాచారం. అందుకే ఎలాగైనా బిజెపి గెలుపును నిలువరించాలనే కుట్రలో భాగంగానే అధికార కాంగ్రెస్ పెద్దలు బిజెపి అభ్యర్థి ఎరుకల మహదేవప్పను వేధింపులకు గురి చేసారని తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల్లో తాను గెలవడం ఖాయమని, గెలిచిన తర్వాత కూడా నన్ను అధికార కాంగ్రెస్ పెద్దలు వేధిస్తారని మహదేవప్ప తన సన్నిహితులతో వాపోయినట్టు సమాచారం. కాంగ్రెస్ పెద్దల దౌర్జన్యం, వేధింపుల వల్లే బిజెపి అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్య చేసుకున్నాడని మక్తల్ పట్టణం కోడై కూస్తోంది.మున్సిపల్ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని అధికార కాంగ్రెస్ నేతలు అన్ని మున్సిపాలిటీల్లోనూ దౌర్జన్యంగా వ్యవహరిస్తూ బిజెపి అభ్యర్థులను భయభ్రాంతులకు, వేధింపులకు గురిచేస్తున్నారు. మక్తల్ మున్సిపాలిటీ ఆరవ వార్డు ఎన్నికల బరిలో ఉన్న ఎస్.టి వర్గానికి చెందిన బీజేపీ అభ్యర్థి ఎరుకల మహదేవప్ప ఆత్మహత్య ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ద

# మహదేవప్ప మృతికి రేవంత్‌దే బాధ్యత

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి10 వెలుతురు:**



మక్తల్ బీజేపీ అభ్యర్థి మహదేవప్ప మృతికి సీఎం రేవంత్ బాధ్యత వహించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఎన్నికల సంఘం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి కోరారు. అతను అర్థాంతరంగా ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడన్న దానిపై అనుమానాలు ఉన్నాయని అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తలాతోకా లేకుండా రేవంత్ మాట్లాడుతున్నారని మండిపడా ్డరు. ముఖ్యమంత్రి స్థానంలో ఉంటూ రెండేళ్లుగా మాటలతో కాలయాపన చేశారని.. ఏం చేస్తారో చేతల్లో చూపించాలన్నారు. ఇచ్చిన మాటపై నిలబడే శక్తి లేకపోతే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇకపోతే తన పేరును మార్చి పిలుస్తున్నారని ఫైర్ అయ్యారు. 'మీరు రేవంత్ ఖాన్ అని మార్చుకోండి.. మాకు అభ్యంతరం లేదు. కానీ.. మా తల్లి పెట్టిన పేరు మార్చడానికి మీరెవ రు? మాపై వ్యక్తిగత విమర్శలు సరికాదు. మీకు దెయ్యాలు.. దేవతల్లా కనపడవచ్చు. మజ్లిస్‌తో మీరు కాపురం చేసినన్నాళ్లూ.. మేం నిప్పులు పోస్తాం' అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలో అన్ని స్థానాల్లో ఎంఐఎం ఎందుకు పోటీ చేయలేదని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. తాను ఎవ్వరికీ దత్తపుత్రుడ్ని కాదని ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మధ్య ఏవైనా విభేదాలుంటే వారే తేల్చుకోవాలని, తనను మధ్యలో లాగడం ఎందుకని ప్రశ్నించారు. తన గురించి తప్పుగా మాట్లాడటం సరికాదన్నారు. కేసీఆర్‌ను అరెస్ట్ చేయకుండా కిషన్ రెడ్డి పేరు మారుస్తానని అంటున్నారని కేంద్ర మంత్రి మండిపడ్డారు. కేసీఆర్‌ను అరెస్ట్ చేస్తే కేంద్ర ప్రభుత్వం అడ్డురాకుం డా చూసే బాధ్యత తనదని స్పష్టం చేశారు. సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక గాంధీ.. ఒక్క రోజూ కేసీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడలేదని విమర్శించా రు. తామెప్పుడూ బీఆర్ఎస్‌తో కలవలేదని తేల్చిచెప్పారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు.. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి పోటీ చేశాయని గుర్తుచేశారు. ఇప్పుడేమీ చేయలేక తనపై ఆడి పోసుకుంటున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిదా? కిషన్ రెడ్డిదా.? అనేది తెలంగాణ సమాజం ఆలోచించాలన్నారు.

# పిఎంజిఎస్‌వై నిధుల మంజూరుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపండి

కనెక్టివిటి లేని 227 ఆవాసాల్లో 642 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నేడు డా. బీ.ఆర్. అంబేడ్కర్ సచివాలయంలో పీ.ఎం.జి.ఎస్.వై 4 వ దశ పనుల మంజూరుకై పంపే ప్రతిపాదనలపై రాష్ట్ర స్థాయి స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్ లతోపాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, పీ.ఎం.జి.ఎస్.వై లో భాగంగా ఇప్పటి వరకు మూడు దశలలో రాష్ట్రానికి మంజూరైన రహదారులు, వంతెనల నిర్మాణ పనులను పూర్తి చేశామని, ఈ పథకం నాలుగవ దశ క్రింద రాష్ట్రంలో పక్కా రహదారులు లేని 227 ఆవాసాలల్లో 642.23 కిలోమీటర్ల రహదారుల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలని అన్నారు. అయితే, వీటిలో, 34 పనులకు గాను 148 కిలోమీటర్లకు అటవీ శాఖ అనుమతులు పొందాల్సి ఉందని, ఈ మార్గాల్లో బ్రిడ్జిల నిర్మాణ పనులకు సంబంధించి మరో వారం రోజుల్లో డీపీఆర్ లను పూర్తి చేస్తామని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్ తెలిపారు.

### వేములవాడ శివరాత్రి ఉత్సవాలకు సిఎంకు ఆహ్వానం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 'కీసరగుట్ట మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు-2026' ఆహ్వానం అందజేసారు. ఈ రెండు ప్రాంతాల్లో శివరాత్రి ఉత్సవాలు విశేషంగా జరుగుతాయి. అందువల్ల వీటికి హాజరు కావాలని మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్ కోరారు.

# ఆదర్శ శిఖరమా అభిమాన సంద్రమా....సాహో.... సంజయ్

లేనప్పుడు జెండా పట్టుకుని పార్టీ ఇచ్చే అన్ని కార్యక్రమాల్లో పాల్గొనేది కార్యకర్తలే... తీరా ఎన్నికల టైమొచ్చేసరికి మాత్రం గుర్రాలకే టిక్కెట్లు ఇవ్వడం అనే కారణంతో కార్యకర్తలను పక్కన పెట్టడం అన్ని రాజకీయ పార్టీల్లో తంతుగా మారింది.

బండి సంజయ్ మాత్రం ఈ తంతును పూర్తిగా చెరిపేసే ప్రయత్నం చేశారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన కార్యకర్తలకే గత పంచాయతీ ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వడమే కాకుండా ఆర్థిక వనరులను కూడా స్వయంగా సమకూర్చారు. అభ్యర్థుల గెలుపు బాధ్యతలను సైతం పూర్తిగా తన భుజాన వేసుకున్నారు. ఫలితంగా తన పార్లమెంట్ పరిధిలో 108 సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకుని రికార్డు సృష్టించారు.

ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో సైతం ఇతర పార్టీల నుండి పెద్ద ఎత్తున లీడర్లు బీజేపీలో చేరేందుకు యత్నించినా వాళ్లకు టిక్కెట్లు ఇచ్చేందుకు మాత్రం బండి సంజయ్ ససేమిరా అన్నారు. పార్టీ కోసం కష్టపడి ఏళ్ల తరబడి పనిచేసిన కార్యకర్తలకే పెద్ద పీట వేశారు. నూటికి 80 శాతం మంది కట్టర్ కార్యకర్తలకే కార్పొరేటర్, కౌన్సిలర్ టిక్కెట్లను కేటాయించడమే కాకుండా వారిని గెలిపించే బాధ్యతలను పూర్తిగా తన భుజానా వేసుకుని ఎన్నికలను ఒంటి చేత్తో నడిపించారు.

బీజేపీ పక్షాన పోటీ చేసిన అభ్యర్థుల్లో 90 శాతం మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే. రాష్టంలో ఎన్నడూ అధికారంలో లేకపోవడం, ఆయా అభ్యర్థులు సైతం ఎన్నడూ అధికారిక పదవుల్లో కూడా లేకపోవడంతో వారి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంది. కుటుంబ నిర్వహణే కష్టంగా ఉన్న అభ్యర్థుల కుటుంబాలు చాలా ఉన్నాయి. అలాంటి వారందరికీ ఎన్నికలకు అవసరమైన ఆర్థిక సాయాన్ని కూడా స్వయంగా బండి సంజయ్ అందించారు. కొంత మంది అభ్యర్థులకు నామినేషన్ పత్రాలకు అవసరమైన డిపాజిట్ సొమ్మును కూడా బండి సంజయ్ పంపించడం గమనార్హం. గెలుపు వాతావరణాన్ని సృష్టించేందుకు అభ్యర్థుల పక్షాన డివిజన్లలో పెద్ద ఎత్తున స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లు, సభలు నిర్వహించారు. అందుకయ్యే ఖర్చునంతా బండి సంజయ్ భరించారు.

అట్లాగే అభ్యర్థుల పేరిట కరపత్రాలను స్వయంగా ప్రింట్ చేయించి పంపించారు. అట్లాగే కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు ఆయా మున్సిపాలిటీల అభివృద్ధికి తాను ఎంతగా కృషి చేశానో చెబుతూ... కేంద్రం నుండి తెచ్చిన నిధులతో జరిగిన అభివృద్ధి వివరాలతో బుక్ లెట్ ను రూపొందించి ఇంటింటికీ పంపిణీ చేయించి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు.

ఎన్నికల ప్రచార వ్యవధి తక్కువగా ఉండటంతో పొద్దున్నే 6 గంటలు మొదలు రాత్రి 10 గంటలదాకా కార్యకర్తల గెలుపు కోసం గల్లీ గల్లీలోనూ తిరుగుతూ విస్తృత ప్రచారం నిర్వహిస్తూ ఓట్లను అభ్యర్థించారు. ప్రచార సమయం ముగిసిన తరువాత సైతం పోల్ మేనేజ్ మెంట్, మరుసటి రోజు పార్టీ కార్యమాల నిర్వహణపై కసరత్తు చేశారు. అదే సమయంలో అభ్యర్థుల ప్రచారం ఎట్లా ఉంది? వారు ఎక్కడ వెనుకబడ్డారు? ప్రత్యర్థుల ఎత్తుగడలు ఏమిటి? అనే అంశాలపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ బీజేపీ అభ్యర్థులను అలర్ట్ చేస్తూ వారు పోటీ చేసే డివిజన్లలో, మున్సిపల్ వార్డుల్లో బీజేపీ గెలుపు తథ్యం అనే వాతావరణం కల్పించడంలోనూ బండి సంజయ్ అలుపెరగకుండా పనిచేశారు.

బండి సంజయ్ పడుతున్న తపన, చెమటోడుస్తున్న తీరును చూసి సొంత పార్టీ నేతలే కాదు, ప్రత్యర్థి పార్టీల నాయకులు సైతం నివ్వెర పోతున్నారు. కార్యకర్తలపట్ల ఇంతటి ప్రేమ, బాధ్యత కలిగిన లీడర్ ను మేము ఇంతకు ముందెన్నడూ చూడలేదు... ఇక భవిష్యత్తులోనూ చూస్తామనే నమ్మకం లేదు"అని ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలే ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. బండి సంజయ్ పడుతున్న కష్టాన్ని చూసి ప్రజలు సైతం 'శభాష్ సంజయ్"అంటూ అభినందిస్తున్నారు. ఇక బీజేపీ కార్యకర్తల సంగతి చెప్పనక్కర్లేదు...'సాహో సంజయన్న...నీవే మాకు అండా దండా...మీ వెంట మేమంతా"అంటూ కొనియాడటం విశేషం.

# తెలంగాణపై కేంద్రం ఆర్థిక వివక్ష

మాత్రం కేవలం 16.3 శాతం మాత్రమేనని గణాంకాలు చెబుతున్నాయి. ఇది ఆర్థిక సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధం అని మంత్రి వ్యాఖ్యానించారు. పన్నులు చెల్లించిన ప్రతి రూపాయికి తిరిగి వచ్చే నిధులను పోల్చితే కేంద్రం పాటిస్తున్న ద్వంద్వ వైఖరి బయటపడుతుందని మంత్రి తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలకు రూపాయికి సగటున 30 పైసలు ఇస్తూ, ఇదే సమయంలో బీహార్, ఉత్తరప్రదేశ్ లాంటి ఉత్తరాది రాష్ట్రాలకు రూ.1కి రూ.4 చొప్పున ఇస్తున్నారని, ఇది ఆర్థిక అసమతుల్యతను పెంచడమే కాకుండా, ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభేదాలను సృష్టించే ప్రమాదకర ధోరణి అని హెచ్చరించారు. "ఎక్కువ పన్నులు చెల్లించే రాష్ట్రాలను శిక్షించడం, తక్కువ వసూళ్లు చేసే రాష్ట్రాలను ప్రోత్సహించడం కేంద్ర విధానంగా మారింది" అని మంత్రి ఆరోపించారు. కేంద్రం చెప్పుకునే వికసిత్ భారత్ విధానం అంటే ఇదేనా అని మంత్రి ప్రశ్నించారు.

### తెలంగాణ గణాంకాలే సాక్ష్యం....

డిసెంబర్ లో జరిగిన పార్లమెంట్ సమావేశాలలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా 2024-25 లో తెలంగాణ రాష్ట్రం నుండి 1,33,208 కోట్ల పన్నులు వసూలు అయితే.. కేంద్రం నుండి రాష్ట్రానికి కేంద్ర పన్నుల రూపంలో 27,050 కోట్లు, కేంద్ర గ్రాంట్ల రూపంలో 7,913 కోట్లు, కేంద్ర ప్రాయోజిక పథకాల రూపంలో 16,762 కోట్లు మొత్తంగా 51,725 కోట్లు విడుదల చేసినట్టు పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి సమాధానం చెప్పారని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. "పథకాల రూపంలో వచ్చిన నిధులను కూడా కలిపితేనే ఈ మొత్తం వస్తోంది. స్వేచ్ఛగా వినియోగించుకునే నిధులు మాత్రం మరింత తక్కువ" అని మంత్రి వివరించారు.

జీఎస్టీతో మొదలైన దెబ్బ గ్రాంట్ల కోతతో కొనసాగింపు...

జీఎస్టీ సవరణల కారణంగా తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే ఏడాదికి సుమారు రూ.8 వేల కోట్లు నష్టపోతోందని మంత్రి తెలిపారు. ఇక 15వ ఆర్థిక సంఘం సూచించిన రెవెన్యూ లోటు గ్రాంట్లను 16వ ఆర్థిక సంఘం పూర్తిగా పక్కన పెట్టడంతో రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్ర్యం దెబ్బతిన్నదని విమర్శించారు. రంగాలవారీగా, రాష్ట్రాల ప్రత్యేక గ్రాంట్లకు కత్తెర పెట్టడం వల్ల తెలంగాణకు మరో రూ.5 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు.

### ఇది ఆర్థిక సమస్య కాదుడ రాజకీయ నిర్ణయం...

"ఇది కేవలం లెక్కల విషయం కాదు. ఇది కేంద్రంలో ఉన్న పాలకుల రాజకీయ ఆలోచనల ఫలితం. బలమైన రాష్ట్రాలను బలహీనపరచి, ఆర్థికంగా ఆధారపడేలా చేయాలనే ఉద్దేశమే కనిపిస్తోంది" అని తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాలలో బిజెపి పార్టీ అస్థిత్వాన్ని నిలబెట్టుకోవాలనే ఉద్దేశ్యంతోనే దక్షిణాది రాష్ట్రాలకు ముఖ్యంగా తాము అధికారంలో లేని రాష్ట్రాలకు తక్కువ నిధులు విడుదల చేసి, వారి కుంచిత స్వభావాన్ని చూపెడుతున్నారని అన్నారు.

### ఫెడరల్ వ్యవస్థను కాపాడాల్సిన అవసరం...

ఫెడరల్ వ్యవస్థలో రాష్ట్రాలు భాగస్వాములే కాని, కేంద్రం దయాధర్మాలపై ఆధారపడేవి కావని మంత్రిగారు స్పష్టం చేశారు. దేశ సమగ్ర అభివృద్ధి సాధించాలన్న, కేంద్రం చెప్పుకుంటున్న వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలన్నా, అన్ని రాష్ట్రాలకు సమన్యాయం జరగాలని, ముఖ్యంగా ఆదాయం సమకూర్చే రాష్ట్రాలపై వివక్ష మానుకోవాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని మంత్రి కోరారు. "తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహించే బిజెపి ఎంపీలు మరియు కేంద్ర మంత్రులు కూడా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని పదేళ్లలో ఏనాడు ప్రశ్నించకపోగా, రాష్ట్రానికి అన్ని తెచ్చాం, ఇన్ని చేశాం, రాష్ట్ర ఖజానాకు కేంద్రమే పూర్తి నిధులు సమకూరుస్తుందనట్లు మాట్లాడటం వారి పతనానికి నాంది. జాతీయ రహదారుల నిర్మాణాలను కూడా రాష్ట్రానికి విడుదల చేసే నిధుల ఖాతాలలో వేస్తున్న ఈ నాయకులు, వాటిని నిర్మించి మళ్లీ ప్రజల నుండే టోల్ చార్జీల రూపంలో వసూలు చేస్తున్న విషయాన్ని మరిచారా అని మంత్రి ప్రశ్నించారు. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రుణమాఫీ, రైతు భరోసా, పంట కొనుగోళ్లు, సాగునీటి ప్రాజెక్టులు, ఉచిత విద్యుత్ వంటి పథకాలతో భారీగా ఖర్చు చేస్తోందని, కానీ కేంద్రం నుంచి రావాల్సిన న్యాయమైన వాటా రాకపోవడం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి అడ్డంకిగా మారుతోందని మంత్రి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ యూనియన్ బడ్జెట్ లో చేర్చాల్సిందిగా చేసిన ప్రతిపాదనలలో ఒక్కటి కూడా మంజూరు చేయలేదని, ఇప్పటికైనా తెలంగాణను రాజకీయంగా శిక్షించే బడ్జెట్‌లు ఇక మానుకోని, ఫెడరలిజాన్ని గౌరవించి, తెలంగాణకు న్యాయమైన వాటా ఇవ్వాలని, లేకపోతే "వికసిత్ భారత్" ఒక నినాదంగానే మిగిలిపోతుందని, నిజమైన అభివృద్ధి సాధ్యం కాదని మంత్రి స్పష్టం చేశారు. ఈ విషయంలో రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి నాయకులు కూడా తెలంగాణకు రావాల్సిన న్యాయబద్ధమైన వాటాకోసం కేంద్రంతో పోరాడటానికి మాతో కలిసి రావాలని మంత్రి కోరారు.

# బెంగళూరు-చెన్నై హై స్పీడ్ రైల్ కారిడార్

- తిరుపతి మీదుగా వెళ్లేలా ప్లాన్ చేయండి
- కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు చంద్రబాబు వినతి



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి10 వెలుతురు:**

బెంగళూరు-చెన్నై హై స్పీడ్ రైల్ కారిడార్‌ను తిరుపతికి కనెక్ట్ చేసేలా చూడాలని కేంద్ర రైల్వే శాఖమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా అశ్వినీ వైష్ణవ్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. ఏపీని టచ్ చేస్తూ వెళ్లే మూడు హై స్పీడ్ రైల్ కారిడార్లను ప్రకటించడంపై కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ రైల్వే ప్రాజెక్టుల పూర్తి, కొత్త రైలు మార్గాలు, సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యేలా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని సీఎం కోరారు. తాడిపత్రి నుంచి ముంబయి జేఎన్‌పీటీ పోర్టుకు అరటి ఎగుమతులకు వీలుగా 50 శాతం రాయితీపై ఖాళీ రీఫర్ కంటైనర్లు కేటాయించాలన్నారు. విజయవాడ, విశాఖ, తిరుపతి, అమరావతిలో గ్రీన్ ఫీల్డ్ మెగా కోచింగ్ టెర్మినళ్లు ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. ఉత్తర- దక్షిణ భారత్‌లను కలిపేలా ఇటార్సీ- విజయవాడ మధ్య ప్రత్యేక సరకు రవాణా కారిడార్ ఏర్పాటుకు సహకారం అందించాలన్నారు. ఏపీలోని పోర్టులను అనుసంధానిస్తూ విజయవాడ మీదుగా ఖరగ్ పూర్- చెన్నై మధ్య ఈస్ట్ కోస్ట్ కారిడార్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాయలసీమ సహా ఆదివాసీ ప్రాంతాలను కనెక్టు చేసేలా వివిధ కొత్త రైల్వేమార్గాల ప్రతిపాదనల్ని ఆమోదించాలని కోరారు. విశాఖ-విజయవాడ మధ్య హైస్పీడ్, విజయవాడ-కర్నూలు మధ్య సెమీ హైస్పీడ్, తిరుపతి-చిత్తూరు మధ్య హైస్పీడ్ లింక్ కారిడార్ మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. హైదరాబాద్- శ్రీశైలం- మార్కాపురం కొత్త రైల్వే లైన్ ద్వారా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి కనెక్టివిటీని పెంచాలని, తిరుపతి మీదుగా విజయవాడ-బెంగుళూరు మధ్య వందేభారత్ సర్వీసును నడపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. వివిధ ఎక్స్ ప్రెస్ రైళ్లకు కుప్పంలో స్టాపింగ్ ఇవ్వటంతో పాటు రైలు బోగీ నిర్వహణ టెర్మినల్ ఏర్పాటు చేయాలని రైల్వే మంత్రికి విజ్ఞప్తి చేశారు.

# స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాస తీర్మానం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి10 వెలుతురు:**

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్ష ఎంపీలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు మంగళవారంనాడు ఇచ్చిన నోటీసులో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ఆ లోపాన్ని సరిచేసి విపక్ష ఎంపీలు తిరిగి నోటీసును లోక్‌సభ సెక్రటరీకి అందజేశారు. విపక్షాల నోటీసును పరిశీలించాల్సిందిగా లోక్‌సభ సెక్రటేరియట్‌ను ఓం బిర్లాను ఆదేశించడంతో ఈ సాంకేతిక లోపం బయటపడింది. విపక్షాలు మొదట ఇచ్చిన నోటీసులో 2026 సంవత్సరానికి బదులుగా 2025 సంవత్సరం అని ఉంది. వెంటనే పొరపాటును సరిచేసి రెండోసారి అవిశ్వాస తీర్మానం నోటీసును లోక్‌సభ సెక్రటరీకి విపక్షాలు అందజేశాయి. ఇండియా కూటమికి చెందిన 118 మంది ఎంపీలు అవిశ్వాస తీర్మానం నోటీసుపై సంతకాలు చేశారు. సభలో మాట్లాడేందుకు విపక్ష నేతలకు స్పీకర్ అవకాశం ఇవ్వడం లేదంటూ ఈ నోటీసు ఇచ్చారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, డీఎంకే పార్టీలు దీనికి మద్దతు పలుకగా, తృణమూల్ కాంగ్రెస్ ఇంతవరకూ సంతకం చేయలేదు. ఈ ప్రక్రియను సమీక్షించనున్నట్టు టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ తెలిపారు.అవిశ్వాస తీర్మానంపై రాహుల్ గాంధీ సంతకం చేయలేదని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో స్పీకర్ తొలగింపు పిటిషన్‌పై ప్రతిపక్ష నేత సంతకం చేయడం సరైంది కాదని, రాహుల్ గాంధీ సంతకం చేయకపోవడానికి అదే కారణమని పేర్కొన్నాయి. కాగా, అవిశ్వాస తీర్మానం పరంగా లోక్‌సభలో బలాబలాలను చూసినప్పుడు లోక్‌సభలో అధికార పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఉంది. 293 మందితో మెజారిటీ సభ్యుల బలం వారికి ఉండగా, విపక్షాలకు 214 మంది సభ్యుల బలం ఉంది.

# నేటినుంచి ఎపి బడ్జెట్ సమావేశాలు

- అధికారులతో స్పీకర్ అయ్యన్న సమీక్ష,
- 14 బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న ఆర్థికమంత్రి




**అమరావతి,ఫిబ్రవరి10 వెలుతురు :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 11న బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఉదయం 10: 30కి ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నజీర్ ప్రసంగించనున్నారు. సుమారు గంటసేపు స్పీచ్ ఉండే అవకాశం ఉంది. తరవాత 11: 30 గంటలకి బీఏసీ సమావేశం జరగనుంది. అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు సంబంధించి ప్రధానంగా చర్చిస్తారు. 20 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరిగే అవకాశం ఉంది. ఇక, ఈ నెల 14వ తేదీన 2026-27కి సంబంధించిన బ్జడెట్ ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టనున్నారు. ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు వరుస సమావేశాలు నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు నిర్వహించే ఆటలు, సంస్కృతిక కార్యక్రమాలపై స్పీకర్ అయ్యన్న సమీక్ష చేశారు. సీఎస్ విజయానంద్, వివిధ శాఖల అధికారులతో అసెంబ్లీ సమావేశాల నిర్వహణ, సభ్యుల ప్రశ్నలు, వాటికి సమాధానాలపై సమీక్షించారు. డీజీపీ సహా పోలీస్ ఉన్నతాధికారులతో స్పీకర్ అయ్యన్న కీలక సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ సమావేశాలకు కల్పించే భద్రతా ఏర్పాట్లపై చర్చించారు.

# తెలంగాణలో నేడు మున్సిపల్ ఎన్నికలు

- 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో పోలింగ్
- భారీగా ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- అవాంఛనీయ ఘటనలు జరక్కుండా పోలీసుల భద్రత
- మక్తల్ ఆరోవార్డు బిజెపి అభ్యర్థి ఆత్మహత్యతో ఎన్నిక వాయిదా

**హైదరాబాద్,ఫిబ్రవరి10 వెలుతురు:**
తెలంగాణ రాష్ట్రంలో బుధవారం మున్సిపల్ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అయితే...నారాయణపేట్ జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో ఆరోవార్డు ఎన్నికను రాష్ట్ర ఎన్నికల సంఘం వాయిదా వేసింది. బీజేపీ అభ్యర్థి ఎరుకలి మహదేవ్ ఆత్మహత్యతో ఎన్నికను రద్దు చేస్తున్నట్టు తెలిపింది. ఎన్నికలకు ఒక్క రోజు ముందే అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇకపోతే ఎన్నికల సిబ్బంది తమ సరంజామాతో తమకు కేటాయించిన బూతలకు చేరుకున్నారు.



రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలో బుధవారం పోలింగ్ జరుగనున్నది. ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ పక్రియ ప్రారంభంకానున్నది. సాయంత్రం 5 వరకు పోలింగ్ జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. ఈ నెల 13న ఓట్ల లెక్కింపుతో ఫలితాలు వెల్లడికానున్నాయి.. ఆ రోజే నగర, పట్టణ ప్రజానీకం ఎవరి వైపు మొగ్గు చూపిందనే ఉతంఠకు తెరపడనున్నది. జిల్లాలవారీగా ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాలకు మంగళవారం తరలించారు. ఎన్నికల సిబ్బంది ఇప్పటికే తమకు కేటాయించిన కేంద్రాలకు వాహనాల్లో వెళ్లారు. ఎన్నికలు జరిగే పురపాలికల్లో పోలీసులు గట్టి భద్రత ఏర్పాటు చేశారు. అలాగే సమస్యాత్మక ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా భారీ భద్రత ఏర్పాటు చేశారు.బ్యాలెట్ బాక్సులు, పత్రాలను పోలీస్ భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి రాష్ట్రంలోని డిస్టిబ్యూషన్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు తరలించారు. అక్కడి నుంచి మంగళవారం ప్రతి పోలింగ్ కేంద్రానికి తరలించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి అకడ సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ సౌకర్యం కల్పించారు. ఓటర్లు ఎన్నికల సంఘం సూచించిన 12 రకాల గు ర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకటి వెంట తెచ్చుకోవాల్సి ఉంటుంది. 11న జరుగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని ఇప్పటికే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పోలింగ్ పక్రియ కోసం సిబ్బంది నియామకం, వారికి అందించిన శిక్షణపై సమీక్షించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. డిజిపి కూడా పోలీస్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

## రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ ఆపడం సరికాదు

- వారికి బకాయిలు వెంటనే చెల్లించండి
- సిఎం రేవంత్‌కు బండి సంజయ్ లేఖ

**హైదరాబాద్,ఫిబ్రవరి10 వెలుతురు:**
రిటైర్డ్ ఉద్యోగులకు తక్షణమే బకాయిలు చెల్లించాలని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. 'సీఎం గారూ... మీకు మానవత్వం ఉందా?' అని ప్రశ్నించారు. విశ్రాంత ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించకుండా మానసిక వేదనకు గురి చేయడం న్యాయమా అని ప్రశ్నించారు. రిటైర్డ్ అయ్యి రెండేళ్లయినా.. వారి బకాయిలను ఇంకా చెల్లించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా 61 మంది విశ్రాంత ఉద్యోగులు తనువు చాలించారని.. వారి చావులకు ఎవరు బాధ్యులని లేఖలో ప్రస్తావించారు. ప్రభుత్వ, విశ్రాంత ఉద్యోగులను రాష్ట్ర సర్కార్ ప్రాధాన్యం లేని కేటగిరీలుగా భావిస్తోందా అని బండి సంజయ్ నిలదీశారు. ప్రభుత్వ తీరు




తెలంగాణకు మాయని మచ్చ అని విమర్శించారు. జీవితం మలి సంధ్యలో ప్రశాంతమైన జీవితాన్ని గడపాల్సిన రిటైర్డ్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వమే మానసిక వేదనకు గురిచేస్తుండటం క్షమించరానిదన్నారు. ముక్కూమొహం తెలియని వృద్ధులు కష్టాల్లో ఉంటేనే చేతనైనంత సాయం చేయాలని భావించే గొప్ప మానవతా హృదయం ఉన్న తెలంగాణ సమాజం మనదని ఆయన చెప్పుకొచ్చారు.ఉద్యోగ విరమణ చేసిన వెంటనే వారికి బెనిఫిట్స్ అన్నింటినీ చెల్లించి సగౌరవంగా సన్మానించి పంపాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని కేంద్ర మంత్రి ్ర÷ర్ అయ్యారు. దీనిని తక్షణమే అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుని వారి బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు హైదరాబాద్ నడిబొడ్డున దీక్ష చేసేందుకు వెనకాడబోమని బండి సంజయ్ స్పష్టం చేశారు.

## శ్రీశైలం మల్లన్న భక్తులపై లాఠీఛార్జ్ చేయడంపై ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ సీరియస్..!



**శ్రీశైలం వెలుతురు ఫిబ్రవరి 10:**
శ్రీశైలంలో శివ మాలధారులపై అడిషనల్ ఎస్పీ లాఠీఛార్జ్ చేయడాన్ని మాధవ్ తీవ్రంగా తప్పుబట్టారు. శైవభక్తుల పట్ల సంయమనం పాటించాలని అధికారులకు హితవు పలికారు. మాలధారణ చేసిన భక్తులు శ్రీశైలంలో ఇరుముడులు సమర్పిస్తారు. వారికి సహకరించాల్సిన యంత్రాంగం సంయమనం కోల్పోతే ఎలా? అని మాధవ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు.

## చిప్ రంగం లో స్వయం సమృద్ధి



**న్యూఢిల్లీ వెలుతురు ఫిబ్రవరి 10:**
డిజిటల్ ప్రపంచంలో 'ఆత్మనిర్భర్ భారత్'నినాదానికి బలం చేకూరుస్తూ కేంద్ర ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. ఎలక్ట్రానిక్స్ రంగానికి వెన్నెముక లాంటి సెమీకండక్టర్ల (చిప్స్) తయారీలో దేశాన్ని అగ్ర స్థానానికి చేర్చేందుకు 'ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0 కు శ్రీకారం చుట్టింది . 2026-27 బడ్జెట్లో ఈ మిషన్ కోసం ప్రత్యేకంగా రూ.1,000 కోట్లు కేటాయించింది. పరిశోధన, శిక్షణ, పరికరాల తయారీపై దృష్టి సారిస్తూ, భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా దేశీయ టెక్నాలజీని అభివద్ధి చేయడమే ప్రధాన లక్ష్యమని కేంద్రం ప్రకటించింది.

## సిద్ధిపేటకే నిధులు విడుదలలో ఆంతర్యం

- హరీష్, రేవంత్ మధ్య ఉన్న బంధం ఏమిటో
- మరోమారు విమర్శలు గుప్పించిన కవిత

**హైదరాబాద్,ఫిబ్రవరి10 వెలుతురు:**



కేవలం సిద్ధిపేటకే నిధులు విడుదలలో ఆంతర్యం ఏమిటని, హరీష్ రావు, సిఎం రేవంత్ మధ్య ఉన్న బంధం ఏమిటో చెప్పాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. మున్సిపల్ బూతుల వర్షం ఆగిపోవడం సంతోషంగా ఉందని కల్వకుంట్ల కవిత అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం చూశాక.. పార్టీ గుర్తులు లేకుండా ఎన్నికలు జరిగితే బాగుండేదని కవిత అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో మంచినీరు, పారిశుధ్యం లోపిస్తోందని, ఈ అంశాలపై ఎన్నికల ప్రచారంలో చర్చ జరగలేదని ఆమె వ్యాఖ్యానించారు. మున్సిపల్ ఎన్నికల్లో మంచి వ్యక్తులను ఎన్నుకోవాలని ప్రజలకు సూచించారు. కేవలం సిద్ధిపేట మున్సిపాలిటీకి మాత్రమే నిధులు మంజూరు అయ్యాయని.. హరీష్ రావు, ముఖ్యమంత్రికి మధ్య ఏముందో అర్థం చేసుకోవాలని కవిత అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంపద సృష్టించకుండా.. ఆస్తులను అమ్ముతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే బడ్జెట్‌లో అన్ని వర్గాలకూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 50 శాతం మంది రైతులకు ఇంకా రుణమాఫీ చేయలేదని వెల్లడించారు. రుణమాఫీపై చర్చకు తాము సిద్ధమని.. సచివాలయాలనికి రమ్మంటారా.. ముఖ్యమంత్రి సొంత జిల్లాకు రమ్మంటారా అంటూ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా నిజాలు చెప్పాలన్నారు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు జాగృతి తరపున వినతి పత్రం అందిస్తామని కవిత తెలిపారు. లేబర్ కోడ్‌కు వ్యతిరేకంగా 12వ తేదీన బంద్‌కు జాగృతి మద్దతు ఇస్తోందని వెల్లడించారు. ఈ క్రమంలోనే ఎంఐఎం పార్టీ పొద్దు తిరుగుడు పువ్వులా.. ఎవరు అధికారంలో ఉంటే వారి వెంట ఉంటుందని సెటైర్లు వేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాయల తెలంగాణకు ఒవైసీ బ్రదర్స్ మద్దతు ఇచ్చారని, రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ మనిషి అన్న ఒవైసీ.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సపోర్ట్ చేశారని కవిత విమర్శించారు.

## వాన్‌పిక్ ప్రాజెక్ట్‌కు సుప్రీంలో ఎదురుదెబ్బ

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి10( వెలుతురు):**




వాన్‌పిక్ ప్రాజెక్ట్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. సీబీఐ నమోదు చేసిన కేసును కొట్టివేయాలన్న పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం డిస్మిస్ చేసింది. కేంద్ర దర్యాప్తు సంస్థ నమోదు చేసిన అభియోగాలను సీబీఐ ప్రత్యేక కోర్టు పరిగణనలోకి తీసుకుందని.. దానికి గల కారణాలు చెప్పలేదంటూ వాన్‌పిక్ యాజమాన్యం తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేయడంతో వాన్‌పిక్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై జస్టిస్ సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పందిస్తూ.. హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. దీనిపై విచారణకు నిరాకరిస్తూ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.



# సంపాదకీయం..

# ఎన్నికలంటే....డబ్బున్నోళ్ల దందా !

ఎన్నికల్లో ప్రలోభాల పర్వంతో తెలంగాణ పల్లెల నుంచి పట్టణాల దాకా మత్తులో జోగుతున్నాయి. మొన్నటి కి మొన్న పంచాయితీ పోరు ముగిసింది. ఇప్పుడు పట్టణపోరు జరుగుతోంది. డబ్బున్న అభ్యర్థలదే హవా. డబ్బులు లేని అభ్యర్థులను ప్రజలు చూసీచూడనట్లుగా ఉంటున్నారు. అతను ఎందుకు ఖర్చు పెడుతున్నాడో అర్థం చేసుకోవడం లేదు. ఎందుకు ప్రలోభ పెడుతున్నాడో గ్రహించడం లేదు. ఇప్పుడు పెట్టిన డబ్బు రేపు ప్రతి చిన్న పనికీ ముక్కుపిండి వసూలు చేస్తాడని గుర్తించడం లేదు. ఎన్నికలు వచ్చాయంటే రాజకీయ నాయకులకన్నా ప్రజలకు ఎక్కువ సంతోషంగా ఉంది. పండగ చేసుకుంటున్నారు. ఇంట్లో వంటావార్పులు అంతంత మాత్రమే. రోజుకు ఎవరో ఒకరు రావడం సాయంత్రానికి దావత్ ఇవ్వడం పరిపాటిగా మారింది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో గత వారం రోజులుగా ఇదే తంతు సాగింది. చివరకు బుధవారం ఎన్నికలు ఉండగా సాయంత్రం కూడా దావత్‌లకు టైమ్ కేటాయించారు. తాగుడు అలవాటు ఉన్నవారికి తాగినంత...తిండి అలవాటున్న వారికి తిన్నంత అన్న లెక్కన సాగడం ప్రజాస్వామ్య పరిహాసాని కి ఎన్నికలు పరాకాష్టగా నిలుస్తున్నాయి. సోమవారం సాయంత్రం మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెర పడింది. ప్రలోభాలకు తెర లేచింది. మద్యం, మాంసంతో పాటు ఇతరత్రా కానుకల పంపిణీ ప్రారంభమైంది. పది రోజుల పాటు హోరాహోరీగా సాగిన ప్రచార పర్వం సోమవారం సాయంత్రం ఐదు గంటలతో ముగిసింది. ఆ వెంటనే కొందరు అభ్యర్థులు ఓటర్లపై తాయిలాలు వెదజల్లడం ప్రారంభించారు. కొన్నిచోట్ల ఓ పార్టీ నేతలు



ఇంటింటికీ చికెన్ పొట్లాలు పంపించారు. మరో అభ్యర్థి తన వార్డు పరిధిలోని ఓటర్లకు హారతి ప్లేట్ పంపిణీ చేసారు. నామినేషన్ల పర్వం ముగిసిన వెంటనే ప్రధాన పార్టీలు రంగంలోకి దిగాయి. దాదాపు పది రోజుల పాటు ప్రచారంతో హోరెత్తించాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతలు ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. పట్టణాల్లో గెలుపే లక్ష్యంగా ప్రచారం చేశారు. వందల మందిని వెంటేసుకుని గల్లీగల్లీ చుట్టేశారు. పార్టీల నేతలు వార్డుల వారీగా బాధ్యతలు పంచుకుని ఇంటింటికీ తిరిగారు. ప్రచార పర్వం ముగియడంతో అన్ని పార్టీల నేతలు ప్రలోభాలకు తెర లేపారు. ఉదయమే పోలింగ్‌కు సమయం దగ్గర పడడంతో విచ్చలవిడిగా తాయిలాలు వెదజల్లాయి. చికెన్ వద్దు అన్నవారికి అరకిలో మటన్‌ను పంపించారు. గత రెండ్రోజులుగా మద్యం సీసాలు, కూల్‌డ్రింక్‌లు సరఫరా చేశారు. వీటికి అదనంగా రాత్రిపూట డబ్బుల పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు ప్రజలు చెవులు కొరుక్కున్నారు. ఒక్కో ఓటుకు రూ.1500 నుంచి రూ.3 వేలు ఇచ్చినట్లు సమాచారం. కొన్ని పట్టణాల్లో ఖరీదు కూడా పెంచారు. డివిజన్లు, వార్డుల్లో మద్యం ఏరులై పారుతుండగా, మరోపక్క డబ్బుల పంపకాలు జోరందుకున్నాయి. ఇక, ప్రత్యర్థి ఎంత పంచుతున్నాడు.. అని అంచనా వేస్తూ అంతకుమించి ఓటర్లను ఇవ్వటానికి ఎత్తులు వేయడంలో అభ్యర్థులు తలమునకల య్యారు. ఇలా యథేచ్ఛగా పంపకాలు జరుగుతున్నప్పటికీ అధికారుల దృష్టిలో మాత్రం పడలేదు. అయితే పరస్పరం ఆయా పార్టీల వారు మా÷-తరం ఆరోపణలు చేసుకున్నారు. ఫలానా పార్టీవారు డబ్బులు పంచుతున్నారంటూ నిందలు వేసారు. స్థానిక నేతల అండతో విచ్చలవిడిగా మద్యం, డబ్బులను పంపిణీ చేస్తుంటే, పోలీసులు వారికి సహకరిస్తున్నారని ఆరోపించారు. ఇదంతా ఒక ఎత్తయితే...ప్రత్యర్థి పార్టీల్లో నాయకులకు డబ్బు, మద్యం ఎరగా వేసి ఎన్నికల్లో గెలుపుకోసం మార్గాలు తయారు చేసుకుంటున్నారు. కోవర్టులను ఏర్పాట్లు చేసుకుని వారి ఎత్తులను చిత్తు చేయడానికి అభ్యర్థులు డబ్బులు ఆశ చూపుతు న్నారని సమాచారం. ప్రత్యర్థి అభ్యర్థితో ఉండే ముఖ్యమైన నాయకులు పార్టీ మారకున్నా సమాచారం చేరవేసి వారి ఓటమికి కృషి చేసే వారికి రూ. 50000 నుంచి రూ.లక్ష వరకు ముట్ట చెబుతున్నారని ప్రచారం జరుగుతోంది. ఓటర్లనే కాకుండా ప్రత్యర్థి పార్టీల నాయకులను కూడా ప్రలోభాలకు గురి చేసి పార్టీలు మారడానికి వ్యూహాలు రచిస్తున్నారని తెలిసింది. మొత్తంగా మునిసిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగించారు. వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు గెలుపు టెన్షన్‌తో పాటు చైర్మన్ సీటు దక్కుతుందా అనే ఉత్కంఠలో ఉన్నారు. ప్రధాన పార్టీలు చైర్మన్ అభ్యర్థిని ప్రకటించకుండానే ఎన్నికల ప్రచారంలోకి దిగాయి. ఈ నేపథ్యంలో పురపాలికల్లో చైర్మన్ సీటుపై ఆశతో ఆశావహులు భారీగా ఖర్చు పెట్టారు. తన గెలుపుతో పాటు తన పార్టీకి చెందిన వార్డు సభ్యుల గెలుపుకు కూడా వారి భుజస్కంధాలపై వేసుకున్నారు. ఖర్చుకు వెనుకాడకుండా ఆశావహులు అన్నితామై వ్యవహరించారు. అయితే ఇన్నీ చేసిన చివరికి పార్టీకి మెజార్టీ సీట్లు వస్తాయా..? తానే పార్టీ అభ్యర్థిని అవుతానా అనే టెన్షన్‌లో ఆశావహులు ఉన్నారు. ఏదిఏమైనా ఎన్నికల ప్రచారం ముగిసింది. ఎత్తులు, పైఎత్తులు పూర్తయ్యాయి. ప్రజలు ఎవరిని ఆదరిస్తారాఓ చూడాలి. గత సర్పంచ్ ఎన్నికల్లో డబ్బులు తీసుకుని ఓటేయలేదని నిలదీసారు. తమ డబ్బులు వాపస్ ఇవ్వాలని నడిబజారులు పసుపుబయ్యింతో తిరిగారు. ఈ ఎన్నికల్లో అలాంటి విచిత్రాలు ఇంకా ఎన్ని చూడాల్సి వస్తుందో. ఓటర్ల మనసు ఎలా ఉం టుందో వేచి చూడాలి.

## పుస్తక వివాదంపై స్పందించిన మాజీ ఆర్మీ చీఫ్

### - పుస్తకం ఇంతవరకు పబ్లిష్ కాలేదని వెల్లడి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి10( వెలుతురు):
మాజీ ఆర్మీ స్టాఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవాణెలి మంగళవారం తన పుస్తకం ' ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టనీ' పుస్తక వివాదంపై తొలిసారిగా స్పందించారు. ప్రచురించబడని పుస్తకంపై ఇటీవల పార్లమెంట్ బ్జడెట్ సమావేశాల్లో వివాదం చెలరేగింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ పుస్తకంలో, మోడీ ప్రభుత్వం చైనాతో ఘర్షణ సమయంలో సమర్థవంతంగా వ్యవహరించలేదని ఉందని ఆరోపణలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నరవాణెలి మౌనాన్ని వీడారు. 'ఇది పుస్తక స్థితి' అని పుస్తక పబ్లిషర్ పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా సోషల్ మీడియా పోస్టును ఆయన షేర్ చేశారు. 'ఈ పుస్తకం ప్రచురణ హక్కులు తమవేనని, పుస్తకం ఇంకా ప్రింటింగ్‌కు వెళ్లలేదని, ప్రింట్, డిజిటల్, పీడీఎఫ్ లేదా ఏ రూపంలోనూ మేము ఎక్కడా విడుదల చేయలేదని పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా వెల్లడించింది. ఇదే సమయంలో ఇంటర్నెట్‌లో సర్క్యులేట్ అవుతున్న అనధికారిక ప్రింట్లు కాపీరైట్ ఉల్లంఘన కిందకు వస్తాయని, వెంటనే వాటిని ఆపాలని చెప్పింది. ఇప్పుడు ఇదే విషయాన్ని నరవాణెలి కూడా చెబుతున్నారు.కొన్ని రోజులు క్రితం రాహుల్ గాంధీ పార్లమెంట్ ప్రాంగణంలో ఈ పుస్తకం కాపీని చూపిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 2020 లడఖ్‌లో భారత్-చైనా ఘర్షణ సమయంలో భారత ప్రభుత్వం సమర్థవంతంగా వ్యవహరించలేదనే విషయాలు ఇందులో ఉన్నాయని ఆరోపణలు చేశారు. ఈ పుస్తకం అధికారికంగా విడుదల కాలేదని చెబుతూ లోక్‌సభలో రాహుల్ గాంధీ ఈ పుస్తకంలోని భాగాలను చదివేందుకు అనుమతించలేదు. మరోవైపు, ఇంకా పబ్లిష్ కాని పుస్తకం అక్రమంగా పంపిణీ చేయడంపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

## స్పీకర్ ఓం బిర్లా కీలక నిర్ణయం

### - అవిశ్వాస తీర్మానంపై చర్చలో విధులకు దూరం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి10( వెలుతురు):
లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కీలక నిర్ణయం తీసుకున్నారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ పూర్తయ్యేంత వరకూ సభకు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నారు. స్పీకర్‌ను తొలగించాలంటూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ సెక్రటరీకి కాంగ్రెస్ నోటీసు ఇచ్చిన నేపథ్యంలో ఓం బిర్లా ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో రాహుల్ గాంధీకి స్పీకర్ అవకాశం ఇవ్వలేదని, నిలదీసిన 8 మంది ఎంపీలపై సస్పెన్స్ వేటువేశారని విపక్షాలు తప్పుపడుతున్నాయి. విపక్షానికి చెందిన మహిళా ఎంపీలు దాడికి ప్రయత్నిస్తారనే సమాచారంతో ప్రధాని ప్రసంగం లేదని సభాపతి స్థానం నుంచి ఓం బిర్లా ప్రకటించడం, మహిళా ఎంపీలపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసిన బీజేపీ ఎంపీపై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ క్రమంలో 118 మంది సభ్యుల సంతకాలతో మంగళవారం ఉదయం లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు విపక్షాలు అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేశాయి. కాగా, దీనికిముందు అధికార పార్టీకి తలొగ్గి తమపై నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ ఓం బిర్లాకు రాసిన లేఖలో కాంగ్రెస్ మహిళా ఎంపీలు నిరసన తెలిపారు.

## ఇవేం పొత్తులు? "పార్టీల వింత పోకడలు, విన్యాసాలు.!"

# ఓట్లు వేసే ప్రజలు అయోమయం..?



**మన్నారం నాగరాజు.**
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

**తెలంగాణ రాజకీయ రంగం మరోసారి ప్రజాస్వామ్యపు నైతికతను ప్రశ్నించే స్థితికి చేరుకుంది. ఎన్నికలు సమీపిస్తే పార్టీల మధ్య పొత్తులు, ఎన్నికల అనంతరం విడిపోయే రాజకీయ సమీకరణాలు, సిద్ధాంతాలకంటే తాత్కాలిక లాభాలను ప్రాముఖ్యతనిచ్చే వ్యూహాలుఇవన్నీ ప్రజలలో తీవ్రమైన అయోమయాన్ని కలిగిస్తున్నాయి. రాజకీయ పార్టీల వింత విన్యాసాలు ప్రజాస్వామ్యాన్ని ఒక రాజకీయ మార్కెట్‌గా మార్చుతున్నాయా? రాజకీయ సిద్ధాంతాలు ఓట్ల కోసం బేరసారాల పావులుగా మారుతున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఖమ్మం జిల్లాలో జరుగుతున్న పరిణామాలు ఈ సంక్షోభానికి ప్రతిబింబంగా నిలుస్తున్నాయి.**

ఇక్కడ రాజకీయ దృశ్యాలను చూస్తే, ప్రజలు "ఇది రాజకీయమా? లేక ఒక రాజకీయ నాటకమా?" అని అనుకునే పరిస్థితి. ఒకప్పుడు స్పష్టమైన సిద్ధాంతాలతో ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించిన కమ్యూనిస్టు పార్టీలు నేడు బూర్జువా పార్టీలతో పొత్తులు పెట్టుకుని, మరోచోట వాటితోనే పోటీ చేస్తూ, ఇంకొచోట అదే పార్టీలతో కలిసి ప్రచారం చేస్తూ ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. సిద్ధాంతాల పట్ల విశ్వాసం కలిగిన వామపక్ష కార్యకర్తలకు ఇది తీవ్ర నిరాశను కలిగిస్తోంది. ఇది కేవలం వ్యూహాత్మక రాజకీయమా? లేక వామపక్షాల సిద్ధాంత సంక్షోభమా? అనే ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన సమయం వచ్చింది. ఖమ్మం జిల్లా చరిత్రాత్మకంగా వామపక్ష రాజకీయాలకు కీలక కేంద్రం. తెలంగాణ సాయుధ పోరాటం నుండి కార్మిక ఉద్యమాలు, రైతు ఉద్యమాల వరకు ఈ ప్రాంతం కమ్యూనిస్టు ఉద్యమానికి ఒక ప్రయోగశాల. బొగ్గు గనులు, పరిశ్రమలు, సాగునీటి వ్యవస్థలు, రైతు భూములు,ఇవి వామపక్ష రాజకీయాలకు సామాజిక ఆధారం. కానీ అదే ప్రాంతంలో నేడు వామపక్షాలు తమ స్వతంత్రతను కోల్పోయి, తాత్కాలిక రాజకీయ లాభాల కోసం సిద్ధాంతాన్ని పక్కన పెడుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌సీపీఐ మధ్య సర్దుబాటు ద్వారా కొత్తగూడెం నియోజకవర్గం సీపీఐకు దక్కింది. కూనంనేని సాంబశివరావు శాసన సభ్యుడిగా ఎన్నికై, తెలంగాణ అసెంబ్లీ లో వామపక్షాల గొంతుగా నిలిచారు. సామినేని రామారావు హత్య కేసు వంటి అంశాలలో ప్రభుత్వంపై ప్రశ్నలు వేసి, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష బాధ్యతను గుర్తుచేశారు. ఈ పాత్ర ప్రజలలో వామపక్షాలపై కొంత నమ్మకాన్ని పెంచింది. ఒక ఎమ్మెల్యే మాత్రమే అయినా ప్రజా సమస్యలపై నిలబడే ధైర్యం చూపించిన సందర్భాలు ఉన్నాయి.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరైన సందర్భం వామపక్షాలకు ఒక రాజకీయ గుర్తింపును ఇచ్చింది. వామపక్షాల చరిత్రను గుర్తు చేస్తూ, ప్రజా ఉద్యమాల పాత్రను రాజకీయ ప్రధాన ధారలోకి తీసుకురావాలనే ప్రయత్నం కనిపించింది. కానీ అంతలోనే జిల్లా రాజకీయాల్లో కొత్త పరిణామాలు చోటుచేసుకున్నాయి. కాంగ్రెస్‌లోని ఒక మంత్రి కొత్తగూడెం సీటుపై పట్టు సాధించాలని భావిస్తున్నారని, సీపీఐకాంగ్రెస్ పొత్తును చెడగొట్టడంలో కీలక పాత్ర పోషించారని రాజకీయ వర్గాలు అంటున్నాయి. సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ బహిరంగంగా విమర్శలు చేయడం ఈ విభేదాలను మరింత స్పష్టం చేసింది.

ఇది కేవలం ఒక సీటు రాజకీయమా? లేక వామపక్షాల రాజకీయ స్థితిని బలహీనపరిచే వ్యూహమా? అనే ప్రశ్నకు సమాధానం వెతకాలి. ఒక మంత్రి తన రాజకీయ భవిష్యత్తు కోసం పొత్తును చెడగొట్టగలిగితే, వామపక్షాల బలహీనత ఎంత స్థాయిలో ఉందో అర్థమవుతుంది. ప్రజా ఉద్యమాల ఆధారంతో కాకుండా, పొత్తుల ఆధారంతో జీవిస్తున్న రాజకీయ శక్తి ఎంత సులభంగా అణచివేయబడుతుందో ఇది చూపిస్తుంది. మరోవైపు సీపీఎం గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో పొత్తుకు సిద్ధమైంది. అది కుదరకపోవడంతో కాంగ్రెస్‌తో చర్చలు జరిపింది. చివరకు తాము కోరిన పాలేరు, మిర్యాలగూడం సీట్లు దక్కకపోవడంతో వంటరిగా పోటీ చేసింది. ఇది వామపక్షాల మధ్య సమన్వయ లోపాన్ని స్పష్టంగా చూపించింది. ఒకవైపు బీఆర్ఎస్‌తో చర్చలు, మరోవైపు కాంగ్రెస్‌తో రాయబారం,ఇది సిద్ధాంతపరంగా ఎంత సమర్థనీయం? వామపక్షాలు బూర్జువా పార్టీలతో వ్యూహాత్మక పొత్తులు పెట్టుకోవచ్చు, కానీ తమ స్వతంత్ర రాజకీయ రేఖను కోల్పోవడం ప్రమాదకరం. పంచాయతీ ఎన్నికల్లో, మున్సిపాలిటీ ఎన్నికల్లో కూడా పరిస్థితిని బట్టి, గెలుపే లక్ష్యంగా పొత్తులు, విడిపోయే నిర్ణయాలు తీసుకున్నారు. ఈ వ్యూహాత్మక రాజకీయాలు వామపక్షాల సిద్ధాంతానికి విరుద్ధంగా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు "బూర్జువా పార్టీలకు ప్రత్యామ్నాయం" అని చెప్పుకున్న వామపక్షాలు నేడు అదే పార్టీలతో పొత్తులు పెట్టుకుని రాజకీయ జీవనాధారం పొందుతున్నాయి. ఇది సిద్ధాంతం నుండి రాజకీయ ప్రాగ్మాటిజానికి మార్పు కాదు, సిద్ధాంత సంక్షోభానికి సంకేతం.

కొత్తగూడెం మున్సిపాలిటీలో సీపీఐ, బీఆర్ఎస్, టీడీపీ కలిసి పోటీ చేయడం రాజకీయంగా అత్యంత విచిత్రం. టీడీపీ అభ్యర్థులకు అధిష్టానం బీ-ఫారమ్స్ ఇవ్వకపోవడంతో కంకి కొడవలి, కారు గుర్తులతో పోటీ చేయడం ప్రజలకు హాస్యాస్పదంగా కనిపిస్తోంది. ఇది రాజకీయ సిద్ధాంతాల కంటే స్థానిక లెక్కలే ముఖ్యమని చూపిస్తుంది. ప్రజలు ఇప్పుడు గుర్తులను చూసి కాదు, పొత్తులను చూసి ఓటు వేయాల్సిన పరిస్థితి. ప్రజాస్వామ్యంలో ఓటరు చైతన్యం గుర్తుల ఆధారంగా కాకుండా సిద్ధాంతాల ఆధారంగా ఉండాలి, కానీ ఇక్కడ అది పూర్తిగా విరుద్ధంగా మారింది.

ఇక్కడ సీపీఎం రెండు కార్పొరేషన్ స్థానాలకు పరిమితమై కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంది. మదిర మున్సిపాలిటీలో బీఆర్ఎస్, టీడీపీ, సీపీఎం, సీపీఐ కలిసి ప్రచారం చేయడం రాజకీయ సిద్ధాంతాలకు విరుద్ధంగా అనిపిస్తోంది. ఒకచోట శత్రువులు, మరోచోట మిత్రులుఇది రాజకీయ తత్వమా? లేక రాజకీయ అవకాశవాదమా? ప్రజలలో "అందరూ ఒకటే" అనే భావన పెరిగితే ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది. ఇది వామపక్షాలకు అత్యంత ప్రమాదకరం.

ఖమ్మం రూరల్ మండలంలో ఉన్న ఎదులాపురం మున్సిపాలిటీ వామపక్షాలకు సంప్రదాయంగా బలమైన ప్రాంతం. సీపీఐ, సీపీఎం కలిసి పోటీ చేస్తే ఈ మున్సిపాలిటీ వామపక్షాల ఏమన్నారు ప్రజా సమస్యలు వచ్చినప్పుడు ప్రజలకు కావాల్సిన ఈ విధంగా పనిచేయడం లేదు హాలో వశమవుతుంది. కానీ ఇక్కడ కూడా రెండు పార్టీలు వేరువేరుగా పోటీ చేస్తున్నాయి. సీపీఎం బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకుంది. ఒకచోట కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించేందుకు పోటీ నుంచి ఉపసంహరించుకుంది. పార్టీకి చెప్పకుండా చేసిన చర్యలపై చర్యలు తీసుకోవడం వామపక్షాలలో అంతర్గత విభేదాలను సూచిస్తుంది. దేశమంతా కమ్యూనిస్టు ఐక్యత గురించి మాట్లాడే నాయకులు స్థానిక స్థాయిలో ఎందుకు విడిపోతున్నారు? ఇది నాయకత్వ సంక్షోభమా? లేక సిద్ధాంత సంక్షోభమా?

కమ్యూనిస్టు పార్టీలు సిద్ధాంతపరంగా బూర్జువా పార్టీలకు ప్రత్యామ్నాయంగా నిలబడాలి. కార్మిక వర్గం, రైతాంగం, పేద ప్రజల ప్రయోజనాల కోసం స్వతంత్ర రాజకీయ పోరాటం చేయాలి. కానీ వాస్తవంలో వారు బీఆర్ఎస్, కాంగ్రెస్, టీడీపీ వంటి పార్టీలతో పొత్తులు పెట్టుకోవడం సిద్ధాంతపరంగా ప్రశ్నార్థకంగా మారింది. ప్రత్యేకంగా బీజేపీతో కూటమిలో ఉన్న టీడీపీతో కమ్యూనిస్టులు పొత్తు పెట్టుకోవడం వామపక్ష కార్యకర్తలను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. ఇది సిద్ధాంత విరుద్ధ రాజకీయంగా కనిపిస్తోంది.

వామపక్ష శ్రేణులు అడుగుతున్న ప్రధాన ప్రశ్నఎందుకు కమ్యూనిస్టు పార్టీలు కలవరు? దేశమంతా ఐక్య వామపక్షం అవసరమని మాట్లాడే నాయకులు స్థానిక స్థాయిలో ఎందుకు విడిపోతున్నారు? ఒకటి రెండు సీట్ల కోసం ఎంతకాలం ఈ రాజకీయాలు? ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించాల్సిన పార్టీలు ఎందుకు తాత్కాలిక రాజకీయ లాభాల కోసం సిద్ధాంతాన్ని పక్కన పెడుతున్నాయి? ఈ ప్రశ్నలు వామపక్షాల భవిష్యత్తుకు అత్యంత కీలకమైనవి.

భారత కమ్యూనిస్టు ఉద్యమం చరిత్రలో ఐక్యత ప్రధాన బలంగా ఉంది. తెలంగాణ సాయుధ పోరాటం, కార్మిక ఉద్యమాలు, రైతు ఉద్యమాలు వామపక్షాల ఐక్యత వల్లనే సాధ్యమయ్యాయి. కానీ విభేదాలు, చీలికలు వామపక్షాలను బలహీనపరిచాయి. సీపీఐ, సీపీఎం విభజన, తరువాత ఏర్పడిన ఇతర వామపక్ష గ్రూపులు ఈ ఉద్యమాన్ని రాజకీయంగా బలహీనపరిచాయి. నేటి పొత్తుల రాజకీయాలు ఈ బలహీనతను మరింత పెంచుతున్నాయి.

ఒకప్పుడు కమ్యూనిస్టులు ప్రజా ఉద్యమాల ద్వారా రాజకీయ బలం సంపాదించారు. నేడు ఎన్నికల రాజకీయాలపై అధిక ఆధారపడటం, పొత్తులపై ఆధారపడటం వామపక్షాల స్వతంత్రతను తగ్గిస్తోంది. ప్రజలతో నేరుగా అనుసంధానం లేకుండా, పొత్తులపై ఆధారపడే రాజకీయాలు దీర్ఘకాలంలో ప్రమాదకరం. ప్రజలు వామపక్షాలను స్వతంత్ర రాజకీయ శక్తిగా కాకుండా చిన్న పార్టీలుగా మాత్రమే చూస్తున్నారు. ఇది వామపక్షాల పతనానికి సంకేతం.

న్యోలిబరల్ ఆర్థిక విధానాల యుగంలో కార్పొరేట్ శక్తులు, మాధ్యమాల రాజకీయాలు, ఎన్నికల ఫైనాన్స్ రాజకీయ వ్యవస్థను ప్రభావితం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో వామపక్షాల పాత్ర మరింత కీలకం కావాలి. కానీ వామపక్షాలు తమ రాజకీయ స్వతంత్రతను కోల్పోతే, ప్రజలకు ప్రత్యామ్నాయ రాజకీయ దిశ ఎవరు చూపిస్తారు? ఈ ప్రశ్నకు సమాధానం వామపక్షాల చేతుల్లోనే ఉంది.వామపక్షాల ముందు ఉన్న మార్గాలు స్పష్టంగా ఉన్నాయి. మొదటగా, ఐక్య వామపక్ష వేదిక నిర్మించాలి. సీపీఐ, సీపీఎం, ఇతర వామపక్ష గ్రూపులు కలిసి ఒక రాజకీయ వేదికను నిర్మించాలి. రెండవది, స్వతంత్ర రాజకీయ రేఖ రూపొందించాలి. బూర్జువా పార్టీలపై ఆధారపడకుండా స్వతంత్ర రాజకీయ లైన్‌ను రూపొందించాలి. మూడవది, ప్రజా ఉద్యమాల పునరుద్ధానం చేయాలి. కార్మిక, రైతు, యువజన, మహిళా ఉద్యమాలను బలపరచాలి. నాలుగవది, సిద్ధాంత పునరుద్ధానం చేయాలి. మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా ప్రజలకు వివరించాలి. ఐదవది, పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యం బలపరచాలి. ప్రజల విశ్వాసమే వామపక్షాల నిజమైన సంపద. పొత్తుల రాజకీయాలు ఈ విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడితేనే వామపక్షాలకు తిరిగి బలం వస్తుంది. ప్రజల మధ్య నమ్మకం కోల్పోతే, ఎంత పొత్తులు పెట్టుకున్నా రాజకీయంగా బలహీనంగానే ఉంటారు.ఖమ్మం జిల్లాలో కనిపిస్తున్న వింత పొత్తులు, రాజకీయ విన్యాసాలు వామపక్షాల సంక్షోభానికి ప్రతీక. సిద్ధాంతం, ప్రజా ఉద్యమం, ఐక్యత,ఇవే కమ్యూనిస్టు ఉద్యమానికి ప్రాణం. ఇప్పటికైనా కమ్యూనిస్టు పార్టీలు ఒక వేదికపైకి వచ్చి ఐక్యంగా పోరాడాలి. లేదంటే రాజకీయంగా మరింత అప్రాసంగికంగా మారే ప్రమాదం ఉంది. ప్రజల కోసం పోరాడే శక్తిగా నిలవాలంటే వామపక్షాలు తమ రాజకీయ దిశను పునర్మూల్యాంకనం చేయాలి. పొత్తుల రాజకీయాల నుండి ప్రజా ఉద్యమాల వైపు తిరిగి రావాలి. అప్పుడే వామపక్షాలకు తిరిగి ప్రజల మద్దతు లభిస్తుంది. లేకపోతే, వింత పొత్తుల రాజకీయాలు వామపక్షాలను చరిత్ర పుటల్లో ఒక అధ్యాయంగా మాత్రమే మిగిల్చే ప్రమాదం ఉంది. ఇది కేవలం ఖమ్మం జిల్లా సమస్య కాదు. ఇది భారత వామపక్షాల భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్న. ప్రజల పక్షం నిలవాల్సిన రాజకీయ శక్తులు తాత్కాలిక రాజకీయ లాభాల కోసం సిద్ధాంతాన్ని తాకట్టు పెడితే ప్రజాస్వామ్యం ఎటు దారితీస్తుంది? ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత వామపక్షాలపై ఉంది. ఇప్పటికైనా వామపక్షాలు తమ చరిత్రను, తమ బాధ్యతను గుర్తు చేసుకుని ప్రజా ఉద్యమాలకు తిరిగి నాయకత్వం వహించాలి. అదే కమ్యూనిస్టు ఉద్యమానికి నిజమైన పునర్జీవనంతో ముందుకు వస్తారని ఆశిద్దాం.

# మల్కాజిగిరి జిల్లాలో 'మీడియేషన్ ఫర్ నేషన్ మీడియేషన్ డ్రైవ్ 2.0'

**కుషాయిగూడ, ఫిబ్రవరి 10 వెలుతురు:**
సుప్రీంకోర్టు, తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు 'మీడియేషన్ ఫర్ నేషన్ మీడియేషన్ డ్రైవ్ 2.0' కార్యక్రమాన్ని మల్కాజిగిరి జిల్లాలోని అన్ని న్యాయస్థానాలలో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. బాల భాస్కర రావు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం (మీడియేషన్) ద్వారా సులభంగా, వేగంగా పరిష్కరించుకునేందుకు ఈ కార్యక్రమం మంచి అవకాశమని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, స్నేహపూర్వకంగా సమస్యలకు పరిష్కారం కనుగొనడంతో పాటు న్యాయస్థానాలపై ఉన్న భారం తగ్గించేందుకు సహకరించాలని సూచించారు.ఈ మీడియేషన్ డ్రైవ్‌ను మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

# దాద్ పల్లి గ్రామంలో ప్రధాని యోజన ఉచిత వంటగ్యాస్ సిలిండర్ లబ్ధిదారులకు పంపిణీ

**- గ్రామ సర్పంచ్ నేనావత్ శాంతి రాజు నాయక్ ఉపసర్పంచ్ నర్సింగ్ రావు**



**మంచాల వెలుతురు ఫిబ్రవరి 10:**
మంచాల మండలం దాద్ పల్లి గ్రామంలోగ్రామపంచాయతీ కార్యాలయంలోప్రధానియోజన ఉ జ్వల భారత్ స్కీంకిందమంజూరైన వంటగ్యాస్ సిలిండర్ స్టవ్ లనులబ్ధిదారుల కుపంపిణీచేసి నదాద్ పల్లి గ్రామసర్పంచ్ నేనావత్ శాంతి రాజునాయక్ ఉపసర్పంచ్ నర్సింగ్ రావు సంద ర్భం గా మాట్లాడుతూవంటగ్యాస్ లేని డ్వాక్రాసంఘాల మహిళలు ప్రధానియోజన ఉజ్వలభారత్ స్కీంకింద ఉచితంగా మంజూరయ్యే వంటగ్యాస్ కోసం దరఖాస్తు చేసుకొని సద్విని యోగం చే సుకోవాలన్నారు ఈకార్యక్రమంలో ఉజ్జ్వల భారత్ స్కీంకింద ఉచితంగా వంటగ్యాస్ సిలిండర్ స్టవ్ లు లబ్ధిపొందిన లబ్ధిదారులు సభవట్ బుజ్జి నేనవాత్ రోజా కేతవత్ శిరీష నేనావత్ అక్ష య గ్రామస్తులు తదితరులుపాల్గొన్నారు

# చింతపల్లిగూడలో స్మశానవాటిక ప్రహరీగోడ నిర్మాణ పనులను పరిశీలించిన ఉక్కుల అశోక్

**- నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డితోనే సాధ్యం**

**- తెలంగాణ రాష్ట్రకమ్యూనిటీ పారామెడికల్ వైద్యుల ఐక్యవేదిక అధ్యక్షుడు ఉక్కుల అశోక్**



**ఇబ్రహీంపట్నం వెలుతురు ఫిబ్రవరి 10:**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గం చింతపల్లి గూడ గ్రామంలోస్మశానవాటిక ప్రహరీగోడ నిర్మాణాన్ని పరిశీలించిన తెలంగాణ రాష్ట్ర కమ్యూనిటీ పారామెడిక్ వైద్యుల ఐక్యవేదిక అధ్యక్షుడుఉక్కుల అ శోక్ ఈసందర్భంగా మాట్లాడుతూ సమగ్ర అభివృద్ధి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారె డ్డిగారితోనే సాధ్యమవుతుందని సబ్బండ వర్గాల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వ సారథ్యంలో ఎమ్మెల్యే అ హర్నిశలుకృషి చేస్తున్నారని అన్నారు ఎమ్మెల్యేఆదేశాల మేరకు మంగళవారం ఆదిభట్ల సర్కి ల్ కొంగర కలన్ 54 వడివిజన్ చింతపల్లిగూడ గ్రామంలోఎమ్మెల్యేగారి సహకారముతో 50లక్షల రూపాయల విలువ మేరకు శశ్మానవాటిక ప్రహరీగోడ మరియు హైమాస్ట్ లైట్ సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ముగ్గు వేసి ప్రారంభించారు ఈసందర్భంగా కార్యక్రమంలో పాల్గొని క్రొత్త పనులకు శ్రీకా రంచుట్టారు ఈకార్యక్రమంలో ఆదిభట్లసర్కిల్ వర్క్ఇన్స్పెక్టర్ జాన్సన్ చింతపల్లిగూడ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడుజోగునర్సింహ సీనియర్ నాయకులు శేరి రమేష్ గ్రామస్తులు తదిత రులుపాల్గొన్నారు.

# ధూళిపేట్‌లో 2.112 కేజీల గంజాయి టీం లీడర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో పట్టివేత



**బషీర్ బాగ్ వెలుతురు 10 ఫిబ్రవరి :**
ధూళిపేట్ దేవినగర్ జుమ్మెరాత్ బజార్ ప్రాంతంలోని ఇంటి నెంబరు 14-8-419లో గంజాయి అమ్మకాలు జరుపుతుండ గా ఎస్టీఎఫ్ బీ టీమ్ లీడర్ అంజిరెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది తనిఖీలు చేపట్టి 2.112 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో 8 మందిపై కేసు నమోదు చేశారు. ఇద్దరిని అరెస్టు చేశారు. ఐదు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఏ. మహేష్ సింగ్, రాజేందర్ సింగ్‌లను అరెస్టు చేయగా నయన, మనోజ్ సింగ్, సుమన్ బాయి, లడ్డు, నందిలతోపాటు ఒక మైనర్‌పై కూడ కేసు నమోదు చేశారు. నిందితులను, గంజాయిని ధూళిపేట్ స్టేషన్‌లో అప్పగించారు.

# జనరల్ స్థానాల్లో పోటీ చేస్తున్న బీసీ కౌన్సిలర్ అభ్యర్థులను, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి

**- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 10:**
ఓడిపోతామనే భయంతో జనరల్ సీట్లలో పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థులను మరియు ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తున్నటువంటి అగ్రకులాలకు చెందిన వారిపై చర్యలు తీసుకోవాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు.బీసీలలో వచ్చిన చైతన్యం చూసి తట్టుకోలేక ఇలా బెదిరింపులకు, దౌర్జన్యాలకు దిగడం ప్రజాస్వామ్యంలో సరికాదని అన్నారు.

# ఇబ్రహీంపట్నం ప్రజలకు వరంగా 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను స్వయంగా పర్యవేక్షించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**- నిధుల కొరత ఉండదు వేగంగా పూర్తి చేయండి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు**

**- ప్రజల ఆరోగ్యం మాప్రాధాన్యం ఇబ్రహీంపట్నం అభివృద్ధి మాబాధ్యత ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**





**ఇబ్రహీంపట్నం వెలుతురు ఫిబ్రవరి 10:**
ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారం ముగిసినావెంటనే ప్రజలకి ఇచ్చిన మాటప్రకారం రూపురేక లుమారుస్తాఅనీ ఇచ్చిన మాటకి కట్టుబడి మనఇబ్రహీంపట్నంలో జరుగుతున్న అభి వృద్ధి పనుల పర్యవేక్షణలో భాగంగా ఇబ్రహీంపట్నం ప్రజల ఆరోగ్య భద్రతకు కీలకంగా మారను న్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డి స్వ యంగా పరిశీలించారు నిర్మాణప్రాంగణాన్ని సందర్శించి పనులపురోగతిని అధికారులను అడిగి తెలుసు కున్నారు ఆసుపత్రి భవనం నాణ్యతవసతులు వార్డులు అత్యవసర విభాగంప్రసూతి కేంద్రం ల్యాబ్ సౌకర్యాలు వంటి అంశాలపై ప్రత్యేకంగా సమీక్షించినఎమ్మెల్యే ఇదిసాధారణ భవ నం కాదు ఇబ్రహీంపట్నం ప్రజల ప్రాణాలకు భరోసాఇచ్చేఆసుపత్రి అనిస్పష్టంచేశారునిధుల విష యంలోఎలాంటి ఇబ్బందులు ఉండబోవని అవసరమైతే అదనపు నిధులు కూడా కేటాయిస్తామ ని హామీ ఇచ్చారు పనులుఆలస్యం కాకుండా వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు ఇంజినీ ర్లకు కఠినంగా ఆదేశించారునాణ్యత విషయంలో రాజీపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు ఆసుపత్రి పూర్తయితే ఇబ్రహీంపట్నం పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందు బాటులోకి రానున్నాయి అత్యవసర పరిస్థితుల్లో నగరానికి వెళ్లాల్సిన అవసరం తగ్గనుంది ప్రజ ల ఆరోగ్యసంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యేరంగారెడ్డి తీసుకుంటున్న చర్యలను స్థానికులు ప్రశంసి స్తున్నారు కార్యక్రమంలో ఇబ్రహీంపట్నంమార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లిగురునాథ్ రెడ్డి రెడ్డి కాంగ్రెస్ పార్టీరాష్ట్రనాయకుడు ఈసీ శేఖర్ గౌడ్ మామ పాండురంగారెడ్డి వివిధశాఖల అధికారు లు ప్రజాప్రతినిధులు మాజీప్రజాప్రతినిధులు తదితరులుపాల్గొన్నారు

# ఇబ్రహీంపట్నంలో మున్సిపాలిటీ ఎన్నికల సామాగ్రి బ్యాలెట్ బాక్సులను పరిశీలించిన రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి నారాయణ రెడ్డి





**ఇబ్రహీంపట్నం వెలుతురు ఫిబ్రవరి 10:**
ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో తే దీ 11-02-2026జరిగే మున్సిపల్ ఎన్నికల్లో విధులు నిర్వ హించే ప్రతిఅధికారి జాగ్రత్త గావ్యవహరించాలని చిన్న పొరపాట్లు జరగకుండా విధులు నిర్వ హించాలని జిల్లాఎన్నికల అధికారి ఎన్నికల సాధారణ పరిశీలకులు మయంక్ మిట్టల్ మరియు కలె క్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారుమంగళవారం మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లనుఎన్నికల సా ధారణ పరిశీలకులు మయంక్ మిట్టల్ జిల్లాఎన్నికల అధికారి కలెక్టర్ సి.నారాయణరెడ్డితోకలిసి ఇబ్రహీంపట్నంమున్సిపాలిటికి సంబంధించి శ్రీఇందుఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రి బ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ అధికారులకు ఇచ్చిన ఎలక్షన్ మెటీరియల్ పం పిణిని పరిశీలించారు ఈసందర్భంగా సాధారణ పరిశీలకులు మయంక్ మిట్టల్ మాట్లాడుతూ పోలింగ్ విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ చెక్ లిస్ట్ ప్రకారంఎన్నికల సామగ్రిని సరిచూసుకున్న తరువాత నే డిస్ట్రి బ్యూషన్ సెంటర్ నుండి బయలుదేరి వెళ్లాలని సూచించారు ఎన్నికల కమిష న్ నిబంధనలను అనుసరిస్తూ విధులు బాధ్యతగా నిర్వహిం చాలని అన్నారు 7.00 గంటల నుం డి సా యంత్రం5.00 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు గడువులోపుపోలింగ్ కేంద్రం లోనికి చేరుకున్న ఓటర్లకు సాయంత్రం5.00 గంటలుదాటిన తరువాత కూడాఓటువేసేందుకు అ వకాశంకల్పిం చామన్నారు ఈ సందర్భంగాకలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలోకావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా వేరుచేసి సిద్ధంగా ఉంచాలన్నారు పోలిం గ్ మెటీరియల్ పంపిణీ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు ఎలాంటిలోటుపాట్లుగందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని చెక్ లిస్టు ఆధారంగా ఎన్ని కల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా లేదా అన్నది జాగ్రత్తగాపరిశీలించు కోవాలని సూచించారు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశిం చారు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తుచ తప్పకుండా పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో సాఫీగా ఎన్నికలు జరిగేలా అంకితభావంతో కృషిచేయాలని ఎన్నికల సిబ్బందికి మార్గనిర్దేశంచే శారు ఎక్కడ కూడా రీపోలింగ్ కు ఆస్కారం లేకుండా పక్కాగాపో లింగ్ ప్రక్రియను నిర్వహించాల ని ఓటింగ్ సందర్భంగా గోప్యతను కాపాడేలా పకడ్బందీచర్యలు తీసుకోవాలని అన్నారు ఎన్నిక ల సామాగ్రిని బ్యాలెట్ పేపర్లను పోలింగ్ బాక్సులను పరిశీలించారు బ్యాలెట్ పత్రాలు జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలిపారు డిస్ట్రిబ్యూషన్ కేంద్రంనుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓ టింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు చెక్ లిస్ట్ ప్రకారంపోలింగ్ మె టీరియల్ క్షుణ్ణంగా పరిశీలించి అన్నిసరిగా ఉన్నాయని నిర్ధారణ చేసుకొని డిస్ట్రిబ్యూషన్ కేం ద్రంనుండిబయలుదేరాలని సూచించారు ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజే యాలని పోలింగ్ సిబ్బంది నిర్వహించే వారి విధులను క్షుణ్ణంగా వివరించారు ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం కట్టుదిట్టమైన భద్రత నడుమ బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్ లకు తరలించాల ని అన్నారు శేరిగూడలోమండల్ పరిషత్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలనుస్ట్రాంగ్ రూమును పరిశీలించారు మహేశ్వరం డిసిపి మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేం ద్రం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఎలాంటి సంఘటనలు జరగకుండా భద్రత కల్పించడం జరుగుతుందని ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూస్తామని తె లిపారు ఈకార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత్ రెడ్డి ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# అప్రజాస్వామిక లేబర్ చట్టాలని రద్దు చేయాలి

**-సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి**



**బషీర్ బాగ్ వెలుతురు 10 ఫిబ్రవరి :**
కేంద్ర ప్రభుత్వం 2020లో తీసుకొచ్చిన నాలుగు అప్రజాస్వామిక లేబర్ చట్టాలని రద్దు చేయాలనీ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి డిమాండ్ చేసారు అనేక కార్మిక పోరాటాలు మరియు వారి ప్రాణ త్యాగాల ద్వారా సాధించిన 29 కార్మిక చట్టాలని కరోనా సమయంలో రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు అప్రజాస్వామిక నాలుగు లేబర్ కోడ్ లని కేంద్రం ప్రభుత్వం తీసుకురావటాన్ని నిరసిస్తూ కేంద్ర,రాష్ట్ర కార్మిక సంఘాలు ఉమ్మడిగా ఈ నెల 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకి పిలునిచ్చాయి.ఆ సమ్మెకి సంబంధించిన గోడ పోస్టర్ ని మంగళవారం అబ్దుల్లాపూర్ మెట్టు మండల కేంద్రంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు కేతారాజు నర్సింహా అధ్యక్షతన సాయుధ పోరాట యోధుడు ధర్మబిక్షం విగ్రహం వద్ద ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముత్యాల యాది రెడ్డి ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు.ధర్మబిక్షం గారి విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించిన అనంతరం అయన మాట్లాడుతు.2014లో కేంద్రంలో నరేంద్రమోడీ ప్రధాన మంత్రి అయినప్పటి నుండి అనేక ప్రజా వ్యతిరేక మరియు కార్మిక వ్యతిరేకమైన నిర్ణయాలే చేశారాని ఆ నిర్ణయాల వల్ల సామాన్య ప్రజలే అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.ఔట్ సోర్సింగ్ ఉద్యోగస్థులని పర్మినెంట్ చేయాలని స్త్రీ పురుషులకి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులందరికి కనీస వేతనం అందించాలని డిమాండ్ చేశారు.నోట్ల రద్దు మరియు మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయటం లాంటివాన్ని ప్రజా వ్యతిరేక నిర్ణయాలే అని పోరాటాల ద్వారా సాధించుకున్న లేబర్ చట్టాలని కేంద్రం రద్దు చేసి బడా వ్యాపారస్థులకి మరియు పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా ఉండే నాలుగు దూర్మార్గమైన లేబర్ కోడ్ లని తీసుకొచ్చారాని వాటి రద్దు చేయాలనే డిమాండ్ తో ఈ నెల 12న జరిగే సార్వత్రిక సమ్మెలో వేల మంది కార్మికులు పాల్గొని సమ్మెని విజవంతం చేసి కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లు రద్దు అయ్యే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి,ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు అజ్మీరా హరిసింగ్ నాయక్,బిఓసి జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ప్రసాద్,బిఓసి నాయకులు మీ దవుల రాములు,పానుగంటి సాయిలు,మంగళపల్లి రవి,వడ్త్యా రమేష్ నాయక్, లింగం,అశోక్,పేరాల గోపి, ఏనుగోటి శేఖర్,హుస్సేన్,బాబు తెరాల లక్ష్మి,ఏనుగోటి లక్ష్మి,వాసిరెడ్డి లక్ష్మి,ప్రియా, ఆంజనేయులు ఏఐటీయూసీ మరియు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# 80 ఏళ్ల చరిత్ర కలిగిన ఉద్యోగుల సంఘం ప్రతిష్టను దెబ్బతీసే ప్రచురణలు ఖండనీయం

**- మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు బి. రవీ ప్రకాష్**






**మేడ్చల్ వెలుతురు ఫిబ్రవరి 10:**
ఒక ప్రముఖ తెలుగు దినపత్రికలో తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్‌పై ప్రచురితమైన వార్తను మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. గత 80 సంవత్సరాలుగా ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు అంకితభావంతో పనిచేస్తూ, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ముందుండి పోరాడిన చారిత్రాత్మక పూర్వ వైభవం కలిగిన ఈ సంఘం పై అసత్య, దుష్ప్రచారాత్మక కథనాలు ప్రచురించడం ఖండనీయము. ఇలాంటి నిరాధార ప్రచురణలు సంఘం ప్రతిష్టను దెబ్బతీయడమే కాకుండా, వేలాది సభ్యుల మనోభావాలను దెబ్బతీసే చర్యలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు బి. రవీ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవాలను ధృవీకరించకుండా బాధ్యతారహితంగా వార్తలు ప్రచురించడం పత్రికా నైతిక విలువలకు విరుద్ధమని ఆయన మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో యూనియన్ కీలక పాత్ర పోషించి చారిత్రాత్మక బాధ్యత నిర్వర్తించింది. ప్రభుత్వఉద్యోగుల మధ్య సేతగా వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోంది. ఉద్యోగుల ఐక్యత, గౌరవం, హక్కుల సాధనమే యూనియన్ ప్రధాన లక్ష్యం వెంటనే సంబంధిత వార్తపై నిజానిజాలు పరిశీలించి, స్పష్టమైన సవరణ ప్రచురించని బాధ్యత దినపత్రిక యాజమాన్యాన్ని పై ఉన్నదని తెలిపారు. భవిష్యత్తులో సంఘం ప్రతిష్టను దెబ్బతీసే విధంగా అసత్య ప్రచురణలు పునరావృతమైతే సహించబోమని హెచ్చరించారు .

# సుల్తాన్ బజార్ సీఐ కుంభం నరసింహ గౌడ్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగం గౌడ్



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 10:**
మంగళవారం రోజున కోటి లోని సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ లో ఇన్ స్పెక్టర్ కుంభం నరసింహ గౌడ్ గారిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసినట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ తెలిపారు. ఆయన వెంట బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ బొల్లేపల్లి స్వామి ఉన్నారు



కనకదుర్గ కాలనీలో సోమవారం రాత్రి ఓ ఇంట్లో రహస్యంగా పేకాట ఆడుతున్న పేకాట రాయుళ్లపై టాస్క్ ఫోర్స్ పోలీసులు మెరుపు దాడులు పేకాట ఆడుతూ పట్టుబడ్డ ఏడుగురు నిందితులు వీరి నుండి 1,17,850 రూపాయలతో పాటు 7మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు. విచారణ నిమిత్తం సుబేదారి పోలీసులకు అప్పగింత.

**హనుమకొండ జిల్లా వెలుతురు ఫిబ్రవరి 10:**

# రోడ్డు నీ మింగేసిన దుకాణాల ముందు ఏర్పాటు చేసుకున్న ర్యాంపులు

**- చిన్ననారాయణపురం రోడ్డు లో సారిక షాపు నుండి ఎస్సీ కమ్యూనిటీ హాల్ వరకు ఈ పరిస్థితి**



**నార్కట్ పల్లి వెలుతురు ఫిబ్రవరి 10:**
నార్కట్ పల్లి నుండి చౌడంపెల్లి కి వెళ్లే రోడ్డు వెడల్పు విస్తీర్ణం 70ఫీట్లు కానీ రెండు స్కూల్ బస్ లు వెళ్లడానికి చాల ఇబ్బందిగా ఉంటది కారణం ఏమంటే ప్రైవేట్ కట్టడాల దుకాణాలు రోడ్డునీ ఆక్రమించి వాళ్ళ సొంత వాహనాలకు ర్యాంపులు పార్కింగ్ ఏర్పరచుకోవడం వల్ల వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.. ఇలాంటి సమస్య చిన్ననారాయణపురం రోడ్డు లో ఇంటి అద్దెకు ఉన్నవాళ్ళు కూడ కార్లు రోడ్డు పై పార్క్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు రోడ్డు పై ర్యాంపులు ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకొని ఆ ర్యాంపులు తొలగించగలరని కాలనీ వాసులు కోరుతున్నారు.

# టాక్టర్ యూనియన్ నూతన అధ్యక్షుడుగా బెల్లి మృత్యుంజయ , కార్యదర్శిగా మోటే నరేష్



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 10:**
గ్రామం కొమ్మాయిగూడెం లో టాక్టర్ యూనియన్ అధ్యక్షుని& కార్యదర్శి ఏకగ్రీవంగా నియమించడం జరిగింది. సభ్యులందరూ కలిసి యూనియన్ అధ్యక్షునిగా బెల్లి మృత్యుంజయ్ కార్యదర్శి మోటే నరేష్, మాజీ అధ్యక్షుడు ఆకిటి శ్రీనివాస్ కార్యదర్శి దగ్గుల నవీన్ సత్కరించారు. వీరిని అభినందించారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ యూనియన్ నియమ నిబంధనలు పాటించాలని, యూనియన్ సభ్యులు కు తెలియజేశాడు. యూనియన్ సభ్యులందరూ పాల్గొనడం జరిగింది.

# ఫోటోగ్రాఫర్ కాట్రేగు సంజీవ కు ఉత్తమ వెడ్డింగ్ ఫోటోగ్రఫీ పురస్కారం



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 10:**
వెల్లంకి గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ కాట్రేగు సంజీవ కు ఉత్తమ వెడ్డింగ్ ఫోటోగ్రఫీ పురస్కారం వరించింది. ఈ మేరకు హైదరాబాదులోని. కేబీఆర్ కన్వెన్షన్. లో జరిగిన ఫోటో పరివార్ ఇండియా.ఫోటోపిన వారి ఇండియన్ వెడ్డింగ్ ఫోటోగ్రఫీ ఫెస్టివల్. ఈవెంట్లో జేఎన్టీయూ ప్రిన్సిపాల్ ఆనంద్ ప్రొఫెసర్ కమల్ రాయ్ మరియు ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా ఉత్తమ వెడ్డింగ్ ఫోటోగ్రాఫర్ పురస్కారం అందుకున్నారు. ఈ అవార్డు వచ్చినందుకు పలువురు ఫోటోగ్రాఫర్లు అభినందించారు.


# యూరియా యాపుతో రైతులకు తప్పని తిప్పలే తిప్పలు.




**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 10:**
రైతులకు యూరియా యాపుతో తప్పని తిప్పలే తిప్పలు. ఈ యాపు వాడాలి అంటే స్మార్టు ఫోను ఉండాలి, దానిని ఆపరేటు చేయడం తెలిసి ఉండాలి, చదువు రాని, ఆపరేటు తెలియని రైతుల పరిస్థితి ఎలా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్తగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్ అన్నదాతల కష్టాలు తీర్చకపోగా రైతన్నలను మరింత అయోమయంలోనికి పడేస్తున్నాయి. దళారుల వ్యాపారానికి అడ్డుకట్ట వేసి రైతులకు అందరికీ అందుబాటులోకి తేవాలన్న ప్రభుత్వ కోరిక రైతన్నలకు అందని ద్రాక్షగానే మిగిలిందని చెప్పవచ్చు. యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని అన్ని గ్రామాల్లోని రైతన్నలకు కొత్త యూరియా యాప్ లో యూరియా బుకింగ్ చేసే అవగాహన లేక ఎవరిని సంప్రదించాలో తెలియక రైతన్న ఒకవైపు పైరును, మరొకవైపు ఎరువుల దుకాణాల వైపు దిగాలుపడి చూస్తున్న వైనం. దీనిని ప్రభుత్వం గుర్తించి రైతులకు సౌలభ్యకరంగా తగు ఏర్పాట్లు చేయాలని, మంచి నైపుణ్యం కలిగిన వ్యక్తులను తీసుకుని రైతులకు గ్రామాల వారిగా అవగాహన కల్పించి అందరు రైతులకు యూరియాను అందించాలని మండలంలోని అన్ని గ్రామాల రైతులు, ప్రజలు కోరుతున్నారు.

# 12నా దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలని కార్మిక సంఘాల పిలుపు

**గుండాల, ఫిబ్రవరి 10 (వెలుతురు):**
ఈ నెల 12న జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గ్రామపంచాయతీ కార్మికుల మండల అధ్యక్షుడు ఇటుకల పరుశరాములు పిలుపునిచ్చారు. మంగళవారం గుండాల మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులతో సమావేశం నిర్వహించి మండల అభివృద్ధి అధికారి చండీరాణి, ఎంపీవో సలీంలకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఇటుకల పరుశరాములు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.25600 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కార్మికులపై ఉన్న పని భారం తగ్గించాలని కోరారు. చట్టబద్ధమైన సౌకర్యాలను కల్పించడంతో పాటు బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని, వేతనాల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు.
అలాగే గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని, పంచాయతీ సిబ్బందిని రెండో పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలని, జీఓ 51 విధానాన్ని సవరించాలని కోరారు. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి పాత కేటగిరీలను కొనసాగించాలని, కారోబార్ బిల్ కలెక్టర్లను సహాయక కార్యదర్శులుగా నియమించాలని, అర్హులైన సిబ్బందికి ప్రమోషన్లు కల్పించాలని తెలిపారు.
పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ సౌకర్యాలు, రూ.10లక్షల ప్రమాద బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. పంచాయతీ సిబ్బందిని శాశ్వతం చేయడంతో పాటు వేతనాలు పెంచాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ అవసరాలకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, కార్మికులందరికీ ఇందిరమ్మ ఇళ్లు లేదా ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అనారోగ్యంతో మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.మరణించిన కార్మికుల దహన సంస్కారాల కోసం ప్రస్తుతం ఇస్తున్న రూ.10,000ను రూ.30,000కు పెంచాలని, తెలంగాణ ప్రభుత్వం గుర్తింపు కార్డులు జారీ చేయాలని అన్నారు.కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 12న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో





కార్మిక సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సూదగాని రామచంద్రయ్య గౌడ్, ఎల్లయ్య, అన్నెపర్తి గిరి, యాదమ్మ, ఇందిర, వెంకటేశం, రాజు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త జరిగే ఒక్క రోజు సార్వత్రిక సమ్మెలో పాల్గొనుటకు గాను సమ్మె నోటీస్ - సీపీఎం

**తిరుమలగిరి (సాగర్) వెలుతురు న్యూస్, ఫిబ్రవరి 10:**
కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ ని రద్దు చేయాలని ఫిబ్రవరి 12న ఒకరోజు జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనుటకు మండలంలోని ఎమ్మార్వో, ఎంపీడీవో, గ్రామ పంచాయతీలకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం పార్టీ తిరుమలగిరి సాగర్ మండల కార్యదర్శి జతవత్ రవి నాయక్ మాట్లాడుతూ నాలుగు లేబర్ కోర్ట్ ను వెంటనే రద్దు చేయాలి.అసంఘటిత రంగ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు మరియు స్కీమ్ కార్మికులతో సహా కార్మికులందరికీ జాతీయ స్థాయిలో కనీస వేతనం నెలకు రూ.26000/-గా నిర్ణయించాలి ఔటిర్స్ ఫిక్స్ టర్మ్ ఎంప్లాయ్మెంట్, అప్రెంటిస్లు, ట్రైనీలు వంటి రూపాలలో వివిధ పథకాల క్రింద పనిచేస్తున్న కార్మికులను ఎవరినీ శాశ్వత స్వభావం కల్గిన పనుల్లో నియమించరాదు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి. నెలకు కనీస పెన్షన్ రూ.9000/- ఇవ్వాలి. అసంఘటిత కార్మికులు మరియు వ్యవసాయ కార్మికులతో సహా అన్ని తరగతుల కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి గృహ ఆధారిత కార్మికులు, హార్లు, చెత్త




సేకరించేవారు, గృహ కార్మికులు, నిర్మాణ కార్మికులు, వలస కార్మికులు, స్కీమ్ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, దుకాణాలలో పనిచేసే కార్మికులు, లోడింగ్/అన్లోడ్ కార్మికులు, గిగ్ వర్కర్లు, సాల్ట్-పాన్ కార్మికులు, బీడి కార్మికులు, గీత కార్మికులు, లక్షా కార్మికులు, ఆటో/టాక్సీ డ్రైవర్లు, వలస కార్మికులు, మత్స్యకారులు మొదలైన అన్నివర్గాల కార్మికులను నమోదు చేయాలి పెన్షన్ తో సహా సమగ్ర సామాజిక భద్రత కల్పించాలని పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలి. ఎస్పిఎస్ మరియు యుపిఎస్ ను రద్దు చేయాలి కార్మిక చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్లను అమల్లోకి తెస్తూ 2025 నవంబర్ 21న ఇచ్చిన నోటిఫికేషన్ను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం-2025ను ఉపసంహరించుకోవాలని, పేదలకు పనికి గ్యారంటీ కల్పిస్తున్న వీ+చీ=జు+ూ చట్టాన్ని కొనసాగించాలని తదితర డిమాండ్ల పరిష్కారానికై జాతీయ కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు ఇచ్చిన పిలుపుపై 2026 ఫిబ్రవరి 12న జరగనున్న ఒక్కరోజు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు వేములకొండ పుల్లయ్య, సీపీఎం పార్టీ మండల ఉపాధ్యక్షులు నల్లబెల్లి జగదీష్, సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ చందపాషా, మండల కమిటీ సభ్యులు బుర్రి సైదయ్య మరియు గ్రామపంచాయతి వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు

# భారత వ్యవసాయ రంగాన్ని అమెరికాకు తాకట్టు పెడుతున్న బీజేపీ సర్కార్

**- మోడీ-ట్రాంపు చీకటి వాణిజ్య ఒప్పందం అనైతికం**

**- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి**

**- సిపిఎం ఆధ్వర్యంలో నిరసనగా మోడీ దిష్టి బొమ్మ దగ్ధం**

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 10:**
అమెరికతో చీకటి వాణిజ్య ఒప్పందం కుదుర్చుకొని భారత వ్యవసాయరంగాన్ని మోడీ ప్రభుత్వం ట్రాంపుకు తాకట్టు పెడుతుందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య అన్నారు. సిపిఎం మండల కమిటి ఆధ్వర్యంలో అమెరికతో భారత్ వాణిజ్య ఒప్పందాన్ని



నిరసిస్తూ స్థానిక సుభాష్ సెంటర్ లో మోడీ దిష్టి బొమ్మ దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యంతర ట్రేడ్ డీల్ మూలంగా ఉత్పత్తులపై డ్యూటీ తగ్గింపు, సోయాబీన్, మొక్కజొన్న రైతులకు గడ్డు కాలమే అన్నారు.500 బిలియన్ డాలర్ల వ్యాపారం పేరిట దేశ సార్వాభౌమాత్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టె ప్రయత్నం జరుగుతుందని తక్కువ ధరలకు చమురు ఇస్తున్నా కొనుగోళ్ళను ఆపివేయడం దుర్మార్గం అని అన్నారు. దేశంలోకి వచ్చే వస్తువులపై సుంకాలను తగ్గించి భారత కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల జీవితాన్ని ప్రశ్నర్ధకం చేస్తుందన్నారు. ఢిల్లీ రైతు పోరాటంలో మోడీ చేసిన హామీలను తుంగలో తొక్కి దేశ ప్రజలను మోసం చేస్తున్నారని. ఎరువుల మీద సబ్సిడీలు తగ్గించి ధరలు పెంచుతున్నారని దేశ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. స్వదేశీ జపం చేసే కేంద్ర బీజేపీ ప్రభుత్వం విదేశాలకు మోకరిళ్ళుతుందని తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం,జిల్లా కమిటి సభ్యుడు బల్గురి అంజయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యుడలు బోయిని ఆనంద్,కందుల హనుమతు,మండల నాయకులు గన్నేబోయిన విజయభాస్కర్, నీల అయిలయ్య, ఆవనగంటి నగేష్,గంటెపాక శివ కుమార్, మునికుంట్ల లెనిన్, శానగొండ రాము,బడుగు రమేష్,అంబటి సురేందర్ రెడ్డి,నకిరేకంటి సురేష్,గాదె కృష్ణ,తుర్కపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాడిగి గ్రామంలో 3వ ధమ్మయాత్రకు ఘన స్వాగతం

**- శాంతిసౌభ్రాతృత్వంమత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన మాడిగి గ్రామం....**

**- యాత్రికులకు ఘన స్వాగతం పలికిన మాడిగి గ్రామ సర్పంచ్ అర్షద్ జమా పటేల్ఆధ్వర్యంలో పలికారు....**

**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 10:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం మొగుడంపల్లి మండలం పరిధిలోని మాడిగి గ్రామంలో గుల్బర్గా (కలబుర్గి, కర్ణాటక) నుంచి నాగార్జున నగర్ (బుద్ధవనం, తెలంగాణ) వైపు సాగుతున్న 3వ ధమ్మయాత్రకు గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాడిగి గ్రామం శాంతి, సౌభ్రాతృత్వం, మత సామరస్యం ప్రతిబింబించే ఆదర్శ గ్రామంగా నిలిచింది. ప్రఖ్యాత సినీ నటుడు గగన్ మాలిక్ నాయకత్వంలో కొనసాగుతున్న ఈ ధమ్మయాత్రలో భారతదేశం మరియు థాయిలాండ్‌కు చెందిన బౌద్ధ భిక్షువులు పాల్గొంటూ ధర్మం, అహింస, మానవత్వం, శాంతి సందేశాలను ప్రజల్లో విస్తృతంగా వ్యాప్తి చేస్తున్నారు. ప్రజలను ఐక్యత, సహనం, పరస్పర గౌరవం వైపు నడిపించడమే ఈ ధమ్మయాత్ర ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.



ధమ్మయాత్ర మాడిగి గ్రామానికి చేరుకున్న సందర్భంగా గ్రామ సర్పంచ్ అర్షద్ జమా పటేల్ ఆధ్వర్యంలో యాత్రికులకు ఘన స్వాగతం పలికారు. యాత్రలో పాల్గొన్న బౌద్ధ భిక్షువులపై పుష్పవర్షం కురిపించి, గగన్ మాలిక్‌తో పాటు భిక్షువులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్రకు తమ మద్దతు ప్రకటించారు. సర్పంచ్ అర్షద్ జమా పటేల్ ప్రత్యేక చొరవతో ధమ్మయాత్రలో పాల్గొన్న యాత్రికుల కోసం రాత్రి బస ఏర్పాట్లు చేయడంతో పాటు, గ్రామస్తులు మరియు బయటి నుంచి వచ్చిన వారందరికీ విందు (డిన్నర్) ఏర్పాటు చేశారు. మాడిగి గ్రామ ప్రజలు చూపిన అతిథి సత్కారం యాత్రికులను ఎంతగానో ఆకట్టుకోగా, గ్రామంలో ఆత్మీయ వాతావరణం నెలకొంది. ఇక మాడిగి ఎక్స్ రోడ్ వద్ద ఉన్న హజ్రత్ అలీ మసీదులో కూడా ధమ్మయాత్రకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శాంతి, సౌహార్దం, మత సామరస్యం అంశాలపై ప్రసంగాలు నిర్వహించారు. వివిధ మతాలకు చెందిన ప్రజలు ఒకే వేదికపై పాల్గొని ఐక్యత సందేశం ఇవ్వడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఇలాంటి ధమ్మయాత్రలు సమాజంలో శాంతి, సహనం, సమానత్వం, మానవ విలువలను బలోపేతం చేస్తాయని తెలిపారు. మాడిగి గ్రామంలో 3వ ధమ్మయాత్రకు ఇచ్చిన ఈ ఘన స్వాగతం సంగారెడ్డి జిల్లా మాత్రమే కాకుండా, తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ బి. రంగారెడ్డి, బి. కాశీనాథ్ రెడ్డి, కె.కె. రాజా సాహెబ్, అతీక్ అహ్మద్, ఫరీద్ షా, జావేద్ అలీ, వలి పాషా, రిటైర్డ్ సీఆర్‌పీఎఫ్ జవాన్ దేవేందర్, మాజీ సర్పంచ్ బి. ఆకాశ్‌తో పాటు బౌద్ధ, ముస్లిం, హిందూ మరియు ఇతర మతాలకు చెందిన పలువురు ప్రముఖులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

**- జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి(వెలుతురు) 10**
2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రేపు బుధవారం 11వ తేదీ జరగనున్న పోలింగ్ రోజున అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. ఎన్నికల కోసం నోటిఫై చేయబడిన



ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, దుకాణాలు, కర్మాగారాలలో పనిచేసే ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు , స్థానిక సంస్థలకు స్థానిక సెలవు ప్రకటించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగస్వాములుగా ప్రతి ఓటరు బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.




## జహీరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం

### - ఎన్నికల అధికారి దశరథ్



**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 10:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారి దశరథ్ తెలిపారు. జహీరాబాద్ మున్సిపాలిటీకి ఈ నెల 11వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 78,819 మంది ఓటర్లు ఉన్నారని, 37 మున్సిపల్ వార్డులకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో మొత్తం 174 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారని వివరించారు. ఎన్నికల నిర్వహణ కోసం జహీరాబాద్ పట్టణంలో 121 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రానికి అవసరమైన అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు, పోలింగ్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. అలాగే ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్యను బట్టి అవసరమైన బ్యాలట్ బాక్సులు, బ్యాలట్ పత్రాలను ఎన్నికల సిబ్బందికి అందజేసినట్లు వెల్లడించారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ నుంచి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ భద్రతా ఏర్పాట్లలో భాగంగా 1 అడిషనల్ ఎస్పీ, 1 డీఎస్పీ, 6 సీఐలు, 20 ఎస్ఐలు, 150 మంది పోలీస్ కానిస్టేబుళ్లను విధుల్లో నియమించినట్లు పేర్కొన్నారు. ప్రజలు భయభ్రాంతులకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల అధికారి దశరథ్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.ద

## గర్భస్థ పిండ నిర్ధారణ నిరోధక చట్టం అమలుపై సమావేశం...

### - పాల్గొన్న జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి




**రంగారెడ్డి జిల్లా వెలుతురు ఫిబ్రవరి 10:** గర్భస్థ పిండ నిర్ధారణ నిరోధక చట్టం అమలు పై మంగళవారం రోజున జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని అల్ట్రా సౌండ్ /స్కాన్ కేంద్రాల పనితీరు చట్టపరమైన నిబంధనల అమలు తీరుపై, జిల్లాలో కొత్తగా 15 అల్ట్రా సౌండ్ స్కాన్ కేంద్రాలు దరఖాస్తులను పరిశీలించారు. అలాగే ఇప్పటికి పనిచేస్తున్న 19స్కాన్ కేంద్రాలకు సంబంధించిన రెన్యూవల్ దరఖాస్తులు కమిటీ ముందు ప్రతిపాదించడం జరిగింది. అన్ని దరఖాస్తులు పి సి పి ఎన్ డి టి చట్టంలోని నిబంధనల ప్రకారం పరిశీలించబడి అనుమతికి జిల్లా స్థాయి కాంపిటెంట్ అథారిటీ కి నిర్ణయం తీసుకోవాల్సిందిగా ప్రతిపాదనలు పంపించబడ్డాయి పి సి పి ఎన్ డి టి చట్టాన్ని కఠినంగా అమలు చేస్తూ లింగ నిర్ధారణ వంటి అక్రమ చర్యలను పూర్తిగా నివారించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని సమావేశంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి తెలిపారు ఈ సమావేశంలో డి సి ఎచ్ ఎస్ డాక్టర్ అనురాగిని జిల్లా అధికారులు డాక్టర్ షీబా హయత్ డాక్టర్ రాధిక డాక్టర్ పూనం డాక్టర్ వినోద్ ఎన్ జి ఓ నుంచి డాక్టర్ కొమరయ్య,డిప్యూటీ డి ఎమ్ హెచ్ ఓ లు మరియు డెమో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

## సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

### - ప్రజా సమస్యల పరిష్కారంలో పాత్రికేయులే అందరికి అదర్శం
### - జర్నలిస్ట్ కమిటిని అభినందించిన ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం. పరమేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్, వెలుతురు ప్రతినిధి ఫిబ్రవరి 10:**



వేగంగా మారుతున్న 22వ శతాబ్దంలో.. కాలానికి అనుగుణంగా ప్రజా సమస్యల పరిష్కారంలో అగ్రబాగన నిలిచే జర్నలిస్టుల పాత్ర అద్వితీయమని, కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి కొనియాడారు. జర్నలిస్టుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఇటీవల ఎన్నికైన ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ప్రతినిధులు ఎంపీఆర్‌ను సోమవారంనాడు మర్యాదపూర్వకంగా తనను కలిసిన కమిటి సభ్యులను పేరు పేరునా పలుకరిస్తూ వారిని అభినందించారు. కలిశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... దశాబ్దాలుగా ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిలో పాత్రికేయుల పాత్ర, వారి క-షి మరువలేనిదని, వేల కట్టలేనిదని ఆయన పేర్కొన్నారు. నేటి తరం జర్నలిస్టులకు మీ సీనియర్ జర్నలిస్టులంతా అదర్శంగా, అండగా నిలువాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. సమాజంలో జరిగే మంచి చేడులపై అవగాహన కల్పించాలని, సామాజిక కార్యక్రమాలు ద్వారా ప్రజలకు మరింత చేరువవ్వాలని ఆయన సూచించారు. నిత్యం సమాజాభివ-ద్ధి కోసం పాటుపడే పాత్రికేయులకు ఎల్లప్పుడూ తానూ చేదోడువాదోడుగా 24 గంటలు అందుబాటులో ఉంటానని ఆయన అన్నారు. నూతనంగా ఎన్నికైన ఉప్పల్ ప్రెస్ క్లబ్ కమిటీకి ఎల్లప్పుడు తన వంతు సహాయక సహకారాలు ఉంటాయని పరమేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ప్రెస్ క్లబ్ అద్యక్షులు వేముల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యారంపల్లి శివాజీ, ప్రెస్ క్లబ్ ముఖ్య సలహదారులు, సీనియర్ జర్నలిస్టులు కోడికంటి శ్రీనివాస్, దొంతుల వెంకటరామిరెడ్డి, కొలనుపాక చంద్రమౌళి, కోడికంటి శ్రీనివాస్, పల్లా మహేందర్ రెడ్డి, ఎస్. ముత్యంరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పారేల్లి సాగర్. ఉపాధ్యక్షులు ఏవి శ్రీధర్ రావు, కూకుట్ల నరోత్తం రెడ్డి, కోశాధికారి గుత్తి శేఖర్, జాయింట్ సెక్రటరీ దాస రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ పారేల్లి సాగర్, ఉపాధ్యక్షులు ఏవి శ్రీధర్ రావు, కూకుట్ల నరోత్తం రెడ్డి, కోశాధికారి గుత్తి శేఖర్, జాయింట్ సెక్రటరీ దాస రాజు, ఓ.రమేష్, రాజులను పరమేశ్వర్ రెడ్డి అభినందించారు.

# హిమాయత్ నగర్ డివిజన్‌ను అన్ని విధాల అభివృద్ధి చేయడానికి కృషి చేశాం..

### - సహకరించిన డివిజన్ ప్రజలకు ధన్యవాదాలు..
### - కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్

హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 10: హిమాయత్ నగర్ డివిజన్ ప్రజలకు మా శ్రేయోభిలాషులకు మా కార్యకర్తలకు మా నాయకులకు బస్తీ కమిటీ అధ్యక్షులకు బస్తి కమిటీ వారికి అపార్ట్మెంటు కమిటీ వారికి కాలనీవాసులకు అన్ని వర్గాల ప్రజలకు పేరుపేరునా మా హృదయపూర్వక ధన్యవాదాలు తెలయజేస్తున్నట్టు కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ తెలిపారు.. ఈ మేరకు మంగళవారం రోజున పత్రిక ప్రకటన విడుదల చేశారు. గడచిన ఐదు సంవత్సరాలుగా మాతో ఉంటూ అభివృద్ధిలో భాగస్వాములుగా సహకరిస్తూ ఉన్నటువంటి అందరికీ మా నమస్సుమాంజలి. ఇప్పటికే హిమాయత్ నగర్ డివిజన్లో అన్ని రంగాలలో అభివృద్ధి పరచడంలో ముందున్నాం అందులో భాగంగా రేపు ఒకటేసారి ఎట్ట టైం ప్రారంభోత్సవాలు ఉన్నాయి ఈ కోట్లాది రూపాయలు తో అభివృద్ధి సాధించడానికి మాకు సహకరించిన మా ఎమ్మెల్యే దానం నాగేందర్ గారు మేయర్ గద్వాల విజయలక్ష్మి గారు మంత్రి పొన్నం ప్రభాకర్ గారు మున్సిపల్ కమిషనర్ అదేవిధంగా జోనల్ కమిషనర్ డిప్యూటీ కమిషనర్ మా హృదయపూర్వక ధన్యవాదాలు . అందులో ఈ అభివృద్ధిని కొనసాగించే విధంగా ఇంకా నిన్నటి రోజు స్టాండింగ్ కమిటీ సమావేశంలో మా మేయర్ గారు కమిషనర్ గారు మా డివిజన్లో ఇంకా అనేక సమస్యలు ఉన్నాయని చెప్తే వెంటనే నాలుగు కోట్ల రూపాయల నిధులను విడుదల చేయడం జరిగింది వారికి ధన్యవాదాలు . ఈ అభివృద్ధిని కొనసాగించడానికి సహకరిస్తున్న ప్రతి అధికారికి అదే విధంగా మాతోపాటు ఉన్నటువంటి ప్రతి కార్యకర్తకు నాయకులకు ఈ ఐదు సంవత్సరాలు అనేక రోజులు గంటలు సమయం మాకు కేటాయించి ప్రజల్లో తిరిగినటువంటి ప్రతి ఒక్కరికి మా నమస్సుమాంజలి ఈ అభివృద్ధిని కొనసాగించే విధంగా ముందు ముందు హిమాయత్ నగర్ డివిజన్ ను సర్వాంగ



సుందరంగా సమస్యలు లేనటువంటి డివిజన్ గా తీర్చిదిద్దడమే మా లక్ష్యం ఇంకా ముందు ముందు చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు మెల్కోటే పార్కు దగ్గరలో ఉన్నటువంటి 300 గజాల స్థలంలో ఒక సామాజిక భవన్ నిర్మాణం అంతేకాకుండా చంద్రన్నగర్ బస్తీ లో ఓ కమ్యూనిటీ హాల్ కి ఇప్పటికే నిధులు మంజూరై ఉన్నాయి అంతేకాదు ఓల్డ్ కమేల ఏరియాలో మరియు ఈ రకంగా ఇంకా కొన్ని ఏరియాల్లో పనులు చేపట్టాల్సింది ఉంది, కచ్చితంగా వాటిని కూడా పూర్తి చేస్తామని హామీ ఇస్తున్నాము, దత్తాత్నగర్ కమ్యూనిటీ హాలు ఇంకా కొన్ని బస్తీలలో కొన్ని మిగిలిన పనులన్నీ కూడా ప్రభుత్వంలో ఉన్నం కాబట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి మరియు మంత్రులు మరియు ఎమ్మెల్యే గార్లతో చర్చించి మిగతా పనులన్నీ కూడా పూర్తయ్యే విధంగా ముందు చర్యలు చేపడతాం, జిహెచ్ఎంసి కమిషనర్ గారు మరియు మినిస్టర్ పొన్నం ప్రభాకర్ గారి నిధులనుంది వచ్చిన రెండు కోట్ల 56 లక్షల మూడు వేల రూపాయలతో స్వీట్ నెంబర్ రెండు లో 26 లక్షలతో, స్ట్రీట్ నెంబర్ 15 దత్తానగర్లో సీసీ రోడ్18 లక్షలు మరియు ఇంకొక బిట్ 16 లక్షలతో జనార్ధన బాడ లో సీసీ ప్యాచ్ వర్క్ మరియు స్ట్రామ్ వాటర్ లైన్ కోసం సుమారు తొమ్మిది లక్షలు, బి జె ఆర్ లైన్ లో కాలేజ్ ముందు రోడ్డు బాగోకపోయేసరికి 8.30 లక్షలతో కొత్త సిసి రోడ్ ప్రతిపాదించడం జరిగింది, విటల్వాడి వార్డ్ ఆఫీస్ నుండి శివాలయం రోడ్డు 45 లక్షలతో, మరియు షంషీర్బాగ్ లో డ్రైనేజ్ మరియు స్ట్రామ్ వాటర్ తో సహ రోడ్డు వర్కు,48 లక్షలతో, హరి నగర్, అవంతి నగర్, హైదర్గూడా లో 30 లక్షలు తో నూతన సిసి రోడ్ వర్క్ , చంద్రానగర్ కమిటీ హాల్ మెయింటెనెన్స్ పనులకు ఆరు లక్షలు మరియు స్ట్రామ్ వాటర్ డ్రైనేజ్ క్యాచ్ పిట్స్ ఆన్ రోడ్ వర్క 49 లక్షలు, మొత్తం రెండు కోట్ల 56 లక్షలు నిధులతో హిమాయత్ నగర్ నందు కొత్త పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుంది, స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్గా ఉండి డివిజన్ డెవలప్మెంట్ కి ఇంకొంచెం నిధులు కేటాయించాల్సిందిగా మేయర్ గారిని కమిషనర్ గారిని చివరి స్టాండింగ్ కౌన్సిల్ మీటింగ్లో లో అభ్యర్థించగా మేయర్ గద్వాల విజయలక్ష్మి గారు మరియు కమిషనర్ గారు నాలుగు కోట్ల 15 లక్షలు రూపాయలు మంజూరు చేశారు, ఈ నిధులతో బాలాజీ బజరంగ్ స్వీట్ షాప్ లైన్ లో 20 లక్షలతో, అవంతి నగర్లో సుమారు కోటి 12 లక్షలతో సిసి రోడ్ల పండ్లు, 8 లక్షలతో పార్కు చుట్టూ ఫుట్పాత్ వరకు, వాసవి లైన్ స్ట్రీట్ నెంబర్ 16 లో 49 లక్షలతో సిసి రోడ్, స్ట్రీట్ నెంబర్ 11 ఆక్స్ఫర్డ్ స్కూల్ లైన్ లో 49 లక్షలు, స్ట్రీట్ నెంబర్ 5 సిసి రోడ్ మరియు ఫుట్పాత్ వర్క్ కోసం 28 లక్షలు, దత్తానగర్ లో కొత్త కమిటీ హాల్ నిర్మాణానికి 40 లక్షల, నారాయణగూడ లోని స్ట్రీట్ నెంబర్ 5 లో కమిటీ హాల్ 28 లక్షల రూపాయలు, చంద్ర నగర్ బస్తీ లో 72 లక్షలతో కొత్త సామాజిక భవనానికి మంజూరు చేయించుకోవడం జరిగింది, ఈ విధంగా హిమాయత్ నగర్ డివిజన్లో అన్ని ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని కొన్ని ప్రాంతాలలో వాటర్ వర్క్స్ డ్రైనేజీ కోసం 40 లక్షల జిహెచ్ఎంసి నిధులనుండి కేటాయించిన అభివృద్ధి పనులు త్వరలో మొదలు పెట్టవలసినవి ఉన్నవి అని మహాలక్ష్మి రామన్ గౌడ్ హిమాయత్ నగర్ కార్పొరేటర్ అన్నారు.

## డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య

**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 10:** జిల్లాలో ఈనెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను, స్టాంగ్ రూమ్ లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య సందర్శించారు.మంగళవారం కలెక్టర్ కోహిర్, సదాశివపేట లలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరును క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో పోలింగ్ సిబ్బందికి తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామి యానాలు,ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేసారు. పీ.ఓ, ఓ.పీ.ఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యారా లేదా అని కలెక్టర్ ఆరా తీయడంతో పాటు హాజరు నివేదికను పరిశీలించారు. ఎన్నికల పోలింగ్ సామాగ్రిని, బ్యాలెట్ బాక్స్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా



సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పోలింగ్ అధికారులు పరిశీలించు కోవాలని పోలింగ్ బృందాలకు కలెక్టర్ సూచించారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ



జరపాలని అధికారులకు ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆర్ఓలకు సూచించారు. అనంతరం ఆయా మున్సిపాలిటీలకు సంబంధించిన స్ట్రాంగ్ రూములను పరిశీలించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట రెవిన్యూ డివిజనల్ అధికారి దేవుజా, మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్, తదితరులు ఉన్నారు.

## కరీంనగర్లో తిరుగులేని శక్తిగా బిజెపి...!

# జనం గుండెల్లో బిజెపి!!

- కరీంనగర్ బల్దియా పై కాషాయ జెండా ఎగరడం ఖాయం....
- గత కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు వచ్చింది "0"... ఇప్పుడు 40 గెలుస్తామని చెప్పడం పెద్ద "జోక్"
- ఎంఐఎం తో కాంగ్రెస్ లోపాయి కారి ఒప్పందం... మైనార్టీ ఓట్లతో ఎన్నికల్లో గట్టెక్కలనే ప్రయత్నం..
- బిఆర్ఎస్ కు ఓటు వేయడం దండగ... ఆ పార్టీ ఓ అవుట్ డేటెడ్ పార్టీ...
- కాంగ్రెస్, ఎంఐఎం , బిఆర్ఎస్ ల కు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి..
- బిజెపి మోది ప్రభుత్వం, కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ లతోనే కరీంనగర్ అభివృద్ధి సాధ్యం....
- కరీంనగర్ భవిష్యత్తు, అభివృద్ధి కోసం బిజెపి అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించండి...
- బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర

**కరీంనగర్ వెలుతురు ఫిబ్రవరి 10:** భారతీయ జనతా పార్టీ జనం గుండెల్లో ఉందని, వరుసగా రెండుసార్లు జరిగిన కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీ కి బ్రహ్మరథం పట్టి, బండి సంజయ్ కుమార్ ను భారీ మెజారిటీతో గెలిపించారని, ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా బిజెపి అభ్యర్థులు మల్కా కొమరయ్య, అంజి రెడ్డిలను ఆశీర్వదించి గెలిపించారని, బిజెపి జనం గుండెల్లో ఉందనడానికి పార్లమెంటు, ఎమ్మెల్సీ ఫలితాలే నిదర్శనమని., నేడు జరగబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా పట్టణ ప్రజలంతా బిజెపి వైపు ఉన్నారని, కార్పొరేషన్ ఫలితాల అనంతరం కరీంనగర్లో బిజెపి తిరుగులేని శక్తిగా అవతరించనుందని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర తెలిపారు. మంగళవారం రోజున కరీంనగర్ లో ఆయన మాట్లాడుతూ 11న జరిగే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి విజయ కేతనం ఎగురవేస్తుందని, కరీంనగర్ మేయర్ స్థానాన్ని కైవసం చేసుకుని, బల్దియా పై కాషాయ జెండా ఎగరవేసి



తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రెండేళ్లయిన నగరపాలక సంస్థ అభివృద్ధి గురించి పట్టించుకోని , కార్పొరేషన్ కు ఓక్క పైసా ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వ పాలన తీరుపై పట్టణ ప్రజలంతా ఆగ్రహంతో ఉన్నారన్నారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచింది గుండు సున్న... నేడు ఈ ఎన్నికల్లో 40 సీట్లు గెలుస్తామని కాంగ్రెస్ నేతలు ప్రకటనలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, గడిచిన రెండేళ్లలో ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేదనే భావన ప్రజల్లో ఏర్పడిందన్నారు. అందుకే మున్సిపల్ కార్పొరేషన్ లో గట్టెక్కడానికి చీకటి స్నేహితులు ఎంఐఎం తో లోపాయి కారి ఒప్పందం చేసుకొని , మైనార్టీ ఓట్లతో గట్టెక్కడానికి తీవ్రంగా ప్రయత్నం చేస్తుందని ఆయన ఆరోపించారు. ఎంఐఎం, కాంగ్రెస్ కలిసి కరీంనగర్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవాలనే ఆశతో అనేక రాజకీయ డ్రామాలు చేస్తుందన్నారు. అలాగే బి ఆర్ ఎస్ పార్టీకి ఎన్నికల్లో ఓటు వేయడం దండగని, ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే కరీంనగర్ అభివృద్ధి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. నేడు అధికారంలో లేని బి ఆర్ ఎస్ కు ఓటు వేసి ప్రజలు నష్టపోవద్దని, డివిజన్ అభివృద్ధిని ప్రమాదంలోకి నేట్టవద్దన్నారు. గతంలో కాంగ్రెస్ , బి ఆర్ ఎస్ లకు నగరపాలక సంస్థ అధికారాల ను అప్పగించిన కరీంనగర్కు ఒరగా బెట్టిందేమీ లేదన్నారు. అందుకే నేడు జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ , ఎంఐఎం, బిఆర్ఎస్ లకు తగిన బుద్ధి , గుణపాఠం చెప్పాలన్నారు. కరీంనగర్ అభివృద్ధి కేవలం బిజెపితోనే సాధ్యమన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కరీంనగర్ పట్టణానికి స్మార్ట్ సిటీ హోదా ఇచ్చి , వేలకోట్ల నిధులను అందించిందన్నారు. స్మార్ట్ సిటీ నిధులతోనే కరీంనగర్ పట్టణ రూపురేఖలు మారాయన్నారు. కరీంనగర్ అభివృద్ధి కోసం మోడీ ప్రభుత్వం, కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ కట్టుబడి ఉన్నారన్నారు. కరీంనగర్ భవిష్యత్తు , అభివృద్ధి కోసం బిజెపి అభ్యర్థులను గెలిపించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

## ఎన్నికలకు ఒకరోజు ముందు అనూహ్య ఘటన

**- మక్తల్ ఆరోవార్డు బిజెపి అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్య**

**- ఘటనకు కాంగ్రెస్ కారణమని మండిపడ్డ బిజెపి...**

**- పార్లమెంటులో ప్రస్తావించిన కిషన్ రెడ్డి, లక్ష్మణ్**

**- డిజిపి ఆఫీస్ ముట్టడికి బిజెపి శ్రేణుల యత్నంతో ఉద్రిక్తత**



**హైదరాబాద్,ఫిబ్రవరి10( వెలుతురు):**

ఎన్నికల ప్రచారం ప్రశాంతంగా ముగిసి..ఎన్నికలకు ఒకరోజు ముందు అనూహ్య ఘటన చోటుచేసుకుంది. నారాయణపేట జిల్లా మక్తల్ ఆరోవార్డు నుంచి పోటీ చేస్తున్న ఎరుకలి మహాదేవప్ ఆత్మహత్య సంచలనం కలిగించింది. ఇందుకు నిరసనగా బిజెపి భగ్గుమంది. ప్రత్యర్థుల వేధింపుల వల్లనే మహదేవప్ప ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆరోపించింది. సిఎం రేవంత్ రెడ్డి ప్రోద్భలంతో కాంగ్రెస్ కిడ్నాప్‌లకు, బెదరింపులకు పాల్పడిందని ఆరోపిస్తూ...నిరసనగా హైదరాబాద్ డీజీపీ కార్యాలయ ముట్టడికి బీజేపీ పిలుపునిచ్చింది. దీంతో లక్డీకపూల్ లోని డీజీపీ కార్యాలయం ముందు భారీగా పోలీసులు భారీగా మోహరించారు. ఇకపోతే లోక్‌సభలో కిషన్ రెడ్డి, రాజ్యసభలో డాక్టర్ లక్ష్మణ్ ఈ అంశాన్ని లేవనెత్తారు. సిఎం రేవంత్ రెడ్డి బెదరింపులకు పాల్పడుతున్నారని, ప్రత్యర్థులు భయంతో వణికేలా చేస్తున్నారని రాజ్యసభలో లక్ష్మణ్ ఆరోపించారు. రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని లోక్‌సభలో కిషన్ రెడ్డి ఆరోపించారు. ఇక హైదరాబాద్‌లో డిజిపి ఆఫీస్ ముందు బిజెపి ఆందోళనకు దిగింది. మహదేవప్ప మృతితో బిజెపి శ్రేణులు భారీగా తరలివచ్చి డీజీపీ ఆఫీసు దగ్గర ఉద్రిక్తత నెలకొంది. బీజేపీ డీజీపీ ఆఫీసు ముట్టడికి యత్నించింది. దీంతో లక్డీకపూల్ లోని డీజీపీ ఆఫీసు దగ్గరకు బీజేపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. డీజీపీ కార్యాలయంలోకి చొచ్చుకుని వెళ్లేందుకు యత్నించారు. బారికేడ్లు దూకేందుకు యత్నించారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. పలువురు బీజేపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని వాహనాల్లో తరలించారు. పలవురిని అరెస్ట్ చేశారు. ఃరాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు ఫిబ్రవరి 11న జరగనుండగా.. మక్తల్ మున్సిపాలిటీలో 6 వార్డ్ బీజేపీ అభ్యర్థి ఎరుకలి మహాదేవప్ప ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.. మహాదేవప్ప మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రత్యర్థుల వేధింపులతోనే మహాదేవప్ప ఆత్మహత్య చేసుకున్నాడని అతడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఎన్నికలకు ఒక్క రోజు ముందే అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసుపై దర్యాప్తు జరుగుతోందని డీజీపీ శివధర్ రెడ్డి చెప్పారు.

## కొండాపూర్‌లో జంగమోని కుంటకు మోక్షం

**- మట్టి నింపి ఆక్రమించిన భూమి స్వాధీనం**

**- హైడ్రా చర్యలతో స్థానికుల హర్షం**

**హైదరాబాద్,ఫిబ్రవరి10( వెలుతురు):**

హైదరాబాద్ కొండాపూర్ ప్రాంతంలో ఉన్న జంగంకుంట ఆక్రమణలపై హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. సుమారు రూ.700 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడుతూ.. అక్రమ కబ్జాదారులపై కఠిన చర్యలు చేపట్టింది. శేరిలింగం పల్లి మున్సిపల్ కార్యాలయం–మదీనగూడ మార్గంలో జంగమోనికుంటకు సంబంధించిన 4 ఎకరాల భూమిని కబ్జాదారులు ఆక్రమించారు. సర్వే నెంబర్ 134 పరిధిలో ఉన్న జంగమోనికుంటను పూర్తిగా మాయం చేస్తూ.. ఆక్రమణదారులు మట్టితో నింపి చదును చేసినట్లు అధికారులు గుర్తించారు. జంగమోనికుంట చెరువును నాశనం చేసి భూమిని ప్లాట్లుగా విభజించి అమ్మకానికి సిద్ధం చేసినట్లు హైడ్రా గుర్తించింది. ఈ అక్రమాలపై ఇప్పటికే రెవెన్యూ అధికారులు కబ్జాదారులపై కేసులు నమోదు చేశారు. హైడ్రా బృందం రెవెన్యూ అధికారులతో కలిసి జంగమోనికుంట వద్ద జాయింట్ ఇన్స్పెక్షన్ నిర్వహించి, భూమి స్థితిగతులను పూర్తిగా పరిశీలించింది. అక్రమ కబ్జాలను పూర్తిగా అరికట్టేందుకు పోలీసుల సహకారంతో చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసే పనులను హైడ్రా సిబ్బంది ప్రారంభించింది. భవిష్యత్తులో మళ్లీ ఎలాంటి ఆక్రమణలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు, జల వనరులను రక్షించడమే లక్ష్యంగా హైడ్రాపై ప్రజల నుంచి ప్రశంసలు అందుతున్నాయి.

## గోషామహల్‌లో భారీగా నగదు పట్టివేత

**- అనుమానాస్పదంగాఉ ఉన్న ముగ్గురి అరెస్ట్**

**హైదరాబాద్,ఫిబ్రవరి10( వెలుతురు):**

గోషామహల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు భారీ మొత్తంలో నగదు పట్టుకున్నారు. సోమవారం సాయంత్రం గోషామహల్ గ్యాన్‌బాగ్ కాలనీలోని గోకుల్ గోల్డ్ ఎలక్ట్రిక్ ఐటమ్స్ షాప్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలపై అనుమానాస్పదంగా సంచులతో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా వీరిని ఆపి పరిశీలించగా.. సంచుల్లో భారీగా డబ్బు ఉన్నట్లు బయటపడింది.తనిఖీలో మూడు సంచుల్లో భారీ మొత్తంలో నగదు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మొత్తం నగదు విలువ రూ.76,87,650గా నిర్ధారణైంది. నగదు తరలింపు తీరు అనుమానాస్పదంగా ఉండటంతో పోలీసులు వెంటనే చర్యలు చేపట్టారు. అనుమానితులను జ్యోతిరామ్, గణపతి రామ్, మహేందర్‌లుగా పోలీసులు గుర్తించారు. ముగ్గురినీ గోషామహల్ పోలీస్‌స్టేషన్ కు తరలించి నగదుపై విచారణ చేపట్టారు. విచారణ సమయంలో అనుమానితులు పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో పాటు నగదుకు సంబంధించిన ఎలాంటి ధ్రువీకరణ పత్రాలను సమర్పించలేక పోయారు. దీంతో నగదును పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటనపై గోషామహల్ ఇన్‌స్పెక్టర్ స్పందిస్తూ.. స్వాధీనం చేసుకున్న నగదును ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు. అక్రమ నగదు తరలింపులపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

## మహదేవప్ప ఆత్మహత్యపై విచారణ చేయాలి

**- మాఫియా రాజకీయాలతోనే ఆత్మహత్య**

**- కుటుంబ సభ్యులకు బిజెపి నేతల పరామర్శ**

**మక్తల్,ఫిబ్రవరి10( వెలుతురు):**

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల వేళ నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ 6వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి, గిరిజన బిడ్డ ఎరుకల మహదేవప్ప ఆత్మహత్య చేసుకొవడం తీవ్ర కలకలంగా మారింది. మాఫియా రాజకీయాలు, అహంకార ధోరణి తట్టుకోలేకే మహాదేవప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఆత్మహత్యపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు స్పందించారు. మహదేవప్ప ఆత్మహత్య చేసుకోవడం తనను తీవ్రంగా కలచి వేసిందన్నారు. ఇది అత్యంత బాధాకరమైన ఘటన అని, మహదేవప్ప కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపి డికె అరుణతో కలసి వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ ఘటనపై దర్యాప్తు చేయించాలన్నారు. ఆత్మహత్యకు వేధింపులే కారణమని అన్నారు. ఇదిలావుంటే మహదేవప్పది ఆత్మహత్య కాదు కాంగ్రెస్ చేసిన హత్య అని ఎంపి డికె అరుణ మండిపడ్డారు. 'ఓటమి భయంతోనే బెదిరింపులు, అరాచకాలకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీని రాళ్లతో కొట్టే పరిస్థితి రాబోతోంది. మా సహనాన్ని పిరికితనంగా భావిస్తారా?. ఎన్నికల తరువాత కాంగ్రెస్‌పై యుద్ధం చేయబోతున్నాం. బీఆర్ఎస్ అరాచకాలకు ఎదురొడ్డి పోరాడిన చరిత్ర బీజేపీ కార్యకర్తలదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసే రోజులొచ్చాయి. మహదేవప్ప ఆత్మహత్యకు కారకులైన కాంగ్రెస్ నేతలను వెంటనే అరెస్ట్ చేయాలి. నిష్పాక్షికంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు.

# మున్సిపల్ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలి

**- కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**

**రంగారెడ్డి . వెలుతురు ఫిబ్రవరి 10:**

మున్సిపల్ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలని, చిన్న పొరపాట్లు జరగకుండా విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, ఎన్నికల సాధారణ పరిశీలకులు మయంక్ మిట్టల్ మరియు కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లను ఎన్నికల సాధారణ పరిశీలకులు మయంక్ మిట్టల్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డితో కలిసి ఇబ్రహీంపట్నం మున్సిపాలిటికి సంబంధించి శ్రీఇందు ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ అధికారులకు ఇచ్చిన ఎలక్షన్ మెటీరియల్ పంపిణీని పరిశీలించారు. ఈ సందర్బంగా సాధారణ పరిశీలకులు మయంక్ మిట్టల్ మాట్లాడుతూ పోలింగ్ విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ చెక్ లిస్ట్ ప్రకారం ఎన్నికల సామగ్రిని సరిచూసుకున్న తరువాతనే డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి బయలుదేరి వెళ్లాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరిస్తూ విధులు బాధ్యతగా నిర్వహించాలని అన్నారు. 7.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. గడువు లోపు పోలింగ్ కేంద్రం లోనికి చేరుకున్న ఓటర్లకు సాయంత్రం 5.00 గంటలు దాటిన తరువాత కూడా ఓటు వేసేందుకు అవకాశం కల్పించామన్నారు.ఈ సందర్బంగా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా





వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని సూచించారు. సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో సాఫీగా ఎన్నికలు జరిగేలా అంకితభావంతో కృషి చేయాలని ఎన్నికల సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. ఎక్కడ కూడా రీపోలింగ్ కు ఆస్కారం లేకుండా పక్కాగా పోలింగ్ ప్రక్రియను నిర్వహించాలని, ఓటింగ్ సందర్భంగా గోప్యతను కాపాడేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల సామాగ్రిని, బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బాక్సులను పరిశీలించారు. బ్యాలెట్ పత్రాలు జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను



మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు. చెక్ లిస్ట్ ప్రకారం పోలింగ్ మెటిరియల్ క్షుణ్ణంగా పరిశీలించి, అన్ని సరిగా ఉన్నాయని నిర్ధారణ చేసుకొని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి బయలుదేరాలని సూచించారు. ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని, పోలింగ్ సిబ్బంది నిర్వహించే వారి విధులను క్షుణ్ణంగా వివరించారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం కట్టుదిట్టమైన భద్రత నడుమ బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్ లకు తరలించాలని అన్నారు. శేరిగూడలో మండల్ పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను, స్ట్రాంగ్ రూమును పరిశీలించారు. మహేశ్వరం డిసిపి మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎలాంటి సంఘటనలు జరగకుండా భద్రత కల్పించడం జరుగుతుందని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి తరలిన ఎన్నికల సామగ్రి

**- పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి**

**- పోలింగ్ శాతం నివేదికలను సమయానుసారంగా అందించాలి**

**- 4 మున్సిపాలిటీలలో పోలింగ్ కు అన్ని ఏర్పాట్లు పూర్తి**

**- లిపోలింగ్ ఉదయం 7 00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు**





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ( వెలుతురు )10**

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యం లో జిల్లాలో నేడు బుధవారం 11వ తేదీ న జరగనున్న పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కేంద్రం లోని ఎస్పీ కార్యాలయం లోని ఏ ఏం సి గోడౌన్ లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించి, ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను దగ్గరుండి పరిశీలించారు. కామారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలలో నిర్వహిస్తున్న 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాట్లు సజావుగా సాగుతున్నాయని తెలిపారు.

పోలింగ్ ప్రక్రియ నిరంతరాయంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల అధికారులు ఎన్నికల సామగ్రిని సకాలంలో, సురక్షితంగా సంబంధిత పోలింగ్ కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది, భద్రతా సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలని సూచించారు.

ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అవసరమైన మౌలిక వసతులు అన్ని పోలింగ్ కేంద్రాల్లో కల్పించినట్లు తెలిపారు. జిల్లాలో స్వేచ్ఛాయుత, న్యాయమైన ఎన్నికలు నిర్వహించేందుకు యంత్రాంగం పూర్తిగా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. పోలింగ్‌కు సంబంధించి సిబ్బందితో పాటు ఎన్నికల సామగ్రిని బస్సుల ద్వారా పోలింగ్



కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. విధులు నిర్వహించే అధికారులు పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని, ఏవైనా సమస్యలు తలెత్తితే తక్షణమే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ సామగ్రిని చెక్‌లిస్ట్ ఆధారంగా పరిశీలించుకోవాలని, పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న అనంతరం అవసరమైన అన్ని వస్తువులు తమ వద్ద ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని ఆదేశించారు. రిజర్వ్ కౌంటర్, స్పెషల్ కౌంటర్లలో పోలింగ్‌కు సంబంధించిన బ్యాలెట్ పేపర్లు, ఫారాలు, కవర్లు తదితర సామగ్రిని సరిచూసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో రిపోర్టింగ్ అనంతరం జోనల్ అధికారులు రూట్ వారీగా పోలింగ్ సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు పంపించడంలో సహకరిస్తారని తెలిపారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని బుధవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని, పోలింగ్ ఉదయం 7.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు ఉంటుందని, పోలింగ్‌కు ముందు మాక్ పోలింగ్ నిర్వహించాలని సూచించారు. పోలింగ్ విధులు నిర్వహించే అధికారులు తమ కేంద్రాలకు తరలి వెళ్లే సమయం నుంచి కౌంటింగ్ పూర్తి చేసి రిసెప్షన్ కేంద్రానికి చేరుకునే వరకు అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

పోలింగ్ సిబ్బందికి అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన వసతులు, బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

**కామారెడ్డిలో 49 వార్డులు 152 పోలింగ్ కేంద్రాలు**

| | |
|---|---|
| పురుషులు | 48389 |
| స్రీలు. | 509 |
| ఇతరులు. | 17 |
| మొత్తం. | 99313 |

**ఎల్లారెడ్డి లో 12 వార్డులు, పోలింగ్ కేంద్రాలు 24,**

| | |
|---|---|
| పురుషులు. | 6321 |
| స్రీలు. | 6943 |
| ఇతరులు | 1 |
| మొత్తం. | 13265 |

**బాన్సువాడలో 19 వార్డులు, 39 పోలింగ్ కేంద్రాలు**

| | |
|---|---|
| పురుషులు. | 11578 |
| స్రీలు. | 12599 |
| ఇతరులు | 11 |
| మొత్తం. | 24188 |

**బిచ్కుంద 12 వార్డులు, పోలింగ్ కేంద్రాలు 24**

| | |
|---|---|
| పురుషులు. | 6201 |
| స్త్రీలు. | 6556 |
| ఇతరులు | 2 |
| మొత్తం. | 12759 |

**గ్రాండ్ టోటల్ 92 వార్డులు 239 పోలింగ్ కేంద్రాలు**

| | |
|---|---|
| పురుషులు. | 72489 |
| స్త్రీలు. | 77005 |
| ఇతరులు | 31 |
| మొత్తం. | 149525 |

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధు మోహన్, ఆర్డీఓ వీణ, తహసిల్దార్ జనార్ధన్, ఎన్నికల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ మీ అయ్యా జాగీరా కేటీర్

**- పీసీసీ నాయకులు డా. "సగరపు ప్రసాద్**

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 10:**

కేటీఆర్ అయ్య సంపాదించిన డబ్బులతో బజారుగాళ్ల కంటే ఎక్కువ మాట్లాడుతున్నారని పీసీసీ నాయకులు డా"సగరపుప్రసాద్ అన్నారు. 'మీ వల్లనే మీ అయ్య ఎక్కడికిపోయాడో చూడు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ను వెనక్కి లాగింది నువ్వే. ఇలాంటి మాటలు మాట్లాడితే ఉర్కోరు జాగ్రత్త. నీ పార్టీని ప్రజలు పాతిపెడతరు. తెలంగాణకు పట్టిన శని మీరు. మిమ్మల్ని తిట్టడానికి మాకు నోరు రావడం లేదు. తెలంగాణ మీకు జాగీరా?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ బీఆర్ఎస్ను పట్టించుకోవట్లేదని, పార్టీని వారికి వారే చంపుకుంటున్నారని పేర్కొన్నారు.

రేవంత్ అంటే బీఆర్ఎస్కు భయం అన్నారు.

కేటీఆర్ గతిలేని, మతి లేని మాటలు మాట్లాడుతూ ఆయన స్థాయిని తగ్గించుకుంటున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత కేటీఆర్కు లేదని, ఆయనలాంటి వారిని ఎంతోమందిని రేవంత్ రెడ్డి



చూశారంటూ విమర్శించారు. 2023 డిసెంబర్ 3న రేవంత్.. కేటీఆర్ కుటుంబ అహంకారాన్ని దించారన్నారు. రేవంత్ రెడ్డి పేరు వింటే బీఆర్ఎస్ నాయకులకు భయం పుట్టుకొస్తోందని, కల్వకుంట్ల కుటుంబాన్ని రాజకీయంగా బొందపెట్టింది సీఎం రేవంతే అన్నారు. కేటీఆర్ చిల్లర మాటలు బంద్ చేయాలని హితవు పలికారు.కేటీఆర్ కథ ముగిసింది అన్నారు. సిరిసిల్ల మున్సిపాలిటీలో బీఆర్ఎస్ను ప్రజలు చిత్తుగా ఓడించబోతున్నారని, కేటీఆర్ కథ ముగి సినట్లేనని ప్రసాద్ అన్నారు. సొంత నియోజకవర్గంలో కాళ్ల కింద భూమి కదిలిపోవడంతో కేటీఆర్ కుతకుత ఉడికి పోతున్నాదని, రాజకీయ భవిష్యత్తు గల్లంతు అవుతుందన్న భయంతో సీఎం రేవంత్పై నోరు పారేసుకుంటున్నారని ఫైర్ అయ్యారు. అమెరికాలో బతికేటోడు అయ్యను అడ్డం పెట్టుకుని తెలంగాణకు వచ్చాడని, సిరిసిల్ల సీటు సంపాదించి, పదేళ్లుగా ఎన్నో నీచపు పనులు చేస్తు న్నాడని ఆరోపించారు. సొంత చెల్లెలు మొఖం మీదే ఆరోపణలు చేస్తుండగా ఊర్ల వెంట ఎలా తిరుగుతున్నాడని సగరపు విమర్శించారు.

# పోలవరం ప్రాజెక్టుపై ఉన్న స్టాప్ వర్క్ ఆర్డర్

- శాశ్వతంగా ఎత్తివేసేలా నిర్ణయం తీసుకోవాలి
- సాగునీటి ప్రాజెక్టులు, అంతర్ రాష్ట్ర వివాదాలపై చర్చ
- కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌తో చంద్రబాబు భేటీ



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి10 వెలుతురు:**

ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం సమావేశమయ్యారు. ఏపీలోని వివిధ సాగునీటి ప్రాజెక్టుల అనుమతులు, ఆర్థిక సాయం, అంతర్రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారంపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల భవిష్యత్, తాగునీటి భద్రతకు ఇవి ఎంతో ముఖ్యమని సీఎం వివరించారు. వివిధ ప్రాజెక్టులకు కేంద్ర సాయంపై పెండింగ్‌లో ఉన్న అంశాలతో పాటు, అంతర్రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారంపైనా ముఖ్యమంత్రి సవివరంగా చర్చించారు. సీఎం చంద్రబాబు ఈ భేటీలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన ముఖ్య అంశాలను ప్రస్తావించారు. పోలవరం ప్రాజెక్టుపై ఉన్న స్టాప్ వర్క్ ఆర్డర్‌ను శాశ్వతంగా ఎత్తివేసేలా కేంద్రం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ ఆర్డర్ వల్ల ప్రాజెక్టు అమలులో తీవ్ర అవరోధాలు ఏర్పడుతున్నాయని వివరించారు. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల సామర్థ్యం పెంపు వల్ల పెరిగిన వ్యయాన్ని రీయింబర్స్‌మెంట్ చేయాలన్నారు. అలాగే ఫేజ్-ఎఎ పనులకు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఫేజ్-ఎఎలో భూసేకరణ, పునరావాసం, రక్షణ కట్టలు వంటి పనులు చేపట్టాల్సి ఉందని, దీనికి అదనంగా సుమారు రూ.32,000 కోట్ల నిధులు అవసరమని ముఖ్యమంత్రి తెలిపారు. ÷రిళిదావరి వరద జలాలను వర్షాభావ ప్రాంతాలకు తరలించే లక్ష్యంతో ప్రతిపాదిత పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపైనా చర్చ జరిగింది. తాగు, సాగునీరు, పరిశ్రమల అవసరాలు తీర్చే కీలక ప్రాజెక్టుగా చెప్పుకొచ్చారు సీఎం. జాతీయ నదుల అనుసంధాన విధానంలో భాగంగా దీనికి అనుమతులు మంజూరు చేసి సాంకేతిక, ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్-ఒడిశా మధ్య వంశధార నీటి వివాదం పరిష్కారించాలని కోరారు. వంశధార నీటి వివాద ట్రిబ్యునల్ (వీడబ్ల్యుడీటీ) తుది నివేదికను వెంటనే గెజిట్‌లో ప్రచురించాలని, దీని ఆధారంగా నేరడి బ్యారేజ్ నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని ముఖ్యమంత్రి విన్నవించారు. గోదావరి జలాల పంపకంపై ఆంధ్రప్రదేశ్-తెలంగాణ మధ్య కొనసాగుతున్న వివాదంపై కూడా చర్చించారు. ఈ వివాదం పరిష్కారం కోసం గోదావరి నీటి వివాదాల ట్రిబ్యునల్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు సీఎం. ఎగువ కృష్ణాపై కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపునకు చేపట్టిన చర్యలపై సీఎం తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచడం వల్ల ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే దిగువ ప్రవాహ జలాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఏపీ ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ ఎంపీలు, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# తప్పుడు గణాంకాలతో హైప్ క్రియేషన్

- గణాంకాల పేరుతో ప్రజలను మభ్యపెట్టే యత్నం
- వాస్తవ పనితీరు మాత్రం ఆశించిన స్థాయిలో లేదు
- ఎక్స్ వేదికగా ప్రభుత్వ తీరును ఎండగట్టిన జగన్



**అమరావతి,ఫిబ్రవరి10 వెలుతురు:**

హైప్ ఎక్కువ.. పనితీరు తక్కువ అంటూ కూటమి ప్రభుత్వంపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంపై వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వానికి హైప్ తప్ప పనితీరు లేదని ఆరోపిస్తూ, ఆర్థిక గణాంకాల పేరిట ప్రజలను మభ్యపెడుతున్నారని ఎక్స్ వేదికగా గణాంకాలు బయటపెట్టారు.. చంద్రబాబు విజన్ గురించి పెద్దగా ప్రచారం చేస్తున్నప్పటికీ, వాస్తవ పనితీరు మాత్రం ఆశించిన స్థాయిలో లేదని జగన్ పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మందగమనంలో ఉందని చెబుతూ, కృత్రిమ గణాంకాలతో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందన్న భ్రమను ప్రభుత్వం సృష్టిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఆర్థిక వృద్ధి 11.75 శాతంగా, జాతీయ వృద్ధి 9.8 శాతంగా ఉందని ప్రకటించిందని జగన్ గుర్తు చేశారు. అలాగే 2025-26లో రాష్ట్ర వృద్ధి 10.75 శాతం, జాతీయ వృద్ధి 8 శాతం మాత్రమేనని అంచనా వేస్తోందని తెలిపారు. 2023-24, 2024-25 రెండేళ్ల కాలానికి కలిపి రాష్ట్ర జీఎస్డి సిఎడిఆర్ 11.09 శాతమని ప్రభుత్వం చెబుతోందని, దేశంలో అన్ని రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉందన్న ప్రచారం జరుగుతోందని అన్నారు. అయితే ఈ గణాంకాలు ఏ స్వతంత్ర సంస్థ విడుదల చేసినవి కావని, పూర్తిగా చంద్రబాబు కార్యాలయం తయారు చేసినవేనని జగన్ ఆరోపించారు. నిజంగా రాష్ట్ర ఆర్థిక వృద్ధి అంతగా ఉంటే, అదే స్థాయిలో ప్రభుత్వ ఆదాయాలు కూడా పెరగాలని స్పష్టం చేశారు. అంఉ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, గత రెండేళ్లలో రాష్ట్ర పన్ను ఆదాయాల వృద్ధి అంఉఖీ కేవలం 1.97 శాతం మాత్రమేనని జగన్ తెలిపారు. 11.09 శాతం ఉ÷ూఆఖ వృద్ధి చూపుతూ, పన్ను ఆదాయాలు కేవలం 1.97 శాతం మాత్రమే పెరగడం ఆర్థిక నిపుణులను ఆశ్చర్యానికి గురిచేస్తుందని వ్యాఖ్యానించారు. ఇది కృత్రిమ గణాంకాల వల్లే సాధ్యమని విమర్శించారు జగన్.. ఈ ఆర్థిక సంవత్సరపు తొలి 9 నెలల గణాంకాలను అంఉ 23 రాష్ట్రాలకు విడుదల చేయగా, పన్ను ఆదాయాల వృద్ధి విషయంలో ఆంధ్రప్రదేశ్ 22వ స్థానంలో నిలిచిందని చెప్పారు. అంటే కింద నుంచి రెండో స్థానంలో ఉందని వివరించారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వ స్థూల పన్ను ఆదాయాలు 9.64 శాతం పెరిగితే, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం 1.97 శాతం మాత్రమే పెరిగాయని పేర్కొన్నారు. అయితే, ఇలాంటి పరిస్థితుల్లోనూ రాష్ట్ర ఆర్థిక పనితీరు కేంద్రాన్ని మించిందని ప్రభుత్వం చెప్పడం వాస్తవాలకు విరుద్ధమని వైఎస్ జగన్ విమర్శించారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉన్న అంశాలు ప్రభుత్వ అప్పులు, అవినీతి, రాజకీయ కక్ష సాధింపు, తప్పుడు ప్రచారం మాత్రమేనని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- మూడు వేల అదనపు బలగాలతో ఎన్నికల బందోబస్తు
- పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్
- ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిప్రమాదంపై సమగ్ర దర్యాప్తు
- డిజిపి శివధర్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,ఫిబ్రవరి10 వెలుతురు:**

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉందని చెప్పారు. ఇతర శాఖల నుంచి మూడు వేల అదనపు బలగాలను ఎన్నికల బందోబస్తు సిద్ధం చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. ఓటర్లు భయం లేకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నేపథ్యంలో 1,183 లైసెన్స్‌డ్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాం. 4,318 మందిని బైండోవర్ చేశాం. 398 నాన్-బెయిలబుల్ వారెంట్లు జారీ చేశాం. 4 రాష్ట్రాల సరిహద్దుల్లో 20 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 55 చెక్‌పోస్టులు ఉన్నాయి. 181 ఫ్లయింగ్ స్క్వాడ్స్ సిద్ధం చేశాం. ఇప్పటివరకు రూ.3.09 కోట్లు స్వాధీనం చేసుకున్నాం. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి 142 కేసులు నమోదు చేశామని అన్నారు. మక్తల్‌లో భాజపా అభ్యర్థి మహాదేవప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాం. మహాదేవప్ప ఆత్మహత్య లేఖ రాయలేదని తెలిసింది. అయితే విచారణలో వివరాలు తెలుస్తాయని అన్నారు. హైదరాబాద్ ఎఫ్ఎస్ఎల్ ప్రమాదం ఎలా జరిగిందనేది విచారణ చేస్తున్నాం. ఏసీబీ కేసు 2015లో ఉన్న ఆధారాలు కోర్టుకు ఇచ్చాం. ఫోన్ ట్యాపింగ్ కేసులో కూడా అన్నీ పరిశీలించి నివేదికలు ఇచ్చాం. సాంకేతిక నిపుణులతో డేటాను రిట్రీవ్ చేస్తున్నాం అని డీజీపీ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. ఈ ప్రమాదంలో కీలకమైన కేసులకు సంబంధించిన ఆధారాలు కాలిపోయాయనే అనుమానాల నేపథ్యంలో, రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి స్పందించారు. ప్రమాదానికి గల కారణాలు, జరిగిన నష్టం, కేసుల విచారణ ఏ దశలో ఉందనే విషయాలపై ఆయన స్పష్టతనిచ్చారు. ఈ అగ్నిప్రమాదంలో ఎఫ్ఎస్ఎల్ లోని సర్వర్ రూమ్‌లు పూర్తిగా కాలిపోయాయని డీజీపీ వెల్లడించారు. అత్యంత విచారకరమైన విషయం ఏమిటంటే, ఈ సర్వర్లకు ఎటువంటి బ్యాకప్ వ్యవస్థ అందుబాటులో లేదు. 'సర్వర్ రూమ్ పూర్తిగా దగ్ధమైంది. డేటా బ్యాకప్ లేకపోవడం వల్ల కొంత సమాచారం కోల్పోయే ప్రమాదం ఉంది. అయితే, ప్రస్తుతం సాంకేతిక నిపుణుల బృందం రంగంలోకి దిగి, కాలిపోయిన సర్వర్ల నుండి డేటాను తిరిగి వెలికితీసే ప్రయత్నాలు చేస్తోందని ఆయన వివరించారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందనే కోణంలో సమగ్ర విచారణ జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో కొన్ని కీలక కేసుల ఆధారాలు మాయమయ్యాయనే ప్రచారాన్ని డీజీపీ కొట్టిపారేశారు. ముఖ్యంగా 2015 నాటి ఏసీబీ కేసుల ఓటుకు నోటు వంటివి గురించి ప్రస్తావిస్తూ, ఆ కేసులకు సంబంధించిన సాక్ష్యాధారాలను తాము 2021లోనే కోర్టుకు సమర్పించామని స్పష్టం చేశారు. అందువల్ల ఇప్పుడు జరిగిన ప్రమాదానికి, ఆనాటి కేసుల ఆధారాలకు ఎటువంటి సంబంధం లేదని ఆయన క్లారిటీ ఇచ్చారు. అదేవిధంగా, రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై కూడా ఆయన స్పందించారు. ఈ కేసులో కావాల్సిన అన్ని అంశాలను ఇప్పటికే నిశితంగా పరిశీలించామని, దానికి సంబంధించిన నివేదికలను ఇప్పటికే సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేశామని తెలిపారు.

# అమెరికా వాణిజ్య ఒప్పందం భారత్‌కు దెబ్బ

- మన వ్యవసాయాన్ని ముంచేయడం ఖాయం
- వస్త్ర పరిశ్రమకు కూడా కోలుకోలేని నష్టం
- ఎక్స్ వేదికగా మల్లికార్జున ఖర్గే విమర్శలు



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి10 వెలుతురు:**

భారత్ అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడంపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా విమర్శించారు. ఈ ఒప్పందం భారతదేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని, రైతులు, పశువులు, వస్త్ర రంగాన్ని బలహీనపరుస్తుందని ఆయన ఆరోపించారు. ఈ ఒప్పందాన్ని ఆయన ప్రజా సంబంధాల ద్రోహంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 9న విడుదలైన వైట్‌హౌస్ ఫ్యాక్ట్ షీట్ ఫిబ్రవరి 6న భారత్- అమెరికా సంయుక్త ప్రకటనలో చేర్చని షరతులను వెల్లడించిందని ఖర్గే ఎత్తిచూపారు. రష్యా చమురు నిలిపివేయడానికి భారత్ నిబద్ధతను ప్రదర్శించడం వల్లే అదనంగా 25 శాతం సుంకాల్ని తొలగించినట్లు అమెరికా ప్రకటన పేర్కొంది. ఇది భారతదేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయడమేనని ఖర్గే తీవ్రంగా విమర్శించారు. ÷ూరత్ అమెరికా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కేంద్రాన్ని అడిగినప్పుడు రష్యా చమురును నిలిపివేస్తున్నట్లు తమకు చెప్పలేదని ఖర్గే అన్నారు. అయితే ఈ ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బహిరంగంగా ట్వీట్ ద్వారా ప్రకటించాడు. రష్యన్ ఫెడరేషన్ చమురు కొనుగోలును నిలిపివేయడానికి భారతదేశ నిబద్ధతను అదనపు 25 శాతం సుంకాన్ని తొలగించడానికి ఒక షరతుగా జాబితా చేసినట్లు వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్ స్పష్టంగా చెప్పింది. దీన్నిబట్టి చూస్తే భారతదేశ సార్వభౌమత్వాన్ని హరించడానికి మోడీ ప్రభుత్వం అంగీకరించింది ఎందుకు? అని ఆయన ప్రశ్నించారు. ఈ ఒప్పందం వల్ల భారతదేశ వ్యవసాయం పూర్తిగా దెబ్బతింటుందని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. పప్పుధాన్యాలు, జన్యుపరంగా మార్పు చేసిన (జిఎం) ఫీడ్, ఎండిన డిస్టిలర్ల ధాన్యాలు (డిడిజిలు) అంటే మొక్కజొన్న, సోయాబీన్స్.. ఇక పశుగ్రాసం కోసం ఎర్రజొన్నలను కూడా అమెరికా నుంచి దిగుమతి చేసుకునేటట్టు సైలెంట్‌గా ఇందులో చేర్చారని ఖర్గే ఆరోపించారు. దీని ఫలితం రెండు కోట్ల రైతులు, పశువుల పెంపకందారులు నష్టోపోవచ్చని ఖర్గే హెచ్చరించారు. భారతదేశ చరిత్రలో మొదటిసారిగా.. ఒక ప్రభుత్వం మన వ్యవసాయాన్ని విదేశీ వస్తువులకు తలుపులు పూర్తిగా తెరిచింది. ఈ ఒప్పందంలో అదనపు ఉత్పత్తులు అంటే.. అర్థం ఇదే. ఈ విషయం మనకు తెలుసు. ఫిబ్రవరి 9న కొత్తగా విడుదల చేసిన వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్‌లో 'పల్స్' అనే పదాన్ని సైలెంట్‌గా జోడించింది. అయితే ఫిబ్రవరి 6, 2026న జారీ చేసిన భారత్ ? అమెరికా సంయుక్త ప్రకటనలో ఇవి లేవు. మరోవైపు బంగ్లాదేశ్ అమెరికా పత్తి దిగుమతులకి సున్నా శాతమే పన్నులు విధించగా.. భారత్ 18 శాతం పన్నులు విధించడాన్ని ఖర్గే విమర్శించారు. 18 శాతం పన్నులు విధించడాన్న పెద్ద విజయంగా మోడీ ప్రభుత్వం చెప్పుకుంటోందని ఖర్గే ఆరోపించారు. అమెరికా భారత రైతుల కంటే బంగ్లాదేశ్‌ను ప్రోత్సహించి.. తన సొంత లాభాలను కాపాడుకుంది. తిరుపూర్, సూరత్‌వంటి వస్త్ర కేంద్రాలు 18 శాతం పన్నుల పరిధిలోకి రావడంతో భారతీయ వస్త్ర రంగానికి డబుల్ దెబ్బ తగిలింది. జాతీయ ప్రయోజనాలను, ఎగుమతి ఇంజిన్‌ను త్యాగం చేసే ప్రజా సంబంధాల ద్రోహమా అని ఖర్గే ఎక్స్ పోస్టులో ప్రభుత్వాన్ని విమర్శించారు.

# అవిశ్వాస తీర్మానంపై చర్చకు ఒకరోజు కేటాయింపు

- చర్చ రోజు 50మంది మద్దతు ఉండాల్సిందే



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి10( వెలుతురు):**

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి ప్రతిపక్షం సిద్ధమైంది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రసంగానికి అనుమతించనందుకు, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబేపై చర్యలు తీసుకోనందుకు నిరసనగా స్పీకర్‌పై ఓం బిర్లాపై కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైంది. మరి ఈ అవిశ్వాస తీర్మానానికి సంబంధించి నియమనిబంధనలు ఇలావున్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 94(సీ) కింద లోక్‌సభ స్పీకర్ లేదా డిప్యూటీ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టొచ్చు. ఈ తీర్మానాన్ని సభ ఆమోదిస్తే స్పీకర్, లేదా డిప్యూటీ స్పీకర్ తమ పదవిని కోల్పోతారు. ఈ తీర్మానానికి సంబంధించి కనీసం 14 రోజుల ముందుగా నోటీసులు ఇవ్వాల్సి ఉంటుంది. లోక్‌సభ కార్యకలాపాల నిబంధనల ప్రకారం, లోక్‌సభ ఎంపీ ఎవరైనా ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టొచ్చు. ఇందుకోసం లిఖిత పూర్వకంగా లోక్‌సభ సెక్రెటరీ జనరల్‌కు ముందస్తు నోటీసు ఇవ్వాలి. ఆ తరువాత సభలో నిర్వహించాల్సిన కార్యకలాపాల జాబితాలో ఈ తీర్మానాన్ని చేరుస్తారు. దీనిపై చర్చకు ఒక తేదీని కేటాయిస్తారు. ప్రస్తుతం ఈ తేదీని డిప్యూటీ స్పీకర్ నిర్ణయించనున్నారు. ఇక నిర్ణీత తేదీన లోక్‌సభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెడతారు. ఆ సమయంలో సభలో ఉన్న కనీసం 50 మంది ఎంపీలు తీర్మానికి మద్దతు తెలిపితేనే ఓటింగ్‌కు మార్గం సుగమం అవుతుంది. లేకపోతే ఆదిలోనే ఇది వీగిపోతుంది. తీర్మానాన్ని సభ ఓటింగ్‌కు స్వీకరించాక ఎంపీలు మూజువాణీ ఓటు ద్వారా లేదా ఇతర ప్రత్యామ్నాయ ఓటింగ్ విధానాల్లో తమ అభిప్రాయాన్ని తెలియజేస్తారు. ప్రతిపక్షాల తీర్మానం కొన్ని నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే డిప్యూటీ స్పీకర్ దాన్ని స్వీకరిస్తారు. అంటే ఎలాంటి సాంకేతిక, ఇతరత్రా లోపాలు ఉండకూడదు. తీర్మానంలో ప్రతిపక్షాలు పేర్కొన్న ఆరోపణలు స్పష్టంగా ఉండాలి. సభ్యుల వాదనలు, అభిప్రాయాలు, అన్వయాలు, అవమానకరంగా ఉండే వ్యాఖ్యలకు అవిశ్వాస తీర్మానంలో చోటు ఉండదు. ఇందుకు అనుగుణంగా ఉన్న తీర్మానాన్నే డిప్యూటీ స్పీకర్ స్వీకరిస్తారు. ఇక ఓటింగ్ రోజున సభలో ఉన్న మెజారిటీ ఎంపీలు అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా ఓటువేస్తేనే ప్రతిపక్షాల లక్ష్యం నెరవేరుతుంది. ప్రస్తుతం బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ కూటమికి 293 ఎంపీల మద్దతు ఉంది. ప్రతిపక్ష ఐఎన్‌డీఐఏ కూటమిలో 238 ఎంపీలే ఉన్నారు. దీంతో, అవిశ్వాస తీర్మానంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

# ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

- కాకినాడ కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ధర్నా




**కాకినాడ,ఫిబ్రవరి10( వెలుతురు):**

భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. పెండింగ్ లో ఉన్న ఏడు వేల కోట్ల రూపాయలు బకాయి ఫీజు రీయింబర్స్మెంట్ డబ్బులను విడుదల కోసం విద్యార్థులు జిల్లా పరిషత్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా తరలి వచ్చి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సి.హెచ్ లోవరాజు, ఎం.గంగా సూరిబాబు మాట్లాడుతూ ?. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేస్తామని చెప్పి ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మాట మరిచిందన్నారు. 7 వేల కోట్లు రూపాయలు ప్రభుత్వం బకాయిలు పెట్టిందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్మెంట్ డబ్బులు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయని, పరీక్షలకు అనుమతించబోమని విద్యార్థులను బెదిరించి విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తుందని వారు ఆరోపించారు. రేపు జరగబోయే బ్జడెట్ సమావేశాలలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ అంశంపై చర్చించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడంతో కళాశాలలు విద్యార్థులలే ఫీజు రియంబర్స్మెంట్ డబ్బులు చెల్లించాలని లేకపోతే పరీక్షలకు అనుమతి ఇవ్వబోమని అంటున్నారన్నారు. చిన్న చిన్న బ్జడెట్ కళాశాలలు కూడా నిర్వహణ అగమ్యగోచరంగా ఉంటుందన్నారు. తక్షణమే ప్రభుత్వ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులందరినీ ఐక్యం చేసి పెద్ద ఎత్తున పోరాడతామన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి కి ఎస్ ఎఫ్ ఐ బఅందం ఇవ్వడం జరిగింది. దీనిపై కలెక్టర్ షాన్ మోహన్ స్పందించి ప్రభుత్వానికీ తెలియజేస్తామని అన్నారన్నారు. జిల్లాలో ఏ కళాశాల కూడా విద్యార్థుల హాలు టికెట్లు, సర్టిఫికెట్లు అంపకుండా చూస్తామన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ జిల్లా, నగర నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇద్దరు పిల్లలతో మతిస్థిమితం లేని తల్లి అదృశ్యం

**గుంటూరు,ఫిబ్రవరి10( వెలుతురు):**

మంగళగిరి మండలం, ఎర్రబాలెం గ్రామంలో ఇద్దరు చిన్న పిల్లలతో కలిసి ఒక వివాహిత అదృశ్యమైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఈ ఘటనతో స్థానికంగా ఆందోళన నెలకొంది. ఎర్రబాలెం గ్రామానికి చెందిన బోయ లక్ష్మి (30) అనే మహిళ, కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో, ఆమె తన ఇద్దరు పిల్లలైన సిరాజ్ (4 ), మౌనిక (1 ) లతో కలిసి ఇంటి నుండి బయటకు వెళ్లిపోయారు. ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాకపోవడం, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులు, మానసిక స్థితి సరిగా లేని మహిళ అదఅశ్యం కావడం పట్ల పోలీసులు, కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరి ఆచూకీ తెలిసిన వారు లేదా ఎక్కడైనా కనిపిస్తే, వెంటనే మంగళగిరి రూరల్ పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. చిన్నారులను సురక్షితంగా వారి కుటుంబం చెంతకు చేర్చేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

# మునిసిపల్ ఎన్నికల తర్వాత పదవులు...

హైదరాబాద్, ఫిబ్రవరి10( వెలుతురు):
మున్సిపల్ ఎన్నికల కోడ్ ముగియగానే కీలక పదవులను భర్తీతో పాటు క్యాబినెట్ విస్తరణ చేయనున్నారా? అంటే అవుననే టాక్ వినిపిస్తోంది. ఎన్నికలకు ముందు ఆ తర్వాత నేతలకు ఇచ్చిన హామీ ప్రకారం మంత్రి పదవులతో పాటు కార్పొరేషన్ పదవులు కట్టబెట్టాలని భావిస్తున్నారట. అయితే కొందరు తమకు పదవులు ఇవ్వకపోతే ఊరుకునేది లేదని అల్టిమేటం జారీ చేస్తున్నారట.ఇంకొందరు అయితే తమకు పదవులు ఇవ్వకపోయినా సరే, కానీ వేరే పార్టీ నుంచి వచ్చిన వలస నేతలకు పోస్టులు ఇవ్వొద్దని అగ్రనేతలకు తేల్చి చెబుతున్నారట. ఈ క్రమంలోనే మున్సిపల్ ఎన్నికల కోడ్ ముగియగానే కాంగ్రెస్ పార్టీలో పదవుల జాతర స్టార్ట్ కానుందట.క్యాబినెట్‌లో మిగిలిన రెండు మంత్రి పదవులతో పాటు పలు కీలకమైన కార్పొరేషన్ పదవులను భర్తీ చేసేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తోందట. మరోవైపు కులసంఘాల కార్పొరేషన్ ఛైర్మన్ల భర్తీపై కూడా ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అయితే మున్సిపల్ ఎన్నికల కోడ్ రావడంతో పదవుల భర్తీకి బ్రేకులు పడ్డట్లు చెప్పుకుంటున్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే కీలక పదవులు భర్తీ చేస్తామని చెబుతున్నారట ప్రభుత్వ పెద్దలు.క్యాబినెట్ బెర్తుల కోసం హస్తం పార్టీలో హెవీ కాంపిటేషన్ ఉంది. సామాజిక వర్గాల వారీగా అమాత్య యోగం కోసం పోటీ పడుతున్నారు నేతలు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం పదవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. ఇక రంగారెడ్డి జిల్లా నుంచి మల్ రెడ్డి రంగారెడ్డి గట్టి పట్టుబడుతున్నారు.ఢిల్లీకి వెళ్లి పార్టీ అధిష్టానానికి విన్నవించుకున్నారు. ఇంతలో సీఎం రేవంత్ రెడ్డి పరిగి సభలో చేసిన కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. మాజీ ఎంపీ రంజిత్ రెడ్డిని మున్సిపల్ శాఖ మంత్రిని చేస్తానంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు కొత్త చర్చకు దారితీశాయి. సీఎం రేవంత్ ఫ్లోలో అలా మాట్లాడారా లేక రంజిత్‌రెడ్డిని మంత్రి చేయబోతున్నారా




అనేది డిస్కషన్ పాయింట్‌గా మారింది.ఈ క్రమంలోనే వలస వచ్చిన నేతలకు కాకుండా..పార్టీలో ముందు నుంచి ఉన్నవారికి గతంలో హామీ ఇచ్చినవారికి అమాత్య పదవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు నేతలు. ఇక బీసీ వర్గం నుంచి కూడా పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ పేరు ప్రధానంగా చర్చకు వస్తున్నా..విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ వంటి వారు పోటీ పడుతున్నారు.ఎన్నికల కోడ్ ముగియగానే ప్రభుత్వం భర్తీ చేయాల్సిన కీలక పదవుల్లో మహిళా కమిషన్ ఒకటి. మహిళా కమిషన్ ఛైర్మన్‌తో పాటు సభ్యులుగా..కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కీలకంగా వ్యవహరించిన మహిళలకే అవకాశం ఇవ్వాలని హస్తం పార్టీ మహిళా నేతలు కోరుతున్నారు. అయితే ఈ పదవిని ప్రస్తుత జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మికి ఇవ్వబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది గ్రేటర్ మేయర్ విజయలక్ష్మి పదవీకాలం ముగుస్తుంది. ఆ త్వరాత ఎన్నికల కోడ్ ముగియగానే విజయలక్ష్మికి మహిళా కమిషన్ ఛైర్మన్ పదవి కట్టబెట్టబోతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై మహిళా కాంగ్రెస్ నేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ అధికారంలోకి రావడానికి ఎంతగానో కష్టపడిన తమను కాదని వేరే పార్టీలో పదవులు అనుభవించిన వారికి మహిళా కమిషన్ లాంటి కీలక పదవి ఇవ్వడం సరైన పద్ధతి కాదని పార్టీ పెద్దల దగ్గర గోడును వెళ్లబోసుకున్నారట.వాస్తవానికి ఇప్పటివరకు పనిచేసిన మహిళా కమిషన్ ఛైర్మన్ కేవలం ఏడాదిన్నర మాత్రమే పదవిలో కొనసాగారు. కమిషన్ పదవీకాలం ఐదేళ్లు కాగా.. మూడున్నరేళ్లు ఈ పదవిలో ఉన్న సునితా లక్ష్మారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో రాజీనామా చేశారు. దీంతో మిగిలిన ఏడాదిన్నర కోసమే నేరెళ్ల శారదకు అవకాశం ఇచ్చారు. ఏడాదిన్నర కాలం కూడా సమర్థవంతంగా పనిచేశారన్న పేరు కూడా తెచ్చుకున్నారు. దీంతో ఆమెకు ఎక్స్‌టెన్షన్ ఖాయమనే అంతా భావించారు.అయితే కేకే కూతురు, జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి పదవీకాలం ఈ నెల ముగుస్తుండడంతో ఆమెకు మహిళా కమిషన్ ఛైర్మన్ పోస్టు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసమే ఇప్పటివరకు శారదకు ఎక్స్ టెన్షన్ ఇవ్వకుండా..కొత్త వారితో భర్తీ చేయకుండా ఆపారన్న టాక్ నడుస్తోంది. దీనిపై ఒరిజినల్ కాంగ్రెస్ మహిళా నేతల్లో అసహనం వ్యక్తం అవుతోంది.డిమాండ్లు, అభ్యంతరాలు, ఆశావహులు ఈక్వేషన్స్ ఎలా ఉన్నా..మార్చి ఫస్ట్ వీక్‌లో కాంగ్రెస్ పార్టీలో పదవుల పందేరం మాత్రం పక్కా అన్న టాక్ వినిపిస్తోంది. అయితే పదవుల పందేరంలో ఒరిజినల్ కాంగ్రెస్ వర్సెస్ కొత్త కాంగ్రెస్ నేతల్లో ఎవరి ఆశలు నెరవేరుతాయో చూడాలి మరి.

## మహదేవప్ప మృతి అత్యంత బాధాకరం

**- మంత్రి బెదిరంపులే కారణమన్న రామచంద్ర రావు**



హైదరాబాద్, ఫిబ్రవరి10( వెలుతురు):
మక్తల్‌లో భాజపా అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్య ఘటన తీవ్రంగా కలచివేసిందని బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. ఇది అత్యంత భాధాకరమని.. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. మహదేవప్ప ఆత్మహత్యకు కాంగ్రెస్ అహంకారపూరిత రాజకీయాలు, మాఫియా బెదిరింపులే కారణంగా తెలుస్తోందన్నారు. స్థానిక మంత్రి శ్రీహరి, ఆయన అనుచరుల వేధింపులు తట్టుకోలేకే భాజపా అభ్యర్థి బలవన్మరణానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. అధికార మత్తులో కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోంది. అహంకారపూరిత రాజకీయ నాయకుడి వేధింపులకు నిండు ప్రాణం బలైంది. ఈ ఘటనకు కారణమైన మంత్రి శ్రీహరిని తక్షణమే అరెస్ట్ చేయాలి. ఆయన్ను మంత్రివర్గం నుంచి తొలగించాలి. ఈ ఘటనపై ప్రభుత్వం నిష్పక్షపాత విచారణ జరపాలి. లేనిపక్షంలో భాజపా కార్యకర్తల ఆగ్రహ జ్వాలలకు గురికాక తప్పదు. దోషులు ఎంతటి వారైనా వదిలిపెట్టకూడదు. మహదేవప్ప కుటుంబానికి న్యాయం జరిగే వరకు భాజపా పోరాటం చేస్తుంది‘ అని రామచందర్‌రావు అన్నారు.

## ఎన్నికల ప్రాంతాల్లో నేడు సెలవు

**- ఓటు హక్కు వినయోగించుకునే వెసులుబాటు**

**- ఫ్యాక్టరీలు, షాపులు, పరిశ్రమలకు వర్తింపు**




హైదరాబాద్, ఫిబ్రవరి10( వెలుతురు):
తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బుధవారం పోలింగ్ రోజును సెలవుగా ప్రకటించింది. ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని ఫ్యాక్టరీలు, షాపులు, పరిశ్రమలకు సెలవు వర్తించనుంది. అంతేకాకుండా, మున్సిపాలిటీల పరిధిలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు ఈ సెలవు వర్తించనుంది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో మాత్రమే ఈ సెలవు వర్తించనుంది. తెలంగాణ వ్యాప్తంగా ఒకే విడతలో మున్సిపల్ ఎన్నికలు జరుగనున్నాయి. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్ జరుగనుంది. మొత్తం 12,930 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఎన్నికల కోసం 8,203 పోలింగ్ కేంద్రాలు, 16,301 బాలెట్ బాక్సులను ఎన్నికల సంఘం సిద్ధం చేసింది. రేపు (ఫిబ్రవరి 11) ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 13న ఫలితాలను ప్రకటించనున్నారు. పోలింగ్ కోసం ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలింగ్ సమయంలో మద్యం షాపులు మూసేయడంతో పాటు, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోనున్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

## నేటినుంచి ఆర్‌ఆర్‌బి పరీక్షలు




విజయవాడ, ఫిబ్రవరి10( వెలుతురు):
దేశ వ్యాప్తంగా ఉన్న రైల్వే రీజియన్లలో ఆర్‌ఆర్‌బీ సెక్షన్ కంట్రోలర్ పరీక్ష బుధవారం నుచి ప్రారంభంకానుంది. ఇందుకు సంబంధించి మాక్ టెస్టులను రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు తాజాగా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు డైరెక్ట్ లింక్ ద్వారా ఉచిత మాక్ టెస్ట్‌లు రాయవచ్చు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఎలాంటి పాస్‌వర్డ్ లేకుండా ఈ ఉచిత మాక్ టెస్టును ఉపయోగించుకోవచ్చు. 11, 12 తేదీల్లో ఆన్‌లైన్ విధానంలో ఆర్‌ఆర్‌బీ సెక్షన్ కంట్రోలర్ పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు అడ్మిట్ కార్డులను సైతం ఇప్పటికే బోర్డు వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. కాగా భారత ప్రభుత్వ రైల్వే మంత్రిత్వ శాఖ, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు దేశ వ్యాప్తంగా గల అన్ని రైల్వే జోన్లలో మొత్తం 368 పోస్టులతో సెక్షన్ కంట్రోలర్ పోస్టుల భర్తీకి ఈ నియామక ప్రక్రియ చేపట్టింది. డిగ్రీతో ఈ నియామకాలను భర్తీ చేయనుంది. రామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ యూజీ 2026) పరీక్షకు సంబంధించి దరఖాస్తుల సవరణకు ఫిబ్రవరి 11 వరకు అవకాశం ఇచ్చింది. దరఖాస్తుల్లో తప్పుల సవరణకు రేపటితో గడువు ముగియనుంది. ఇక సీయూఈటీ యూజీ ప్రవేశ పరీక్ష మే 11 నుంచి 31 మధ్య ఆన్‌లైన్ విధానంలో దేశ వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో జరగనుంది. ఈ పరీక్ష ద్వారా కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఇతర విద్యాసంస్థల్లో 2026-27 విద్యాసంవత్సరానికి పలు యూజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. మొత్తం 13 భాషల్లో 37 సబ్జెక్టులకు ఈ పరీక్ష జరనుంది.

## ఎన్నికల కోడ్ ఉలఘించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేను అడ్డుకున్న ప్రజలు

కామారెడ్డి ఫిబ్రవరి10( వెలుతురు):
ప్రచార సమయం ముగిసిన తర్వాత డబ్బులు, మద్యం పంచుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావును స్థానిక ఓటర్లు అడ్డుకున్నారు. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మున్సిపాలిటీలోని ఒక వార్డులో, ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ ఎమ్మెల్యే తోల ఓటర్లకు డబ్బు, మద్యం పంపిణీ చేసారని ఆరోపించారు. ప్రలోభాలకు గురిచేస్తున్న ఎమ్మెల్యేను రెడ్ హ్యాండెడ్గా అడ్డుకున్నారు. అక్కడినుండి ఓటర్లు, బీఆర్ఎస్ శ్రేణులు పంపించివేసారు. కాంగ్రెస్ నాయకులు కళ్లముందే ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నా పోలీసులు పట్టించుకోవడంలేదని బీఆర్ఎస్ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేసారు.

## ఘనంగా జిల్లా స్థాయి ముఖ్యమంత్రి కప్-2025-26 పోటీలు

రంగారెడ్డి, ఫిబ్రవరి10( వెలుతురు):
రంగారెడ్డి జిల్లా స్థాయి ముఖ్యమంత్రి కప్-2025-26 పోటీలు 10.02.2026న సరోర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ పోటీలలో వాలీబాల్ మరియు బాక్సింగ్ విభాగాలలో పోటీలు జరిగాయి. రంగారెడ్డి జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల నుండి 500 మందికి పైగా క్రీడాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీలలో విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీమతి పద్మావతి (లీగల్ & ఎస్టేట్ ఆఫీసర్ వాూ+), శ్రీ జు. వెంకటేశ్వరరావు (ఓూ), అసోసియేషన్ కార్యదర్శి శ్రీ రవి కుమార్, శారీరక విద్య శాఖ శ్రీ రాఘవ రెడ్డి, వా+ఖీ కార్యదర్శి శ్రీ రామచంద్రుడు, మిస్టర్ షబీర్, మిస్టర్ మల్లేష్, జిల్లా కోచ్‌లు మరియు ఫిజికల్ డైరెక్టర్లు హాజరై ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అందరి సమన్వయం మరియు కృషి కారణంగా ఈ పోటీలు గొప్ప









విజయంతో ముగిశాయి. ఈ పోటీలలో గెలుపొందిన జట్లు మరియు క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి ముఖ్యమంత్రి కప్ పోటీలలో రంగారెడ్డి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారు. పోటీ ఫలితాలు వాలీబాల్ (బాలురు): విజేతలు కల్వకుర్తి నియోజకవర్గ జట్టు రన్నర్స్ షాద్ నగర్ నియోజకవర్గ జట్టు వాలీబాల్ (బాలికలు): విజేతలు కల్వకుర్తి నియోజకవర్గ జట్టు రన్నర్స్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ జట్టు ఈ జిల్లా స్థాయి ముఖ్యమంత్రి కప్ పోటీలు యువతలో క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తాయని మరియు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.

# కొత్తజిల్లాల ఆశలపై నీళ్లు

వరంగల్, ఫిబ్రవరి10( వెలుతురు):
తెలంగాణలో జిల్లాల పునర్విభజన, ప్రస్తుత జిల్లాల భవిష్యత్తుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన కీలక వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోబోతోందనే ఉత్కంఠకు సీఎం తెరదించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న ఏ ఒక్క జిల్లాను కూడా రద్దు చేసే ఉద్దేశం తమ ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా భూపాలపల్లి జిల్లా రద్దు అవుతుందనే ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యక్తిగత ఇష్టాయిష్టాలు, సెంటిమెంట్లు, ఆయన లక్కీ నంబర్ ఆధారంగానే జిల్లాల విభజన చేపట్టిందని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ విమర్శిస్తూ వస్తోంది. పరిపాలనా సౌలభ్యం కంటే రాజకీయ ప్రయోజనాలే పరమావధిగా జిల్లాల ఏర్పాటు జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అయినప్పటికీ, ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఉన్న జిల్లాలను తొలగించడం కంటే, ఉన్నవాటిని పటిష్టం చేయడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూర్ అభివృద్ధి పనుల శంకుస్థాపనలో పాల్గొన్న సీఎం, అక్కడి బహిరంగ సభలో జిల్లా ఉనికిపై భరోసా ఇచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఎంతో గొప్ప చరిత్ర ఉందని, భూపాలపల్లి ఒక చిన్న కుగ్రామంగా ఉన్న దశ నుంచి నేడు మున్సిపాలిటీగా, జిల్లా కేంద్రంగా ఎదగడం వెనుక ఎందరో కృషి ఉందని రేవంత్ రెడ్డి కొనియాడారు. దివంగత



ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు భూపాలపల్లిని మండల కేంద్రంగా మార్చడం ద్వారానే ఈ ప్రాంత అభివృద్ధికి బీజం పడిందని ఆయన గుర్తు చేశారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తికి పునాది ఇక్కడే పడిందని, ఈ ప్రాంత అభివృద్ధిలో సింగరేణి కార్మికుల పాత్ర వెలకట్టలేనిదని ఆయన ప్రశంసించారు.జిల్లాల పునర్విభజన లేదా మార్పులపై భవిష్యత్తులో ఏదైనా నిర్ణయం తీసుకోవాల్సి వస్తే, అది ఏకపక్షంగా ఉండదని సీఎం తేల్చిచెప్పారు. ప్రజల అభిప్రాయాలను సేకరించిన తర్వాత, అసెంబ్లీలో సమగ్రంగా చర్చించి, ప్రతిపక్షాల సూచనలు తీసుకున్న తర్వాతే ముందుకెళ్తామని ప్రకటించారు. రహస్య నిర్ణయాలు లేదా రాజకీయ కుట్రలకు తమ ప్రభుత్వంలో తావులేదని ఆయన కుండబద్దలు కొట్టారు.ప్రభుత్వంపై బురదజల్లేందుకు కొంతమంది కావాలనే జిల్లాల రద్దుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసం ఇలాంటి విషం చిమ్మే ప్రయత్నాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మెడికల్ బోర్డు విషయంలో కొందరు చేస్తున్న చిల్లర రాజకీయాలను తిప్పికొడతామని, కార్మికుల వల్లే రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని ఆయన కృతజ్ఞత చాటుకున్నారు. అసత్య ప్రచారాలు చేసే వారిని మోకాళ్లపై కూర్చోబెడతామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే శక్తులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటనతో జిల్లాల భవిష్యత్తుపై నెలకొన్న సందిగ్ధత వీడిపోయింది. పాలనలో పారదర్శకత, ప్రజాస్వామ్యబద్ధమైన చర్చల ద్వారానే ఏ నిర్ణయమైనా ఉంటుందని చెప్పడం ద్వారా ఆయన ప్రజల్లో విశ్వాసాన్ని నింపారు. భూపాలపల్లి జిల్లా ఉనికిపై ఆయన ఇచ్చిన హామీ ఆ ప్రాంత ప్రజలకు పెద్ద ఊరటనిచ్చింది.

## బండి వ్యూహం ఫలించేనా

కరీంనగర్ ఫిబ్రవరి10( వెలుతురు):
తెలంగాణలో. ప్రచారం హోరాహోరీగా ముగిసింది ఇక 66 డివిజన్లు ఉన్న ఖరీంనగర్‌లో ఈసారి కాషాయ జెండా ఎగురవేయాలని ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఫోకస్ పెట్టారు. ప్రత్యేక శైలిలో ప్రచారంతో ముందుకు సాగుతున్నారు. డివిజన్ల వారీగా స్ట్రీట్ కార్నర్ సమావేశాలు ఏర్పాటు చేస్తూ, ప్రజలతో నేరుగా సంబంధం పెంచుకుంటున్నారు. అవినీతి దూరం, నగరాభివృద్ధి హామీలతో ఓటర్లలో నమ్మకాన్ని నింపుతూ, పోటీని తీవ్రతరం చేస్తున్నారు.ప్రతి డివిజన్‌లో బండి సంజయ్ నిర్వహిస్తున్న చిన్న సమావేశాలు ప్రచారానికి కొత్తగా ఉంటున్నాయి. రోడ్డు పక్కనే జరిగే ఈ కార్యక్రమాల్లో ప్రజల



సమస్యలను విని, తమ అభ్యర్థులను పరిచయం చేస్తున్నారు. ఇది పార్టీకి క్షేత్ర స్థాయిలో బలోపేతాన్ని తీసుకువస్తోంది. సాధారణ ప్రచారాలకు భిన్నంగా, ఈ విధానం ఓటర్లలో సానుకూలతను పెంచుతోందిగెలిచాక అవినీతికి పాల్పడమని అభ్యర్థులు ప్రజల సాక్షిగా ప్రమాణం చేయించడం సంజయ్ ప్రత్యేక ఎత్తు. ఈ చర్య ఓటర్లలో పారదర్శకత, జవాబుదారీతనం భావాలను రేకెత్తిస్తోంది. ప్రజల ముందు ఇలాంటి ప్రతిజ్ఞలు రాజకీయ విమర్శలకు బలమైన జవాబుగా మారాయి. ఇది పోటీ అభ్యర్థులకు సవాలుగా నిలిచి, బీజేపీ అజెండాను బలపరుస్తోంది.కేంద్ర ప్రభుత్వ నిధులతో నగరాన్ని అభివృద్ధి చేస్తామని స్పష్టమైన హామీ ఇస్తున్నారు. ఇది స్థానిక సమస్యలైన మౌలిక సదుపాయాలు, పరిశీలన, రోడ్లు వంటి అంశాలపై దృష్టి పెడుతోంది. ప్రజలతో మమేకమైన వాతావరణం సృష్టించి, ఈ హామీలను వాస్తవికంగా చూపిస్తున్నారు. ఇది ఓటర్లలో ఆశలు నింపుతూ, పార్టీకి ఆదాయం తీసుకువస్తుందని అంచనా.సంజయ్ వ్యూహం కరీంనగర్ ఎన్నికల్లో పోటీని మరింత ఉత్కంఠ పెంచింది. అవినీతి వ్యతిరేక చిత్రణ, అభివృద్ధిపై ఫోకస్ బీజేపీ అభ్యర్థులకు ప్లస్‌గా మారుతున్నాయి. ప్రత్యర్థి పార్టీలు ఈ దూకుడుకు సమాధానాలు తీసుకోవాల్సి వచ్చింది. ఫలితాలు బీజేపీ క్షేత్ర స్థాయి బలాన్ని, సంజయ్ నాయకత్వాన్ని పరీక్షిస్తాయి.


https://epaper.velthuru.com

వెలుతురు

cinema

# జోర్డాన్‌లో డ్రాగన్ యాక్షన్ సీన్స్ షూటింగ్

టాలీవుడ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్–డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్' సినిమాపై అభిమానుల్లో రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన ప్రతి చిన్న అప్‌డేట్ కోసం ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ జోర్డాన్‌లో జరుగుతోంది. అక్కడ ఎన్టీఆర్‌పై అత్యంత భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. ఈ యాక్షన్ ఎపిసోడ్ పూర్తయిన వెంటనే ఓ స్పెషల్ సాంగ్‌ను షూట్ చేయనున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఆ పాటలో ఎన్టీఆర్ స్టెప్స్‌తో పాటు హీరోయిన్ రుక్మిణీ వసంత్ గ్లామర్ ప్రధాన ఆకర్షణగా నిలవనుందని టాక్ వినిపిస్తోంది. ప్రశాంత్ నీల్ స్టైల్‌కు తగ్గట్టుగా ఈ సాంగ్‌ను కూడా గ్రాండ్ లెవల్‌లో తెరకెక్కించేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలిచే అవకాశముంది. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో యాక్షన్ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని యూనిట్ చెబుతోంది. ఎన్టీఆర్ కెరీర్‌లోనే ఇది అత్యుత్తమ సినిమాల్లో ఒకటిగా నిలవాలని ప్రశాంత్ నీల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాడని సమాచారం. అందుకే స్క్రిప్ట్ దశలోనే ఆయన చాలా సమయం కేటాయించాడట. కథ, స్క్రీన్‌ప్లే, యాక్షన్ బ్లాక్స్ అన్నింటినీ అత్యంత జాగ్రత్తగా ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఆయన సంగీతం ఇప్పటికే ప్రశాంత్ నీల్ సినిమాలకు భారీ ప్లస్ పాయింట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ సినిమాలో బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్ కీలక పాత్రలో కనిపించనుండటం మరో ప్రత్యేకత. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న 'డ్రాగన్' సినిమాను ఈ ఏడాది జూన్ 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది.



# 'జననాయగన్' వివాదం.. పిటిషన్‌ను విత్ డ్రా చేసుకున్న నిర్మాతలు

విజయ్ 'జననాయగన్' విడుదలకు మరో ముందడుగు పడింది. ఈ సినిమాకు సంబంధించి సెన్సార్ బోర్డుకు వ్యతిరేకంగా వేసిన పిటిషన్‌ను నిర్మాతలు ఉపసంహరించుకున్నారు. దీనికి మద్రాసు హైకోర్టు మంగళవారం అనుమతివ్వడంతో సినిమా విడుదలకు మార్గం సుగమమైంది.






# విశ్వంభరకు ప్రత్యేకంగా టైటిల్ కార్డ్స్

మెగాస్టార్ చిరంజీవి, వశిష్ట కాంబినేషన్‌లో రాబోతున్న సోషియో–ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' సినిమాపై టాలీవుడ్‌లో భారీ అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా టైటిల్ కార్డ్స్ విషయంలో దర్శకుడు వశిష్ట తీసుకున్న నిర్ణయం ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహించిన 'లియో' సినిమా తర్వాత యానిమేటెడ్ టైటిల్ కార్డ్స్ వేయడం అనేది ఒక ట్రెండ్‌గా మారిపోయిందన్న సంగతి తెలిసిందే, అయితే తన సినిమా కోసం ఆ రొటీన్ ఫార్ములాను ఫాలో అవ్వడం తమకు ఇష్టం లేదని వశిష్ట క్లారిటీ ఇచ్చినట్లు తెలుస్తుంది. ఈ ట్రెండ్‌ను బ్రేక్ చేస్తూ 'విశ్వంభర' కాన్సెప్ట్‌ను ప్రతిబింబించేలా ఏకంగా ఎనిమిది రకాల ప్రత్యేకమైన మెగాస్టార్ టైటిల్ కార్డ్ డిజైన్స్‌ను చిత్ర బృందం రూపొందించినట్లు తెలుస్తుంది. పంచభూతాల నేపథ్యంలో సాగే ఈ ఫాంటసీ అడ్వెంచర్‌లో ప్రతి టైటిల్ కార్డ్ ఒక ప్రత్యేకమైన ఎలిమెంట్‌ను ప్రేక్షకులకు పరిచయం చేయబోతోంది. హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్‌తో, చిరంజీవి ఇమేజ్‌ను మరో లెవల్‌లో చూపిస్తూ ఈ కార్డ్స్ డిజైన్ చేయబడ్డాయి. కేవలం టైటిల్ కార్డ్స్ కోసమే దర్శకుడు ఇంతటి కసరత్తు చేశారంటే, వెండితెరపై సినిమా ఏ స్థాయి విజువల్ వండర్‌గా ఉండబోతుం దోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సంక్రాంతి కానుకగా విడుదల కానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త సంచలనాలు సృష్టించడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.



# బాలీవుడ్‌లోకి కిరణ్ అబ్బవరం

టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం తన కెరీర్‌లో మరో భారీ అడుగు వేయబోతున్నారు. 'క' చిత్రంతో పాన్–ఇండియా స్థాయిలో తన సత్తా చాటిన కిరణ్, ఇప్పుడు బాలీవుడ్ ప్రముఖ నిర్మాత ప్రేరణ అరోరా నిర్మాణంలో ఒక భారీ పాన్–ఇండియా ప్రాజెక్ట్‌కు సంతకం చేసినట్లు తెలుస్తుంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని జీ స్టూడియోస్ అధినేత ఉమేష్ బన్సాల్‌తో కలిసి ప్రేరణ అరోరా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించనుండగా, కీర్తన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. భారతీయ సంస్కృతి మరియు పురాణాల నేపథ్యంలో సాగే ఒక అద్భుతమైన మైథాలజీ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్‌గా ఈ చిత్రం తెరకెక్కనుంది. ఈ సినిమా కోసం మేకర్స్ సరికొత్త ప్రపంచాన్ని సృష్టించబోతున్నారు. గ్రాండ్ విజువల్స్ మరియు హై టెక్నికల్ వాల్యూస్‌తో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ చిత్రం రూపొందనుంది. ప్రస్తుతం ప్రీ–ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా, అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సెప్టెంబర్ నెల నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించాలని చిత్ర బృందం నిర్ణయించినట్లు సమాచారం. ఈ భారీ ప్రాజెక్ట్ కోసం బాలీవుడ్ లేదా టాలీవుడ్‌కు చెందిన ఒక అగ్ర నటిని హీరోయిన్‌గా ఎంపిక చేసే ప్రక్రియలో చిత్ర యూనిట్ ఉంది. భక్తి, భావోద్వేగాలు, డ్రామా మరియు హై–వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌ల కలయికతో ఈ కథ ఉండబోతోందని, ప్రేక్షకులకు ఇది ఒక సరికొత్త దృశ్యకావ్యాన్ని అందిస్తుందని నిర్మాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. సినిమా టైటిల్, దర్శకుడు మరియు ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు. 'క' సినిమా విజయంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కిరణ్ అబ్బవరం, ఈ గ్లోబల్ ప్రాజెక్ట్‌తో బాక్సాఫీస్ వద్ద తనదైన ముద్ర వేయాలని సిద్ధమవుతున్నారు.



# పెళ్లి రోజు నాడు నమ్రత స్పెషల్ పోస్ట్

**హైదరాబాద్ వెలుతురు బ్యూరో (ఉదయ్ కిరణ్) ఫిబ్రవరి 10 :**

టాలీవుడ్ లో బెస్ట్ కపుల్ అంటే ఎవరికైనా వెంటనే గుర్తొచ్చే జంట మహేష్ బాబు- నమ్రత శిరోద్కర్ జంటనే. ప్రేమించి పెళ్లి చేసుకున్న వీరిద్దరూ ఎంతో మంది జంటలకు ఆదర్శం. అయితే నమ్రత- మహేష్ పెళ్లి చేసుకుని ఇవాళ్టికి 21 ఏళ్లు. ఈ సందర్భంగా నమత్ర సోషల్ మీడియాలో చేసిన స్పెషల్ పోస్ట్ అందరి దృష్టిని ఎట్రాక్ట్ చేస్తోంది.

కాలం మారినా, భావాలు మాత్రం అలాగే నిలిచిపోయాయని మరోసారి రుజువు చేసింది నమ్రత చేసిన ఈ స్పెషల్ పోస్ట్. "హ్‌అశ్రీశ్రీ ఎష్ట్రశీశీంఅఅస్త్ర ఎశీబడ వజవతీఎఝఎ" అంటూ తన భర్త మహేష్ బాబుకు 21వ మ్యారేజ్ యానివర్సరీ సందర్భంగా షేర్ చేసిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. స్టార్ డమ్, గ్లామర్, కెరీర్ ఒత్తిళ్ల మధ్య కూడా ఒక బంధాన్ని ఇంత అందంగా నిలబెట్టుకోవడం మహేష్ బాబు
-నమ్రతల స్పెషాలిటీ. మిస్ ఇండియా విజేత అయిన నమ్రత తర్వాత హీరోయిన్ గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సమయం నుంచే మహేష్ బాబుతో పరిచయముంది. వంశీ మూవీ టైమ్ లో మొదలైన వీరిద్దరి స్నేహం, ఆ తర్వాత ప్రేమగా మారి, అది పెళ్లి వరకు వెళ్లింది. 2005, ఫిబ్రవరి 10న వీరిద్దరూ పెళ్లితో ఒక్కటయ్యారు. పెళ్లి చేసుకున్న తర్వాత వీరిద్దరి జంట టాలీవుడ్ ఇండస్ట్రీకే ఓ ఐడియల్ కపుల్ గా నిలిచింది.

# వారణాసిలో ప్రియాంక పాత్ర

## రాజమౌళి సినిమాలంటే ఇష్టమన్న నిక్


ఎస్.ఎస్ రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా నటిస్తోన్న చిత్రం 'వారణాసి'లో ప్రియాంక చోప్రా.. మందాకిని అనే ప్రధాన పాత్రలో కనిపించనున్న విషయం తెలిసిందే. ప్రియాంక ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడంపై ఆమె భర్త నిక్ జోనస్ మొదటిసారి స్పందించారు. ఈ సినిమా గురించి ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రస్తావించారు. తను 14 నెలల నుంచి ఓ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉంది. 'ఆర్ఆర్ఆర్' లాంటి గొప్ప చిత్రాన్ని రూపొందించిన రాజమౌళి దీన్ని రూపొందిస్తున్నారు. ఆయన నుంచి వస్తోన్న మరో భారీ చిత్రమిది. అద్భుతంగా ఉండనుందని నమ్ముతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిక్ భారతీయ చిత్రాల గురించి మాట్లాడారు. తనకు ఇండియన్ సినిమాలు అంటే ఎంతో ఇష్టమన్నారు. గొప్ప చిత్రాలు ఉన్నాయని కొనియాడారు. భారతీయ సంగీతమన్నా అభిమానమన్నారు. భారత్‌లో ఉమ్మడి కుటుంబవ్యవస్థ ఉందని అది తనకు చాలా ఇష్టమన్నారు. ఏదైనా వేడుక జరిగినప్పుడు అందరూ కలిసి సరదాగా ఉంటారని తెలిపారు. 'వారణాసి' విషయానికొస్తే.. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఈ మూవీ 2027 ఏప్రిల్ 7న విడుదల కానుంది.





# 'టాక్సిక్'కు లీగల్ షాక్.. చెట్ల నరికివేత ఆరోపణలపై ఎఫ్ఐఆర్ నమోదు

కన్నడ స్టార్ హీరో యష్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' మరోసారి వివాదాల్లో చిక్కుకుంది. బెంగళూరులోని పీణ్యాజలహళ్లి సమీప అటవీ ప్రాంతంలో సినిమా షూటింగ్ సందర్భంగా అనుమతి లేకుండా వేలాది చెట్లను నరికివేశారనే ఆరోపణలు నిజమని కర్ణాటక అటవీ శాఖ తేల్చడంతో నిర్మాతలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. షూటింగ్ యూనిట్‌తో పాటు భూమిని లీజుకు ఇచ్చిన వ్యక్తులపైనా కేసులు నమోదు చేసినట్లు సమాచారం. ఈ పరిణామం ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. 'కేజీఎఫ్' సిరీస్ తర్వాత యష్ నుంచి వస్తున్న సినిమా కావడంతో 'టాక్సిక్'పై పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు నెలకొన్నాయి. మలయాళ దర్శకురాలు గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో డార్క్, ఇంటెన్స్ టోన్‌తో ఈ చిత్రం తెరకెక్కుతోంది. విజువల్స్, కథన శైలిలో కొత్త అనుభూతి అందించేందుకు వరల్డ్ క్లాస్ టెక్నీషియన్లతో




పని చేస్తున్నట్లు యూనిట్ ముందుగానే వెల్లడించింది. టీజర్ ద్వారా యష్ డిఫరెంట్ లుక్ ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించింది. ఈ సినిమాలో కియారా అద్వానీ, నయనతార, తారా సుతారియా, రుక్మిణి వసంత్ వంటి స్టార్ హీరోయిన్లు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. హుమా ఖురేషి, నటాలీ బర్న్ వంటి నటీమణులు కూడా ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్లు, క్యారెక్టర్ విజువల్స్ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. యష్ స్టైలిష్ లుక్‌కు మాస్ ఆడియన్స్ నుంచి మంచి స్పందన వచ్చింది. అయితే తాజాగా అటవీ భూమిలో అక్రమంగా చెట్లు నరికివేశారనే ఆరోపణలు తీవ్రంగా మారాయి. షూటింగ్‌కు అనుమతి ఉన్నప్పటికీ, అనుమతి పరిమితులను దాటి అడవిలో చెట్లు నరికివేయడం చట్టవిరుద్ధమని అటవీ శాఖ స్పష్టం చేసింది. అటవీ శాఖ మంత్రి స్వయంగా ఆ ప్రాంతాన్ని సందర్శించి ఫొటోలు సోషల్ మీడియాలో పంచుకోవడంతో ఈ వివాదం మరింత ముదిరింది. అనంతరం అధికారికంగా ఎఫ్ఐఆర్ నమోదు కావడం ఇండస్ట్రీలో సంచలనంగా మారింది. ఇది ఒక్కటే కాకుండా, టీజర్ విడుదల సమయంలోనూ 'టాక్సిక్'పై వివాదాలు చెలరేగాయి. టీజర్‌లోని బోల్డ్ సన్నివేశాలు, హింసాత్మక అంశాలపై కొన్ని వర్గాలు అభ్యంతరం వ్యక్తం చేయగా, మహిళా కమిషన్ వరకూ ఫిర్యాదులు వెళ్లాయి. ఒకవైపు టీజర్‌కు భారీ వ్యూస్, మాస్ రెస్పాన్స్ వస్తుండగా.. మరోవైపు వివాదాలు వెంటాడుతూనే ఉన్నాయి. తాజా లీగల్ ఇష్యూ సినిమా విడుదలపై ప్రభావం చూపుతుందా? లేదా మేకర్స్ అన్ని అడ్డంకులను దాటుకుని చిత్రాన్ని సమయానికి రిలీజ్ చేస్తారా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అభిమానులు మాత్రం 'టాక్సిక్' విడుదల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు.

# బైక్‌పై ప్రమాదకర విన్యాసాలు


## - యువత తీరుపై సజ్జన్నార్ హెచ్చరికలు



**హైదరాబాద్, ఫిబ్రవరి10( వెలుతురు):**
బైక్‌పై ప్రమాదకర విన్యాసాలు చేస్తున్న యువతకు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ గట్టి వార్నింగ్ ఇచ్చారు. నగరంలో యువకులు బైక్‌పై చేస్తున్న ప్రమాదకర విన్యాసాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నేపథ్యంలో సీపీ సజ్జన్నార్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. వాహనాలను బాధ్యతాయుతంగా నడపాలని సూచించారు. బైక్ మీద చేసే ఈ చిత్రవిచిత్రమైన విన్యాసాలు చూడటానికి థ్రిల్లింగ్‌గా అనిపించవచ్చని.. కానీ అవి క్షణాల్లో ప్రాణాలకు ముప్పు తెచ్చిపెడతాయని ఆయన హెచ్చరించారు. బైక్ మీద చేసే విన్యాసం.. నూరేళ్ల ఆయుష్షుకు వినాశనం అంటూ ఆయన పేర్కొన్నారు. చిన్న ప్రమాదం జరిగినా జీవితాంతం మంచానపడాల్సి వస్తుందని సీపీ అన్నారు. అంతేకాకుండా, మీ వల్ల ఇతరులు కూడా ప్రమాదాలబారిన పడొచ్చని తెలిపారు. సోషల్ మీడియాలో లైకులు, వ్యూస్ కోసం.. రోడ్డు మీద హీరోయిజం చూపించాలనే ఆశతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సజ్జనార్ సూచించారు. బైక్‌పై స్టంట్లు చేస్తూ వెనుక కూర్చున్న వ్యక్తుల ప్రాణాలను కూడా రిస్క్‌లో పెడుతున్న ఈ చర్యలు చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి వాటి వల్ల కేసుల పాలై సమస్యలను కొని తెచ్చుకోవద్దని హెచ్చరించారు. 'బాధ్యతగా డ్రైవ్ చేయండి' అంటూ సీపీ సజ్జనార్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# మారుతీ కార్ల సర్వీస్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

## - భారీగా దగ్ధమైన కార్లు...పెద్ద ఎత్తున నష్టం




**హైదరాబాద్, ఫిబ్రవరి10( వెలుతురు):**
హైదరాబాద్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్రముఖ కార్ల కంపెనీ సర్వీస్ సెంటర్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో పలు కార్లు దగ్ధమయ్యాయి. రాజేంద్రనగర్ మారుతీ సుజుకీ సర్వీస్ సెంటర్‌లో ఈ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. భారీ అగ్ని ప్రమాదం కారణంగా పరిసరాల్లో దట్టమైన పొగ అలుముకుంది. ప్రమాదంలో పలు కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, మంటలను ఆర్పేశారు. ఈ అగ్ని ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్‌లో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ల్యాబ్ భవనం మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో దట్టమైన పొగ అలుముకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని, రెండు ÷ర్ ఇంజిన్లతో మంటలను ఆర్పేశారు. ప్రమాదంలో ఆ ఎ÷-లోర్‌లోని కంప్యూటర్లు, ఫోరెన్సిక్ సంబంధిత కెమికల్స్‌తో సహా కీలకమైన పత్రాలు కాలి బూడిదయ్యాయి.

# మక్తల్ ఆరోవార్డు అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్య

## - ఎన్నికకు ఒక్కరోజు ముందే ఉరేసుకుని మృతి

**మక్తల్, ఫిబ్రవరి10( వెలుతురు):**
మక్తల్ మున్సిపల్ ఎన్నికల్లో ఆరో వార్డు కౌన్సిలర్‌గా పోటీ చేస్తున బిజెపి అభ్యర్థి ఎరుకలి మహదేవప్ప ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం తెల్లవారు జామున నారాయణపేట జిల్లా మక్తల్‌లో జరిగింది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల మేరకు . మక్తల్ మున్సిపాలిటీ 6వ వార్డు ఎస్టీలకు రిజర్వు కావడంతో ప్రధాన పార్టీలు ముగ్గురు సొంత అన్నదమ్ములనే రంగంలోకి దించాయి. ఇందులో భారతీయ జనతా పార్టీ నుండి మహదేవ్ (43), కాంగ్రెస్ నుంచి అతడి అన్న పోటీలో ఉండగా.. బిఆర్ఎస్ నుంచి పోటీ చేసిన వారి తమ్ముడు నామినేషన్ ఉపసంహరణ రోజున పోటీ నుంచి తప్పుకున్నాడు. పోటీలో ఉన్న ఇద్దరు అన్నదమ్ములు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. అయితే, నిన్నటి నుంచి డబ్బు, మద్యం పంపిణీ జరుగుతుండడంతో.. 6వ వార్డులోనూ పంపిణీ చేయాలని పార్టీ శ్రేణులు కోరినట్లుగా సమాచారం. తాను లక్ష రూపాయలు మాత్రమే ఖర్చు చేయగలను.. మిగతాది తన వల్ల కాదని సోమవారం పార్టీ శ్రేణులకు ఆయన తేల్చి చెప్పినట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలో ఒత్తిడికి గురైన మహదేవప్ప ఈరోజు తెల్లవారుజామున తన ఇంట్లో ఉరేసుకొని మృతి చెందాడు. మహదేవప్ప ప్రధాన రాజకీయ పార్టీకి చెందిన అభ్యర్థి కావడంతో ఆ వార్డులో ఎన్నిక వాయిదా పడింది. మహదేవ్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రత్యర్థుల వేధింపులతోనే మహదేవ్ ఆత్మహత్య చేసుకున్నాడని అతడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు..

# చెన్నూరులో రాక్షస పాలన నడుస్తుంది

## - బాల్క సుమన్



**చెన్నూరు ఫిబ్రవరి10( వెలుతురు):**
చెన్నూరు లో రాక్షస పాలన నడుస్తుందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారరు. చెన్నూరు మున్సిపాలిటీలో బీఆర్ఎస్ నాయకుడు మల్లేశం గౌడ్ ఇంట్లో ఎన్నికల అధికారులు, పోలీసుల తనిఖీలు నిర్వహించారు. సోదాలు చేస్తున్న అధికారుల తీరుపై బాల్క సుమన్ మండిపడ్డారు. మంత్రి వివేక్ పంపిస్తేనే వచ్చి అధికారలు సోదా చేస్తున్నారని అన్నారు. మంత్రి క్యాంప్ కార్యాలయంలో డబ్బులు, మందు సీసాలు ఉన్నాయి, అవి పోలీసులకు, అధికారులకు కనపడవు.. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదు. అధికారులు, పోలీసులు మంత్రి వివేక్కు తొత్తులుగా వ్యవహరిస్తున్నారు. కేవలం బీఆర్ఎస్ నాయకులనే టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడుతున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, ఇతర కాంగ్రెస్ నాయకుల ఇళ్లలో సోదాలు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు.

# ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో స్కూళ్లకు సెలవులు

## - రండ్రోజుల సెలవులకు తోడు కలసి వచ్చిన శని,ఆదివారాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి10( వెలుతురు):**
రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేలు స్కూళ్లలో చదివే విద్యార్థులకు వరుస సెలవులు వచ్చాయి. ఎందుకంటే ఈ వారంలో వరుసగా నాలుగు రోజుల పాటు స్కూల్‌లకు సెలవులు ఉండే అవకాశం ఉంది. ఈ సెలవులు రాష్ట్రవ్యాప్తంగా కాకుండా కేవలం కొన్ని జిల్లాలో మాత్రమే ఉండనున్నాయి. ఎందుకంటే రాష్ట్రంలో ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆరోజు ఎన్నికల పక్రియలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు




రాష్ట్రంలో ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో స్కూల్‌లకు సెలవులు ప్రకటించారు. దీంతో ఈసీ అధికారులు ఫిబ్రవరి 11న ఆయా ప్రాంతాల్లోని స్కూళ్లకు సెలవులు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఫిబ్రవరి 11న పోలింగ్ ముగిసిన ఒక రోజు తర్వాత రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు పక్రియ జరగనుంది. ఓట్ల లెక్కింపు పక్రియ అనేది పోలింగ్ జరిగిన ప్రాంతాల పరిధిలోని గవర్నమెంట్, ప్రైవేట్ స్కూల్‌లో నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో కౌంటింగ్ నిర్వహించే స్కూల్‌లకు ఆరోజు అధికారులు సెలవులు ప్రకటించనున్నారు. ఈ పక్రియ ముగిసిన మరుసటి రోజు అంటే ఫిబ్రవరి 14న రెండో శనివారం, ఫిబ్రవరి 15న ఆదివారం ఎలాగో హాలీడే కావడంతో వరుసగా రెండ్రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా స్కూల్‌లకు సెలవులు ఉండనున్నాయి. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఈ వారంలో నాలుగు రోజులు పాటు సెలవులు దొరకనున్నాయి.

# మున్సిపల్స్‌కు అంతా రెడీ

## - బరిలో 12,930 మంది అభ్యర్థులు

## - మరి కొద్ది గంటల్లో పోలింగ్

**హైదరాబాద్, ఫిబ్రవరి10( వెలుతురు):**
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల తీర్పు ఎటువైపు ఉండనుందో బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తంకానుంది. గత పది రోజులుగా హోరెత్తిన మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. బుధవారం పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం సోమవారం సాయంత్రం అయిదు గంటలకు అధికారికంగా ప్రచారం ముగిసింది. రాష్ట్రంలోని ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లోని 2,982 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. మరో 14 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ఈ ఎన్నికల్లో 52.43 లక్షల మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 12,930 మంది తమ భవితవ్యాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ ఎన్నికల్లో ఏ పార్టీ సైతం అన్ని స్థానాల్లో అభ్యర్థులను నిలపకపోవడం విశేషం. ఈ ఎన్నికల్లో మరో విశేషం సైతం నమోదైంది. మొత్తం అభ్యర్థుల్లో మహిళా అభ్యర్థులే అధిక సంఖ్యలో ఉన్నారు. మొత్తం 12,930 మందిలో పురుషులు 6,434 (49.76 శాతం) మంది కాగా, మహిళలు 6,496 (50.24 శాతం) మంది.

### అత్యధికంగా కరీంనగర్‌లో అభ్యర్థులు

అత్యధికంగా కార్పొరేషన్లలో కరీంనగర్‌లో మొత్తం 66 డివిజన్లకు గాను 398 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మున్సిపాలిటీలలో ఆదిలాబాద్‌లో 49 వార్డులకు గాను 314 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అత్యల్పంగా కొడంగల్ మున్సిపాలిటీలో 12 వార్డులకు గాను 34 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు.




### పార్టీల వారీగా చూస్తే..

అత్యధికంగా కాంగ్రెస్ పార్టీ 2,948 (98.3 శాతం) స్థానాల్లో, బీఆర్ఎస్ 2,878 (96 శాతం) స్థానాల్లో, బీజేపీ 2,634 (87.3 శాతం) స్థానాల్లో పోటీలో నిలిచాయి. మరోవైపు స్వతంత్ర అభ్యర్థులు 2,786 (94 శాతం) స్థానాల్లో బరిలో నిలిచారు. జనసేన పార్టీ 332 (11.1 శాతం) స్థానాల్లో, మజ్లిస్ పార్టీ 282 (9.4 శాతం) స్థానాల్లో, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ 288 (9.6 శాతం) స్థానాల్లో, బీఎస్పీ 213 (7.3 శాతం) స్థానాల్లో, సీపీఐ 168 (5.6 శాతం) స్థానాల్లో, సీపీఎం 108 (4.2 శాతం) స్థానాల్లో, ఆప్ 38 (1.2 శాతం) స్థానాల్లో, ఐయూఎంఎల్ తొమ్మిది (0.3 శాతం) స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలో దింపాయి. టీడీపీ, వైఎస్సార్‌సీపీ పార్టీల నుంచి పలువురు నామినేషన్లు వేసినప్పటికీ, బీఫారాలు సమర్పించకపోవడంతో అవి తిరస్కరణకు గురయ్యాయి. మరోవైపు ఖమ్మం జిల్లాలో టీడీపీ అభ్యర్థులు ఇతర పార్టీల గుర్తులపై పోటీ చేస్తున్నారు.

### ఏకగ్రీవమైనవి ఇవే..


మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లోని 58వ డివిజన్‌లో రమాదేవి, రామగుండం కార్పొరేషన్‌లోని ఒకటో డివిజన్‌లో మాడిపల్లి విజయ, చౌటుప్పల్‌లో చింత ఉమామహేశ్వరి (17వవార్డు), హాలియాలో పిల్లి చంద్రకళ(10), ఎదులాపురంలో తమ్మినేని మంగతాయి(15), హుజూర్‌నగర్‌లో నాగలక్ష్మి(3), కోదాడలో దేవరపల్లి మల్లేశ్వరి(11), వై.కుసుమకుమారి(31), కట్టెబోయిన జ్యోతి(21), మెదక్‌లో గౌడల మానస(32), వికారాబాద్‌లో అనంతరెడ్డి(1), యాదగిరిగుట్టలో గుండిపల్లి వాణి (10) కాంగ్రెస్ పార్టీ తరపున, అలంపూర్‌లో విక్రం(10), వికారాబాద్‌లో విజయలక్ష్మి (15వ వార్డు) బీఆర్ఎస్? తరపున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

### పోటీలో 775 పోస్ట్ గ్రాడ్యుయేట్లు..

మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయనున్న మొత్తం అభ్యర్థుల్లో 775 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఉండడం గమనార్హం. గ్రాడ్యుయేట్లు 2,903 మంది, అండర్ గ్రాడ్యుయేట్లు 7,917 మంది కాగా, నిరక్షరాస్యులు 1,291 మంది.

# కోర్టుకు నరవణె

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి10( వెలుతురు):**
భారత ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ (ఎంఎం) నరవణే రాసిన పుస్తకం ఇంకా అధికారికంగా విడుదల కాకముందే వివాదంలో చిక్కుకుంది. ఆయన రాసిన ఆత్మకథ 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకంలోని అంశాలు, పీడీఎఫ్ కాపీలు చట్టవిరుద్ధంగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. జనరల్ నరవణే తన అనుభవాలను పొందుపరుస్తూ రాసిన ఈ పుస్తకం ప్రస్తుతం రక్షణ శాఖ, విదేశాంగ శాఖల అనుమతి కోసం వేచి ఉంది. ఇందులో అగ్నిపథ్ స్కీమ్, తూర్పు లడఖ్‌లో చైనాతో ప్రతిష్టంభన వంటి కీలకమైన అంశాలను నరవణే ప్రస్తావించినట్లు సమాచారం. అయితే, పుస్తకం ప్రచురణకు నోచుకోకముందే, అందులోని కొన్ని భాగాలు ఫోటోల రూపంలోనూ, పీడీఎఫ్ రూపంలోనూ వాట్సాప్, టెలిగ్రామ్ లాంటి మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. అనుమతి లేకుండా, ప్రచురణ కాకుండానే పుస్తకాన్ని లీక్ చేయడం, కాపీరైట్ ఉల్లంఘన కింద పరిగణించబడుతుంది. ఈ వ్యవహారంపై ఫిర్యాదు అందడంతో ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ పుస్తకంలోని కంటెంట్‌ను ఎవరు లీక్ చేశారు? ఎక్కడి నుంచి ఇది మొదలైంది? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చట్టవిరుద్ధంగా ఈ పుస్తకాన్ని ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిస్తున్నారు. ఆమోదం కోసం వేచి ఉన్న ఈ




పుస్తకానికి సంబంధించిన విషయాలను అనధికారికంగా ప్రసారం చేయడమనే ఉల్లంఘన ఇందులో ఉంది కాబట్టి ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కాపీరైట్ ఉల్లంఘనలు, అక్రమ పంపిణీ లేదా ఇతర లోపాలు జరిగే అవకాశం దర్యాప్తులో భాగంగా ఉంటుంది. ఈ సమస్య సున్నితత్వం దృష్ట్యా, అధికారిక కేసు నమోదు చేసి, దర్యాప్తును ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగానికి అప్పగించారు. లీక్ మూలం, అందుకు గల బాధ్యులు, ఎలా బయటకు వచ్చిందో దర్యాప్తు బృందాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తాయి. దర్యాప్తు వెల్లడైన వివరాలు ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నరవణే పుస్తకంలో అంశాన్ని మొదటిసారి లేవనెత్తారు. స్పీకర్ అభ్యంతరం వ్యక్తంచేయడంతో ప్రతిపక్షాలు నిరసన తెలిపాయి. భారత్-చైనా సరిహద్దు వివాదానికి సంబంధించిన ప్రస్తావన అందులో ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశం తీవ్ర రాజకీయ దుమారానికి కేంద్ర బిందువుగా మారడంతో లోక్‌సభ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో ఎనిమిది మంది ఎంపీలను సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి లోక్‌సభ కార్యకలాపాలు సజావుగా సాగడం లేదు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం లేకుండానే ఆమోదం పొందింది. అయితే, విపక్ష ఎంపీలు మోదీపై దాడి చేస్తారనే తనకు సమాచారం ఉండటంతో ప్రధానిని తాను సభకు రావద్దని కోరినట్టు స్పీకర్ ఓం బిర్లా చేసిన ప్రకటనపై విమర్శలు వెల్లువెత్తాయి. సాధారణంగా ఆర్మీ చీఫ్‌లు పదవీ విరమణ తర్వాత రాసే పుస్తకాలకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన అంశాలు బహిర్గతం కాకూడదనే ఉద్దేశంతో ఈ నిబంధన ఉంది. నరవణే పుస్తకంలో 2020 గల్వాన్ ఘర్షణలు, అగ్నిపథ్ నియామక ప్రక్రియపై సంచలన విషయాలు ఉన్నాయని వార్తలు వచ్చాయి. ప్రభుత్వం దీనిని సమీక్షిస్తుండగానే, ఈ లీక్ జరగడం గమనార్హం.

# తగలబడందా... తగలబెట్టేరా

**హైదరాబాద్, ఫిబ్రవరి10( వెలుతురు):**
హైదరాబాద్‌లోని స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో సంభవించిన భారీ అగ్నిప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఈ ప్రమాదంలో కీలకమైన కేసులకు సంబంధించిన ఆధారాలు, డిజిటల్ సాక్ష్యాలు అగ్నికి ఆహుతయినట్లుగా తెలుస్తోంది. సుమారు రెండు గంటల పాటు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చినప్పటికీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఉదయం వేళ కార్యాలయం పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో, అకస్మాత్తుగా కంప్యూటర్ ల్యాబ్ విభాగం నుంచి మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు ఇతర విభాగాలకు వ్యాపించాయి. దట్టమైన పొగలు భవనం మొత్తాన్ని కమ్మేశాయి. ఈ ప్రమాద సమయంలో లోపల ఉన్న ఒక వ్యక్తికి గాయాలు కాగా, వెంటనే అప్రమత్తమైన సహచరులు బాధితుడిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రమాద వార్త తెలియగానే డీసీపీ శిల్పవల్లి సంఘటనా స్థలానికి చేరుకుని




పరిస్థితిని సమీక్షించారు. అగ్నిమాపక యంత్రాలు మంటలను ఆర్పే ప్రక్రియను ఆమె స్వయంగా పర్యవేక్షించారు. ఫోరెన్సిక్ ల్యాబ్ వంటి అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే చోట అగ్నిప్రమాదం జరగడంపై ఆమె అధికారులను ఆరా తీశారు. అసలు మంటలు ఎలా మొదలయ్యాయి? షార్ట్ సర్క్యూట్ కారణమా లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో ప్రాథమిక విచారణ చేపట్టారు. ఈ ప్రమాదంలో అత్యంత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే.. కంప్యూటర్ ల్యాబ్‌లో ఉన్న అనేక కీలకమైన కేసుల డేటా , భౌతిక పత్రాలు కాలి బూడిదయ్యాయి. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన పలు నేరాలకు సంబంధించిన డిజిటల్ సాక్ష్యాలు, ఫోరెన్సిక్ విశ్లేషణలు ఈ ల్యాబ్‌లోనే ఉన్నాయి. సాక్ష్యాలు బుగ్గిపాలు కావడంతో ఆయా కేసుల విచారణపై ఈ ప్రభావం పడే అవకాశం ఉందని న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఫోరెన్సిక్ కార్యాలయాల్లో ఫైర్ సేఫ్టీ వ్యవస్థలు పకడ్బందీగా ఉంటాయి. అలాంటిది కంప్యూటర్ ల్యాబ్‌లోనే మంటలు రావడం, కీలక పత్రాలు ఉన్న చోటే ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎవరైనా కావాలనే సాక్ష్యాలను రూపుమాపడానికి ఈ పని చేశారా? అనే కుట్ర కోణం పై పోలీసులు దృష్టి సారించారు. ల్యాబ్‌లోని సీసీటీవీ విజువల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. క్లూస్ టీమ్ , ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్నారు. కంప్యూటర్లలోని హార్డ్ డిస్క్‌లు ఎంతవరకు దెబ్బతిన్నాయి, వాటి నుంచి డేటాను రికవరీ చేసే అవకాశం ఉందా అనే దానిపై ఐటీ నిపుణుల సలహాలు తీసుకుంటున్నారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఫోరెన్సిక్ నివేదికలు తారుమారైతే నేరస్తులకు మేలు జరుగుతుందనే కోణంలో పోలీసులు అత్యంత జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com